విజయనామసం కార్తీకము — భారతి — సంపుటము 30, సంచిక - 11

1. మణిదీపిక - శ్రీ పి. గణపతిశాస్త్రి — 383-384
2. కావ్యాలంకారాలు - శ్రీ ముట్నూరి సంగమేశం - 385-390
3. నాటకావతరణము - శ్రీ శ్రీ[illegible] కృష్ణమాచార్యులు - 391-392
4. కృతజ్ఞతాజ్ఞాపనము - శ్రీ ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి, శ్రీ ఆర్. వి. రమణారావు — 393-395
5. శరదవసరము - శ్రీ గట్టి లక్ష్మీనరసింహశాస్త్రి — 396-397
6. మన విమర్శకులు మన విమర్శయు - శ్రీ [illegible] శివరామకృష్ణమూర్తి - 398-402
7. వి[illegible] మంత్రం — శ్రీ పంచాగ్నుల శ్రీరామశాస్త్రి — 415-424
8. భాగవతంలో బృహస్పతి — శ్రీ రాళ్ళపల్లి గోపాలకృష్ణమాచార్యులు - 425-433
9. లబ్ధి — శ్రీ నాయని కృష్ణకుమారి — 434
10. కిటికీ — శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి — 435-442
11. మళ్ళీ పెళ్ళి — శ్రీ ఆముంచి నారాయణమూర్తి — 453-469
12. స్వతంత్ర పరిణామములు — శ్రీ వసంతరావు వెంకటరావు - 470-476
13. గ్రంథ విమర్శనములు — 477-478



విజయ
కార్తికము

భారతి

సంపుటము 30
సంచిక 11

మణిదీపిక

★

శ్రీ. పి. గణపతిశాస్త్రి

తెలి రేలుపూల జల్లులయి, తీయని నీ కరుణావియన్నదీ
జలపరివాహమై విశదశారద కౌముది, నీలసాంధ్యవే
ళల మెరయించినంత, కనులం దరశాశ్రుపు లొల్క, సంభ్రమో
చ్ఛలిత మెడంద నీపదదిశం బయనించె మహోర్మరాళమై!

నాకనులం జెలంగుచు ననారత మిాశరదిందుశుభ్రశే
ఖాకృతు లొక్కరూపయి, హృదంతర పీఠికపై నొనర్చె, ము
క్తాకమనీయ సుస్మిత వికస్వరమున్ లసదింద్రచాప శో
భాకరమాళి తావక మహశ్శివమూర్తి వెలింగి నిండగన్

అహరహముం బ్రఫుల్ల దళమై, స్థిరమై భవదీయ వేదనా
దహన హిరణ్య తామరస దామము నీపదధామ మందుకో
దహితహా ముమ్మరింప నరుతం గయిసేయుదు నమ్మ! విస్మయా
వహములు నీదు కాన్కలు, కృపానమితాభయహస్త గుప్తముల్!

నీదయ తప్పెనేని యవనింగల భాగ్యములెల్ల కొల్లలై
పో దరిజేర్చి, మేనమరపుం బెనుమత్తొదవింతుగాని, నీ
వై దురదృష్టకంటక సుమావళిమాలికఁ గూర్చి, సంభృతా
ద్రాఘిదరవై ప్రపన్న జనతాలకలం ఘటియింతు కావ్యగన్

పదలాక్షారుణిమల్ చెలంగ, వినమద్వర్షాభ్రనీలా! దురా
పదలన్ ప్రీలిన పేదగుండియల జృంభద్రక్తధారాదిశా
పదవిన్ నీవరుదెంచి, వత్సలత నాపన్నుత తాళిన్ క్షమా
మృదుబాష్పావళి జార నద్దెదవు నెమ్మిం గల్లకాశ్మీరముల్

ఆరతులై సమున్నతనభోంగణ తారకలందలేని మం
దారయుగమ్ము నీ మృదుపదద్వయి వెల్గును తల్లి! దుఃఖపూ
రారుణనేత్రులై, శ్రమభరానతులై, హతభాగ్యదీపికాం
కూరులునైన దీనుల వికుంచిత జీర్ణకుటీప్రభాతమై

కవనవనాన, శాశ్వత సుగంధ మనోజ్ఞము లార్ద్రభావనా
నవనవ మంజరీదళ వినమ్రసుమమ్ములు దోయిలించి, సైం
దవ మణిపీఠి గొల్వయి సదావరదానతపాణివైన నీ
భవన కవీంద్రవై భవ శుభమ్ము లభించెనటంచు బొంగెదన్ !



కావ్యాలంకారాలు

★

శ్రీ ముట్నూరి సంగమేశం

ఏదైనా ఒక విషయాన్ని వేరొకరితో చెప్పవలసి వచ్చినపుడు, ఆ చెప్పేది కొంత చమత్కరించి చెప్పడం అనేది అన్ని భాషలలోనూ ఉన్నది. అలా చెప్పడం, కేవలం చమత్కారప్రియత్వం చేతనే గాదు; చెప్పినది వినేవారికి బాగా నచ్చి, హృదయానికి పట్టేటట్లుగా ఉండాలిగదా అనే అభిప్రాయం కూడ వక్తచేత అందుకనువైన పద్ధతిలో మాటాడింపజేస్తుంది. ఒకే విషయాన్ని పదిమంది పది విధాల చెప్పి తమ నేర్పు చూపుతూ ఉంటారు. అంటే చమత్కరించి చెప్పేధోరణి ఆయా వక్తల సంస్కారాన్నిబట్టి అనేక విధాల, అనేక తరహాల, ఉంటుందన్నమాట. ఈ విశేషమైన మాటనేర్పుకి సాహిత్యశాస్త్రంలో ఉక్తివైచిత్రి లేక అలంకారం అని పేరు. కవి తన అభిప్రాయాన్ని పాఠకుల హృదయానికి పట్టేటట్లు చెప్పాలంటే, అందుకనుకూలమైన పద్ధతిలో చెప్తాడు; వినగానే మన హృదయాన్ని ఆకర్షించేవిధంగా, తన వాక్యాలను చమత్కరించి చెప్తాడు. అయితే యీ చెప్పే పద్ధతులు అనేకంగా ఉంటాయి కనుక ఒకొక్క పద్ధతికి ఒకొక్క పేరుపెట్టి పిలవడం, ఆ పద్ధతికిగల అవాన్తరాలో చెప్పడం, అనేది అలంకార లక్షణ నిర్వచనానికి త్రోవతీసింది. కాని యీ పద్ధతులు లేక వాగ్వైఖరులు ఎన్ని ఉంటాయి? అని అంటే చెప్పడం చాలా కష్టం. 'లోకో భిన్నరుచి!' అన్నట్లు ఒకరికి నచ్చిన పద్ధతి మరొకరికి నచ్చక, తమకు నచ్చిన వేరొక క్రొత్తపద్ధతిలో వారు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చెయ్యవచ్చు. వాడుకలోనికి వచ్చిన ఆయా క్రొత్తక్రొత్త వాక్యరచనాపద్ధతులను, ఎప్పటికప్పుడే ఆలంకారికులు కనిపెట్టి, వాటికి లక్షణం నిర్వచించి, నామకరణంచేసి, అలంకారాల సంఖ్యను పెంచుతూ ఉండడం సంప్రదాయముగా ఏర్పడింది. అయితే యీ సంప్రదాయం సంస్కృతంలో వ్రాసిన అలంకార గ్రంథాలలోనే కనిపిస్తుంది గాని మన తెలుగులో లేదు. తెలుగులో వ్రాసిన అలంకార గ్రంథాలు సంస్కృతంలో ఉన్న విషయాన్ని తెలుగు భాషలోకి దింపగలిగేయిగాని అంతకుమించి మరో అడుగు పైగా వెయ్యలేదు. ఇది కారణంగా పదునేనవ శతాబ్దంవరకు అవిచ్ఛిన్నంగా, మార్పులకు చేర్పులకు కూడా ఎడమిచ్చి, వికసిస్తూ వచ్చిన అలంకార శాస్త్రం, ఆ తరవాత నేటివరకు నూతనవికాసం పొందకుండా నిలిచిపోయింది. అయితే లక్షణానికి సంబంధించిన శాస్త్రం వికసించకపోయినా, తల్లక్ష్యమైన సాహిత్యం మాత్రం అవిచ్ఛిన్నంగా వికసిస్తూ ఉండటం గమనించతగ్గది. నేడు నవ్యాంధ్ర సాహిత్యం అభూతపూర్వమైన పద్ధతులలో వికసిస్తోంది. అనేక రకాలైన వాక్యరచనాపద్ధతులు నేటి తెలుగు కవితలో గోచరిస్తున్నాయి. ఆ యీ లక్ష్యాలనుబట్టి లక్షణం నిర్వచించవలసిన బాధ్యత ఆలంకారికులది. అస్తు. ఆదినుండి నేటివరకు మన అలంకారశాస్త్రం ఏయే మార్గాల వికసించిందో, ఎవరెవరిచేత ఎన్నెన్ని క్రొత్తక్రొత్త అలంకారాలు సలక్షణంగా నిర్వచించబడ్డాయో కొంతవరకు చూడదగిన విషయం.

అలంకారాలను గురించి వ్రాయబడిన గ్రంథాలలో, యిప్పటికి దొరికినంతమేరకు భరతుని నాట్యశాస్త్రమే అన్నిటికంటె ప్రాచీనమైన గ్రంథము. ఇది నాట్యానికి సంబంధించిన శాస్త్రమే అయినా నాట్యాంగాలలో ఒకటైన వాచికాభినయానికి సంబంధించిన విషయం గనుక అలంకార విషయం కూడ ఇందులో ప్రస్తావించబడింది. అయితే ఇందులో పేర్కొబడిన అలంకారాలు ఉపమ, రూపకం, దీపకం, యమకం అనేవి నాలుగుమాత్రమే. భరతుని తరువాత అగ్నిపురాణంలో వ్యాసభగవానుని చేత కావ్యాంగాలన్నిటితోపాటు అలంకారాలను గూర్చికూడ ప్రస్తావన చేయబడింది. ఇందులో అలంకారాల సంఖ్య 21 వరకు పెరిగింది. శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు అనే విభేదం స్పష్టంగా చెప్పబడకపోయినా, రెండూ రెండు వేర్వేరు అధ్యాయాలలో పేర్కొనడం యీ గ్రంథంలో గల మరో విశేషం. కాని "అర్థాలంకారరహితా విధవైవ సరస్వతీ" అనే వాక్యంవల్ల, అలంకారాల శబ్దార్థగత విభేదం అనాటికే ప్రచలితమైనట్లు తెలుస్తోంది.

ఇంతేగాక అర్థాలంకారాలలో తిరిగివర్గవిభేదం చెయ్యడానికి పునాదులు వేస్తున్నట్లు కూడ, స్వరూప, ఉపమా, రూపక, సహోక్తులను సాదృశ్య మూలకాలని పేర్కొనడంవలన గ్రహింపవచ్చును. అలంకారాల వికాసానికి అగ్నిపురాణ నిర్మాణకాలమే ఆరంభదశ అని చెప్పవచ్చునుకూడ.

అగ్నిపురాణం తర్వాత భామహుడు, దండి, ఉద్భటుడు, వామనుడు మున్నగువారు వ్రాసిన అలంకార గ్రంథాలు తద్వికాసక్రమాన్ని స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. వీరందరు ఎనిమిదవ శతాబ్దానికి పూర్వులు. వీరందరూ అలంకార ప్రియులు కావడంచేత వీరి కాలంలో అలంకారాలకి ఎక్కువ ప్రాధాన్యం, ప్రచారం కూడ లభించేయి. కావ్య సౌందర్యమే అలంకారమనీ, అలంకారంవల్లనే కావ్యాన్ని అంగీకరించాలనీ, రీతులు, వృత్తులు, గుణాలు రసము వగైరాలన్నీ అలంకారాంతర్గతాలే అనీ, యీ కాలంలో అనేక రకాల సిద్ధాంతాలు బయలుదేరాయి. అలంకారం అంటే చమత్కరించి చెప్పిన ఉక్తి లేక వక్రోక్తి అని అంగీకరించినా అదే కావ్యానికి జీవమనికూడ నిర్ణయించబడింది. కథాకల్పనను ప్రకరణ వక్రత అనీ, ధ్వనిని ఉపచార వక్రత అనీ, అలంకారాన్ని వాక్య వక్రత అనీ చెప్పి అంతటా వక్రత, లేక చమత్కృతినే, ప్రధానంగా గ్రహించి లక్షణం నిర్వచింపబడుతూ వచ్చింది. రసం ఒకఅలంకారంగానూ, వక్రోక్తికి సాధకంగానూ అంగీకరించబడింది. అయితే యివేవీ తుది నిర్ణయాలు కాలేకపోయాయి. అలంకారవాదులు అలంకారమే సాధ్యమని అంటే రీతివాదులు రీతులనే సాధ్యాలుగా చెప్పారు. ఇలాటి తర్జన భర్జనలు ప్రారంభదశలో ఏ శాస్త్రానికైనా మామూలుగా జరుగవలసినవే. వీటివల్లగాని అసలు సత్యం బయటపడదు. ఆ దృష్టితో చూస్తే ఆయా వాదాలన్నీ శాస్త్రవికాసానికి ఉపయోగపడేవే అని అంగీకరించక తప్పదు. ఈ రకమైన వివిధసిద్ధాంతాలతో పాటుగా యీ కాలంలో అనేక నవీనాలంకారాల లక్షణాలు నిర్వచించబడ్డాయి. అంతకంతకూ అలంకారాలసంఖ్య పెరుగుతూవచ్చింది. భామహునిచేత 38 అలంకారాలు పేర్కొనబడ్డాయి. వీటిలో రసభావాలకి సంబంధించిన రసవత్, ప్రేయస్, ఊర్జస్వివంటి అలంకారాలు గాక, ఆశీః, ఉదాత్త, భావికాది వస్తునిర్దేశకాలైన అలంకారాలు కూడ జాగా సంపాదించుకొన్నాయి. అప్రస్తుత ప్రశంస, తుల్యయోగిత, నిదర్శన, పరివృత్తి, యథాసంఖ్యంవంటి వెన్నో క్రొత్తగా పేర్కొనబడ్డాయి. ఉపమాంతర్భూతంగా ప్రతివస్తూపమ, అనుప్రాసభేదాలలో లాటానుప్రాస నిర్వచింపబడ్డాయి. అతఃపూర్వం ఎవరిచేతనో పేర్కొనబడిన లేశ సూక్ష్మాలంకారాలు ఖండించబడ్డాయి. కాని యీ రెంటినీ దండి తన కావ్యాదర్శంలో తిరిగి పునరుద్ధరించేడు. వీటికి తోడు ఆవృత్తిదీపకాన్ని క్రొత్తగా నిర్వచించేడు.

ఉద్భటుని కావ్యాలంకార సారసంగ్రహంలో 41 అలంకారాలు పేర్కొనబడ్డాయి. వీటిలో దృష్టాంతం, కావ్యలింగం, పునరుక్తవదాభాస అనేవి నవీనాలు. ఈయన సమకాలికుడైన వామనుడు వ్యాజోక్తి వక్రోక్తులను క్రొత్తగా పేర్కొన్నాడు. వీరిరువురు క్రీస్తుశకం ఎనిమిదవ శతాబ్దానికి చెందినవారు. ఈనాటికి మన అలంకార చరిత్రలో ఆరంభదశ పూర్తి అయినది. రమారమి ఏబదివరకు అలంకారాలు లక్ష్య లక్షణములతో సహా నిర్వచింపబడినవి. అయితే యీ సందర్భంలో గమనించవలసిన విషయం మరొకటి ఉంది. అదేది అంటే అలంకారాల సంఖ్య ఓ క్రమంలో పెరగకపోవడం. ముందటివారు చెప్పిన అలంకారాలలో కొన్నిటిని మాత్రమే వెనుకటివారు గ్రహించడం, కొన్నిటిని ఖండించి, మరి కొన్నిటిని విడిచిపెట్టి, వేరే సరిక్రొత్తగా కొన్ని చేర్చడం, వారివారి గ్రంథాలనుబట్టి మనం తెలుసుకోవచ్చును. అదే అలంకారాల సంఖ్యను క్రమగతిలో పెరుగనివ్వక ఎగుడుదిగుడుగా నడిపించిన కారణమనికూడా గ్రహించవచ్చును.

ఎనిమిదవ శతాబ్దంనుండి తిరిగి పన్నెండవ శతాబ్దంవరకూ మన అలంకారచరిత్రలో రెండవ దశగా చెప్పవచ్చును. ఈ కాలంలో అలంకార, అలంకార్యాల విభేదం ఎక్కువగా పాటింపబడసాగింది. అలంకరించేది అలంకారమనీ, అలంకరింపబడేది రసమనీ, రసమే కావ్యజీవనమనీ లేదా కావ్యాత్మ అనీ అంగీకరించబడింది. ధ్వని సంప్రదాయముకూడ యీ కాలంలోనే వెలసింది. ధ్వనిలో వస్తుధ్వని, అలంకారధ్వని, కూడా అంగీకరింపబడినా రసధ్వనిమాత్రమే సర్వోత్కృష్టమైనదనీ, అదే సాధ్యమనీ, తక్కినవి సాధకాలనీ నిర్ణయింపబడింది. అలంకారాల మూలప్రవృత్తు లేవో గ్రహించి, వాటి ననుసరించి వర్గీకరణ చేయబడింది. అలంకారాల సంఖ్య, రమారమి నూరు వరకు పెరిగింది. అలంకార విషయ వివేచనకూడ అత్యంత సూక్ష్మంగానూ, గంభీరమైన తర్కంతోనూ చేయబడింది. ఈ తర్కనిర్ణయాల ఫలితంగా రసభావాదులకి సంబంధించిన అలంకారాలు అలంకార స్థానంనుండి దిగజార్చబడ్డాయి. అస్తు. ఈ

కాలంలో రుద్రటుడు, భోజుడు, మమ్మటుడు, రుయ్యకుడు ముఖ్యులైన ఆలంకారికులు.

నవీనాలంకారాలను అత్యధికంగా చెప్పిన కీర్తి రుద్రటునికి దక్కవలసి ఉంటుంది. ఇతడు 58 అలంకారాలు పేర్కొన్నాడు. అందులో 29 వరకు సరి క్రొత్త అలంకారాలు. కాని లెక్క తబ్బిబ్బులుపడి ఏడు అలంకారాలు, రెండుసార్లు లెక్క పెట్టాడు. అవి మినహాయిస్తే 51 అలంకారాలు యీయన చెప్పాడని గ్రహించవచ్చును. భోజుని సరస్వతీ కంఠాభరణంలో రీతులు వృత్తులుకూడ అలంకారాలుగా పరిగణించబడ్డాయి. శబ్దాలంకారాలలో ఛాయా, ముద్రా వాకో వాకాదులు అగ్నిపురాణ మతాన్ననుసరించి నిర్వచింపబడ్డాయి. అతఃపూర్వం ఎవరూ చెప్పనివి తొమ్మిది క్రొత్తగా అలంకారపట్టికలో చేర్చబడ్డాయి. శబ్దాలంకారాలు 24 అర్థాలంకారాలు 24 ఉభయాలంకారాలు 24 వేర్వేర సోదాహరణంగా నిరూపించబడ్డాయి.

మమ్మటుని కావ్యప్రకాశిక మనకున్న ప్రామాణిక గ్రంథాలలో ఒకటి. ఇందులో అలంకార విషయమే గాక తక్కిన కావ్యాంగాలన్నీ చక్కగా నిరూపించబడ్డాయి. ధ్వని రసవాదాలకి ఒక చక్కని సమన్వయం కూర్చబడింది. ఎనిమిది శబ్దాలంకారాలు 62 అర్థాలంకారాలు మమ్మటుడు పేర్కొన్నాడు. వీటిలో మాలాదీపకం, వినోక్తి, అతద్గుణం, సామాన్యం, సమం అనేవి అయిదు నవీనాలు. రసవదాది అలంకారాలను యితడు గుణీభూతవ్యంగ్యాలుగా గ్రహించాడు. రీతులు, వృత్తులు మున్నగునవి అలంకారాలు కావని నిరూపించేడు. అలంకార విషయాన్ని అతి విపులంగా చర్చించిన గ్రంథం రుయ్యకుని అలంకార సర్వస్వం. ఇందులో రసవదాది వర్గంలోని భావసంధి, భావశబలత, భావోదయాలు తిరిగి అలంకారాలుగా పేర్కొబడ్డాయి. ఉల్లేఖం, కావ్యార్థాపత్తి, పరిణామం విచిత్రం, వికల్పంవంటివి రుయ్యకుడు చెప్పిన నవీనాలంకారాలు.

అలంకారాల వర్గీకరణ యీ కాలంలో సర్వసామాన్యమైన విధంగా జరిగింది. అలంకారాలలో శబ్దప్రధానమైనవి శబ్దాలంకారాలనీ, అర్థప్రధానమైనవి అర్థాలంకారాలనీ అగ్నిపురాణం నాటికే అంగీకరింపబడినట్లు లోగడ చెప్పాను. శబ్దార్థోభయ ప్రధానమైనవి ఉభయాలంకారాలని ఆ తర్వాత పేర్కొబడింది. వేర్వేరు అలంకారాలు నిర్వహించే కార్యాన్ని బట్టి ప్రతీయమాన వస్తువులనీ, ప్రతీయమాన ఔపమ్యాలనీ ప్రతీయమాన రసభావాదులనీ, స్ఫుటప్రతీయమానాలనీ, అర్థాలంకారాలు తిరిగి నాలువిధాల విభాగించబడ్డాయి. మూలతత్త్వాన్ని గ్రహించి అలంకార వర్గీకరణ చేయడానికి తొలుత రుద్రటుడు పూనుకొన్నాడు. వాస్తవాలంకారాలనీ, ఔపమ్య మూలకాలనీ, అతిశయ మూలకాలనీ, శ్లేష మూలకాలనీ యితడు అర్థాలంకారాలను నాలుగు విభాగాల్లో చూపేడు. కాని కొంత గాథరాపడ్డాడు. సహోక్తి, సముచ్చయం, ఉత్తర అనేవి వాస్తవాలంకారాలలోనూ, ఔపమ్య మూలకాలంకారాలలోనూ కూడ పరిగణించబడ్డాయి. అలాగే విషము, హేత్వలంకారాలు వాస్తవాలు, అతిశయ మూలకాలు కూడ అయ్యేయి. ఉత్ప్రేక్ష అతిశయవర్గంలోను, ఔపమ్య వర్గంలోను కూడ పేర్కొబడింది. ఇలాటి కలగా పులగం లేని నిర్ణయం రుయ్యకుని అలంకార సర్వస్వంలో అతి చక్కని పద్ధతిలో, చేయబడింది. అలంకారాల మూలతత్వం కూడ అందులో స్పష్టంగా బోధపడుతూంది.

రుయ్యకుని అర్థాలంకార విభజన ఏడువర్గాలలో జరిగింది.

(1) సాదృశ్యవర్గము : ఇందులో ఉపమా మూలకాలైన 28 అలంకారాలు పేర్కొబడ్డాయి. అందులో తిరిగి భేదాభేద తుల్యప్రధానాలుగా, ఉపమ, ఉపమేయోపమ, అనన్వయ, స్మరణలు నాలుగు, అభేదప్రధానాలుగా రూపక, పరిణామ, సందేహ, భ్రాంతి, ఉల్లేఖ అపహ్నుతులనే ఆరోప మూలాలు ఆరు, ఉత్ప్రేక్షాతిశయోక్తులనే అధ్యవసాయ మూలాలు రెండూ కలిపి ఎనిమిది, గమ్యమాన ఔపమ్యాలుగా తుల్యయోగితాదులు పదహారు పేర్కొబడ్డాయి. గమ్యమాన ఔపమ్యాలు తిరిగి పదార్థగత, వాక్యార్థగతి, భేదప్రధాన, విశేషణ వైచిత్ర్య, విశేషణ విశేష్య వైచిత్ర్య, పరిశేషాలని ఆరు ఉపవర్గాలలో పేర్కొబడ్డాయి. పరిశేషాలని చెప్పినవాటిలో అప్రస్తుత ప్రశంస సమాసోక్తికి విరోధమైనది గనుకను, అర్థాంతరన్యాసం, అప్రస్తుత ప్రశంసకు సజాతీయమైనది గనుకను, పర్యాయోక్తి, వ్యాజస్తుతి ఆక్షేపాలు గమ్యమాన ప్రస్తావ ప్రసంగ పూర్వకాలు గనుకను, సాదృశ్యవర్గంలోనే చేర్చబడినాయి.

(2) విరోధ వర్గము : విరోధం, విభావన, విశేషోక్తి, సమం, విచిత్రం, అధికం, అన్యోన్యం, విశేషం, వ్యాఘాతం, అతిశయోక్తి, అసంగతి

విషమం అనేవి ఈవర్గంలో చెప్పబడ్డాయి. ఇందులో అతిశయోక్తి కార్యకారణ పౌర్వాపర్యానికి సంబంధించిన భేదము మాత్రమే గ్రహించబడింది. మిగిలిన అతిశయోక్తి విభేదాలన్నీ అభేద ప్రధాన సాదృశ్యమూలకాల వర్గంలోనే చేర్చబడ్డాయి.

(3) శృంఖలాబంధ వర్గము : కారణమాల, ఏకావళీ, మాలాదీపక, సారములు.

(4) తర్కన్యాయ మూలకవర్గము : కావ్యలింగం, అనుమానం.

(5) కావ్యన్యాయ మూలకవర్గము : యథాసంఖ్య పర్యాయ పరివృత్త్యాదులు.

(6) లోకన్యాయ మూలకవర్గము : ప్రత్యనీక, ప్రతీప, మీలితాదులు, వాస్తవానికి 4, 5, 6 లలో చెప్పబడినవన్నీ న్యాయమూలకాలని ఒకే వర్గం క్రింద చెప్పవలసిన ఉపభేదాలు.

(7) గూఢార్థప్రతీతి మూలక వర్గము: సూక్ష్మం, వ్యాజోక్తి, వక్రోక్తి.

రసవదాదులు ఏడింటితోపాటు స్వభావోక్తి, భావికం, ఉదాత్తం అనేవి రుయ్యకుడు ఏ వర్గంలోనూ పేర్కొలేదు. సంకర సంసృష్టుల సంగతి చెప్పనక్కరలేదు. అవి ఎలాగూ సంకర వర్గాలే. కాని రసవదాదులను విడిచిపెట్టడం అవి అలంకార కోటికి చెందవనే ఉద్దేశంతోనే జరిగిందని ఊహించవచ్చును. స్వభావోక్తి భావికోదాత్తాలు వస్తు నిర్దేశం చేసేవి గనుక వాటినిగూడ అలంకారేతరాలుగానే యితడు గ్రహించేడేమో! అలంకారం వాక్యరచనా పద్ధతి, లేక శైలి, మాత్రమే. చెప్పవలసే విషయంతో దానికి నిమిత్తంలేదు. చెప్పే తీరు నిర్దేశించడం మాత్రమే అలంకారపు పని. ఈ దృష్ట్యా స్వభావోక్త్యాదులు అలంకారా లనిపించుకోవు. కాని రుయ్యకుడు వీటికి లక్షణం మాత్రం నిర్వచించాడు. వర్గీకరణ చేసినప్పుడు ఏదో ఒక ప్రత్యేకవర్గంలో చేర్చక పోయినా భావసంధ్యాదులను అలంకారాలుగానే అంగీకరించి నిరూపించేడు. ఇదంతా చూస్తే కొంత తికమక, కొంత మొహమాటం, కొంత సందేహం పడి యిలా వ్రాసేడేమో అనిపిస్తుంది. ఏది ఎలా ఉన్నా ఈతని యీ అలంకార వర్గీకరణ మాత్రం తరువాతివా రందరిచేత యించుమించుగా పాటించబడుతూ వస్తూంది. సాదృశ్యవర్గానికి సాధర్మ్యవర్గమని పేరు పెట్టి, భేద, అభేద, భేదాభేద మూలకాలని తిరిగి మూడువిధాల విభజించడంగాని, వాక్య, లోక, తర్క, న్యాయమూలకాలన్నిటినీ న్యాయమూలకాలని ఒకేవర్గంలో పేర్కొనడంగాని ఏమంత చెప్పుకో దగిన విషయంకాదు. ఇలాటి ఈ స్వల్పవైవిధ్యాలను విస్మరిస్తే రుయ్యకుని వర్గీకరణమే నేటికీ అమలులో ఉన్నట్లు గ్రహించవచ్చును.

పన్నెండవ శతాబ్దంనుండి తిరిగి పదునేడవ శతాబ్దాంతంవరకు మన అలంకార చరిత్రలో మూడవ దశ. ఈనాటికి ధ్వనివాదం సర్వసామాన్యంగా తయారైనది. కావ్యాత్మ రసమని నిశ్చయమైనది. అలంకారాలు కావ్యానికి అస్థిరధర్మాలే అన్న సంగతి అంతా అంగీకరించారు. ఒక్క చంద్రాలోకకారుడు మాత్రం అలంకారంలేని కావ్యం అనుష్ణమైన అగ్ని వలె అసంభవం అని వాదించాడు. ఈ కాలంలో వాగ్భట, జయదేవ, విశ్వనాథ, దీక్షిత, పండితరాయాదులు వ్రాసిన అలంకార గ్రంథాలు చాల మహత్తరమైన గ్రంథాలు. జయదేవుని చంద్రాలోకంలో అతఃపూర్వం ఎక్కడా నిర్వచింపబడనివి 16 అలంకారాలు క్రొత్తగా చెప్పబడ్డాయి. విశ్వనాథుని సాహిత్యదర్పణంలో నిశ్చయం, అనుకూలం అనేవి రెండు అలంకారాలు క్రొత్తగా కనిపిస్తాయి కాని వాస్తవానికి క్రొత్తవికావు. భ్రాంతాపహ్నుతినే నిశ్చయమనీ, విషమాలంకార విభేదాన్ని అనుకూలమనీ యితడు పేర్కొన్నాడు. అలంకారవిషయాన్ని అత్యధికంగా నిరూపించిన గ్రంథం అప్పయ్యదీక్షితులవారి కువలయానందం. చంద్రాలోకంలో నిరూపించిన అలంకారాలపై యిది విస్తారమైన వార్తికం వంటిది. అనేకోదాహరణాలు చెప్పి విషయాన్ని చాలా స్పష్టంగా నిరూపించడమే గాక దీక్షితులు వారీ గ్రంథంలో చంద్రాలోకంలో పేర్కొనని కొన్ని క్రొత్త అలంకారాలను గూడా పేర్కొన్నారు. శబ్దాలంకారాలను వదలిపెట్టి రసవదాదులను చేర్చినారు. పండితరాయలు తన రసగంగాధరంలో అంతకుపూర్వం వ్రాయబడిన అలంకార గ్రంథాలలో ఉన్న ముఖ్యమైన సిద్ధాంతాలన్నిటినీ చక్కగా విమర్శించాడు. ఇందులో అలంకారప్రకరణం అసంపూర్ణంగా, 70 అలంకారాలను మాత్రమే నిరూపించి నిలిచిపోయింది. ఈయనకాలం పదునేడవ శతాబ్దారంభంనుండి మూడవ పాదంవరకు అని నిశ్చయించబడింది. ఈయన రసగంగాధరం, కావ్యప్రకాశిక సాహిత్యదర్పణాలతోపాటు ప్రామాణిక గ్రంథాలలో ఒకటిగా వన్నెకెక్కింది. ఈయన తరువాతి అలంకారశాస్త్రానికి సంబంధించిన ఉద్గ్రంథం మరేదీ నేటి వరకు వ్రాయబడలేదు. ఈనాటికీ వేర్వేరు అలంకారి

కులు నిరూపించిన అలంకారాలు రమారమి రెండు వందలవరకు ఉన్నాయి.

లెక్కకు సుమారు రెండువందలని చెప్పినా, యీ అలంకారాల సంఖ్య నిర్ధారణచేసి చెప్పడం ఎవ్వరికీ కుదరదు. పూర్వపు వాటికితోడు ఎప్పటికప్పుడే కొన్ని క్రొత్త అలంకారాలు కావ్యసుందరికి తొడగబడుతూ ఉంటాయి. అతి ప్రాచీనమైనవి కొన్ని కవులచేత ఆదరింపబడక నామమాత్రావశేషాలుగా ఉండిపోయాయి. కొన్ని అలంకారాలు ఏమంత చమత్కారమైనవి కావు. ఆ కారణంచేత కూడ అవి అంతగా వాడబడవు. వాటి ప్రచారం అలంకార లక్షణగ్రంథాలమేరకే. శోభాకరుని అలంకార రత్నాకరంలో పేర్కొబడ్డ అలంకారాల్లో రమారమి 35 వరకు క్రొత్తవిఉన్నా, వాటికి ఏనాడూ గౌరవం రాలేదు. ఇలా విడిచిపెట్టిన వాటినికూడా కలిపి లెక్కించినట్లయితే మన అలంకారాల సంఖ్య రెండువందలకి పైమాటగాని తక్కువకాదు. అలంకారాలలోని భేదోపభేదాలు లెక్కలోకి తీసుకోకపోతే యీ సంఖ్య తగ్గనూవచ్చు. అసలు దండి మొదట్లోనే యీ విషయం నొక్కిచెప్పాడు. అలంకారాలలో గల పరస్పర సాదృశ్య సాధర్మ్యాదులను చక్కగా పరిశీలించి ఒకదానికి వేరొకటి అవాంతర భేదంగా పరిగణించడం మంచిదనిన్నీ, అల్లా కానినాడు వీటి సంఖ్య అపారంగా పెరిగిపోతుందనిన్నీ, అతడన్నాడు. కాని విన్నవాళ్లు చాలా తక్కువ. అతనిచే ఉపమాంతర్గతాలుగా పేర్కొబడిన అనన్వయాదులు ఎన్నో తరువాత స్వతంత్రాలంకారాలుగా పేర్కొబడ్డాయి. ఇది యిలా ఉంచి, అలంకారేతరాలుగా నిర్ణయించి విసర్జించిన వెన్నో నేటికీ యీ అలంకార పట్టికను అంటిపెట్టుకొనే ఉన్నాయి. స్వభావోక్తి, భావిక, ఉదాత్తాల సంగతి లోగడ చెప్పాను. సూక్ష్మ, లేశ, పిహితాదులుకూడ యిదే రకానికి చెందుతాయి. అతిశయోక్తిభిన్నమైన అత్యుక్తికూడ అలంకారం అనిపించుకోదు. ఉదాత్తం వంటిదే అల్పంకూడ. వీటిలో చమత్కారం తక్కువ. పైగా యివన్నీ రసధ్వనికి ఉపకరిస్తాయి. ఇవి అలంకార్యకోటికి చెందుతాయి కాని అలంకారకోటికి చెందవు. గూఢోక్తివంటి అలంకారాలు సుతరాము అలంకారాలు కావు; ధ్వనివిషయాలు. స్మరణాలంకారం స్మృతిసంచారి భావంగా పేర్కొబడటం న్యాయం. దీని లక్షణాన్ని నిర్వచిస్తూ అలంకారికులు 'సాదృశ్యవస్తువును చూసినందువలన పూర్వస్మృతి కలిగినట్లు వర్ణిస్తే అది స్మరణాలంకారమనిన్నీ, సాదృశ్య వస్తువులేనిచోట అలంకారం లేదనిన్నీ చెప్పి అలంకారానికీ, సంచారిభావానికీ కొంత సార్థక్యం చూప యత్నించారు. కాని సాదృశ్యవస్తుదర్శనం చేతకూడ స్మృతిసంచారి జాగృతావస్థనుపొందవచ్చు. అలాటిచోట అలంకారంకంటె భావమే ప్రధానం కనుక 'ప్రాధాన్యేన వ్యపదేశా భవంతి' అన్నట్లు, భావానికే పేరు ప్రతిష్ఠలు కలుగుతాయి కాని అలంకారానికి కావు. వృత్త్యనుప్రాసకూడ అలంకారం అనిపించుకోదు... దాని ముఖంమీదనే యీ విషయం స్పష్టంగా కనిపిస్తుంది. దాన్ని అలంకారం అని అంగీకరిస్తే వృత్తులను అలంకారాంతర్గతాలుగా చెప్పవలసి వస్తుంది. వాస్తవానికి వృత్తులు రసధర్మాలు. 'ఘనవృత్తులు వృత్తులౌర కావ్యందరకున్' అని ఏనాడో నిశ్చయించారు. ఇలాటివి మరెన్నో ఉన్నాయి. వీటన్నిటినీ అలంకార పట్టికనుండి తొలగించి యథోచిత స్థానాల్లో నిలిపినట్లయితే, యీ అలంకారాల సంఖ్య చాలా తగ్గుతుంది.

అలంకార వర్గీకరణ విషయంలో కూడ కొంత సంస్కారం అవసరం. సామ్య, వైషమ్య, తాటస్థ్యాలనే మూడు వర్గాలుగా వీటిని తిరిగి విభజించవచ్చునని శ్యామసుందర దాసుగారు తమ సాహిత్యాలోచనంలో వ్రాశారు. అయితే యీ తటస్థవర్గం తిరిగి అనేక ఉపవర్గాలుగా తయారౌతుంది. శబ్దాలంకారాలను కూడ వర్ణసామ్య, సామీప్య, ఆవృత్తిగతాలుగా విభజించి వేర్వేరు వర్గాలలో పేర్కొవచ్చు. చిత్రాలంకారాలను పూర్తిగా వదులుకోవచ్చు.

ఆధునిక యుగంలో క్రొత్తగా ఎవరూ అలంకార గ్రంథం వ్రాయలేదని లోగడ చెప్పాను. పండితరాయలవాటినుండి నేటివరకు అలంకార శాస్త్రం యథాతథంగానే నిల్చిపోయింది. కాని సాహిత్యంలో అనేక మార్పులు వచ్చాయి. ఆ యీ మార్పులతోపాటు అలంకారాలు కూడ క్రొత్త క్రొత్తవి కూర్చబడుతున్నాయి. ఈ క్రొత్తవాటిలో చాలవరకు లక్షణోక్తిపై ఆధారపడి నడిచే అలంకారాలుగా కనిపిస్తున్నాయి. మరికొన్ని పాశ్చాత్యాలంకారికులచేత పేర్కొబడిన అలంకార లక్షణాలకి సరిపోయే పద్ధతిలో ఉంటున్నాయి. 'తేనెపాట' 'నిద్రావిహీన రాత్రి' 'చీకటి బ్రతుకు' 'కన్నీటి కథ' వంటి ప్రయోగాలు పాశ్చాత్యులచేత అలంకారాలుగా అంగీకరింపబడతాయి. 'వన్నెక యింటి వానిగ నొనర్పదలంచిన పెద్ద యూహలే, చిన్న

తనంబు నొందినవి' అనే పద్యపాదంలోగల లాక్షణిక ప్రయోగం పాశ్చాత్యులకు ఎంతో ప్రియమైన అలంకారం. ఇలాటి నవీన ప్రయోగాలన్నిటినీ పరిశీలించి, లక్ష్య లక్షణాలు నిరూపించి, అలంకార నిర్వచనం చేయడం ఎంతైనా అవసరం. అయితే ఆయా క్రొత్తక్రొత్త అలంకారాలు అన్నీ స్వతంత్రాలుగానే నిరూపింపబడ నక్కరలేదు. కొన్ని యితఃపూర్వం మనవారు చెప్పిన ఏ అలంకారాలకో ఉపభేదాలుగా పరిగణింపబడగలవు. ఉదాహరణకు,

"నేను చీకటితోడ చీకట్లు వాతోడ
చేరి నీమాటలే చెప్పుకున్నాము"

అనేచోట మన అనన్వయాలంకార లక్షణాన్ని మరి కొంచెం విస్తరించి, అంటే పరస్పరోపకారంతో పాటు, స్వర సమాన క్రియాధర్మాలుకూడా అంగీకరించినట్లయితే, దీనిని అనన్వయ భేదాల్లో ఒకటిగా చెప్పకోవచ్చును. కాని సాదృశ్య ధర్మం లోపిస్తుందిగదా అంటే, వేరె ప్రత్యేకాలంకారంగా పేర్కొనవలసి ఉంటుంది. అలాగే, 'మా పరస్పరమును స్పర్శమాత్రమునన పులకిత బ్రహ్మపథమున బోవగలము' అనే చోట, పాశ్చాత్యులు చెప్పే 'విశేషణ విపర్యయం' అని అనడానికి బదులు మనవారు చెప్పిన ఉల్లాసాలంకారంలోనే ఒక భేదంగా చెప్పకోవచ్చు. లేదంటే ఆ పేరే పెట్టుకోవచ్చు.

ఈ సందర్భంలో గమనించవలసేది మరో విషయంకూడ ఉంది. పాశ్చాత్యులు చెప్పిన అలంకారాలన్నీ మన శాస్త్రదృష్ట్యా అలంకారాలనిపించుకోవు. ప్రశ్న, పరాకాష్ఠ, ఆశ్చర్యంవంటివి వారికలంకారాలుగా తోచాయి. మనవారు చెప్పిన భావికం వారికికూడ అలంకారతుల్యమే. కాని వీటిలో చమత్కారంలేదు, సరిగదా యివి రసభావాదులకె సంబంధించిన విషయాలు. కాబట్టే అట్లాంటివాటిని నవీనులు ప్రయోగించినా అలంకారాలని నిర్వచించవలసిన పనిలేదు. ఆయా విషయాలన్నీ గమనించి సమర్థులైన పండితులు అలంకార శాస్త్రపునరభివృద్ధికి తోడ్పడగలరని ఆశిస్తున్నాను.



నారదావతరణము ★

శ్రీ కొమాండూరు
కృష్ణమాచార్యులు

శ్రీనాథుండు జగన్నివాసుడు శునాసీరాది బృందారక
శ్రేణీమాన్యుడు యాదవాన్వయమునన్ శ్రీకృష్ణుడై యుండ నన్
మౌనీంద్రుండగు నారదుండు హరిసంభావింపగా వల్లకీ
గానధ్యానమనోహరంబుగ దివిన్ గన్పట్టె దీప్తాకృతిన్

అరుణుండా మరికాదు మున్మతడు తిర్యగ్వ్రమ సంచారిభా
స్వరరూపుండు కృపీటయోని యగునా? భావింపగా గాదతం
డరుణాత్యుల్బణదీప్తి నూర్ధ్వముఖుడై యావిర్భవించున్ గదా
మరి యెవ్వాడో యితండటంచు జనులాహానిన్ విలోకింపగన్

జలజాక్షుం డదిగాంచి యద్భుతపుతేజం బుజ్జ్వలాకారరే
ఖల నాకాశమునన్ వెలింగి పురుషాకారస్థితిన్ దోచినన్
జలజాతాసనమానసాత్మభవుండౌ సన్మౌని యానారదుం
డిలకేతెంచువిధంబటంచు మదిలో నెంచెన్ బ్రమోదంబునన్

వరనాగాజిన మూర్ధ్వభాగమున గన్పట్టంగ భూతిచ్ఛటా
చ్ఛురితాచ్ఛచ్ఛవి నొప్పు శాంభవవపుఃస్ఫూర్తిన్ విడంబించె నా
సరసిజాసనసూతి నూత్నజలదచ్ఛాయన్ సితాభ్రప్రభా
పరిలిప్తాంగ మృగాజినాసితపట ప్రస్ఫీతశీతద్యుతిన్

శరదభ్రోజ్జ్వలశుభ్రవిగ్రహవిలాసస్ఫూర్తి విద్యుల్లతా
పరిపీతోర్ధ్వ జటాకలాపపటలీ ప్రాగ్భారమాలిన్ మునీ
శ్వరుడొప్పెన్ తుహినస్థలీరుహలతావారప్రపాకద్యుతి
స్థిరనీహార మహీధరేంద్రుడన నిస్సీమప్రభావాఢ్యుడై

పీతోదంచిత హాంజిబంధయుతమై పీయూషఫేనచ్ఛటా
శ్వేతాంగద్యుతినొప్పి కృష్ణమృగసంస్ఫీతాజినచ్ఛాయతో
నేతన్మూర్తి సువర్ణసూత్రకలితాహీనాంగ నీలాంబర
ఖ్యాతంబౌ బలదేవువిగ్రహమనం గైలాసశైలచ్ఛవిన్

గరుడుని మేనిరోమములకై వడి దీర్ఘతరోజ్జ్వలంబులై
సురగిరి హేమవల్లికల సొంపువహించెడు యజ్ఞసూత్రమా
పరమవిశుద్ధదేహమున భాసిలె నూత్నశరద్ఘనాఘన
స్ఫురదురు చంచలాలతికపోలిక నీలనభోంతరంబునన్

వెల్లనిచాయలం దసితవేణికలొప్పఁగ సూక్ష్మరోమసం
ఫుల్లవినీలకంఠశచమూరుమృగాజిన మున్నతాంగమం
దుల్లసితంబుగా సరసిజోద్భవసూతి విచిత్రపట్టసం
వెల్లితశుభ్రదంతియఁన వేడుక తోడఁగనొప్పె నత్తరిన్
సతతము వ్రేళ్ళతంత్రులను సజ్యము సేయు నఖాగ్రముల్ పరి
క్షతమయి రక్తిమంబు వెలిగక్కుచునుండ కరాక్షమాలయున్
బ్రబలికరజారుణద్యుతిని భాసిలు నందు సగంబు విద్రుమా
చితమయినట్లు గెంపులు రచించిన మౌక్తికహారమోయనన్
గగనాభోగ మరుద్విధూతమహతీ గంభీరతంత్రీస్వర
ప్రగతుల్ గ్రామవిశేషమూర్ఛనల విభ్రాంతిన్ మదింగొల్పఁ దద్
ద్యగసంకాశవిపంచిఁగాంచుచుఁ దదుద్యోగంబు భావించుచున్
జగతీనాథుని సన్నిధానమున కానన్మౌని యేతెంచినన్—

—'మాఘమోదము' నుండి.

కృతకోద్యానాలు

★

శ్రీ ఆర్. ఎల్. ఎస్. శాస్త్రి
శ్రీ యస్. వి. రమణరావు

భూమి అనేకవిధములైన భౌతిక, రసాయనిక పదార్థములతో కూడియున్నదని మనందరకు తెలిసిన విషయము. అట్టి సహజమైన భౌతిక, రసాయనిక పదార్థములతో కూడిన భూమి, దానిపై నివసించు లక్షలాది జీవరాసులకు అనేక విధముల జీవనోపాధి అయియున్నది. అట్టి జీవరాసులలో ప్రత్యేకించి వృక్షములకు అది ఎంతో ఆధారభూతమై ఉన్నది. కాని ప్రకృతిలో అన్ని నేలలు ఈ వృక్షములు పెరుగుటకు అనువైనవిగా ఉండవు. ఎందువలననగా, వృక్షములు పెరుగుటకు సహజముగా కావలసిన కొన్ని ముఖ్యలక్షణములు ఆయా భూములందు లోపించుటవలన కాని, మరికొన్ని భూములు అనువైన పంటలను గాని, తోటలను గాని పెంచుటకు నిస్సారవంతముగా నుండుటచే, అవి నిరుపయోగకరములైవున్నవి. ప్రస్తుత దేశపరిస్థితులలో అధికాహారోత్పత్తియొక్క ఆవశ్యకత లోకవిదితము. అందుచేత ఈ నిస్సారవంతమైన, నిరుపయోగకరమైన ప్రదేశములలో కూడ ఆహార పదార్థములను పెంచు విధానములు మనకు మిక్కిలి ఉపయోగకరములై ఉన్నవి. ఈ పద్ధతులను మనము మనదేశములో విరివిగా అమలు జరిపినచో మనకు, మనదేశమునకు ఎంతో శ్రేయస్కరముగా నుండగలదు.

మొక్కలయొక్క పెరుగుదలకు భాస్వరము, పొటాసియము, నత్రజని, మెగ్నీసియము, కాల్షియము, మరియు గంధకము ముఖ్యముగా అవసరమగు మూలపదార్థములు. వీటిని ఆంగ్లపరిభాషలో *Essential elements* అని అందురు. ఇవికాక బోరన్ (*Boron*), మాంగనీసు, ఇనుము, తామ్రము, తగరము మొదలయినవికూడ చెట్లయొక్క సరియగు పెరుగుదలకు సూక్ష్మభాగములలో నుండవలెను. వీటిని ఆంగ్లమున *Trace elements* అని అందురు. ఈ *Trace elements* లోపించినచో చెట్లయొక్క అభివృద్ధి లోపించును. అనగా వాటికి తెగులు పుట్టును. వ్యవసాయపరిశోధన స్థానములలోను, వృక్షపరిశోధన స్థానములలోను, మొక్కలయొక్క పరిశోధనలలో నిమగ్నులైన నిపుణులు ఇప్పుడు మొక్కలను నేలమీదకాక, ద్రవరూపములో ఈ పైనుదహరించబడిన మూలపదార్థములు, ఏ వృక్షమునకేయే మూలపదార్థములు ఎంత అవసరమో పరిశోధనలు జరిపి, ఈ మొక్కలను పెంచు పద్ధతులను కనుగొని ఉన్నారు. దీనినే నేలలేని వృక్షపోషణము (*Hydroponics*) అని అందురు. ఈవిధమయిన కృత్రిమ పద్ధతులలో పెద్ద పెద్ద విలువయిన తోటలయొక్క పెంపకము అమెరికా, జపాను దేశములలో అమలుజరుపుచున్నారు. అయితే ఈవిధముగా చెట్లను పెంచుటలో శాస్త్రపరిజ్ఞానములో నిపుణత కొంత అవసరమయి యున్నది. ఈవిధముగ వృక్షములను పెంచుటలో మూడు రకములైన శాస్త్రీయపద్ధతులు కలవు. 1. నీటి పెంపకము (*Water Culture*), 2. ఇసుక పెంపకము (*Sand culture*), 3. కంకర లేక గులకరాయి పెంపకము (*Gravel Culture*).

నీటి పెంపకము

ఈ పద్ధతిని కంకర గాని గులకరాయి కాని లేని ప్రదేశములలో సాధారణముగ అమలు జరుపుదురు. ఎందుకనగా, సాధారణముగా ఈ పద్ధతిపై బంగాళా దుంప, దోస జాతికిచెందిన కాయగూరలను విరివిగా పెంచవచ్చును. ఈ కాయగూరలు సాధారణముగా గులకరాయి కల నేలలమీద బాగా పెరుగును. అందుచేత ఈ కాయగూరలను కంకర నేలలు (*Gravel*) లోపించిన ప్రదేశములలో పెంచుటకు ఈ పద్ధతి మిక్కిలి అనువైనది. ఈ పద్ధతిమీద ఈ తోటలను అమెరికా దేశస్థులు విరివిగా పెంచుతున్నారు. ఈ పద్ధతిపై చెట్లను పెంచుట, ఇతర రెండు పద్ధతులకన్న కొంచెము కష్టతరము. కాని అనుభవముమీద ఈ పద్ధతిని చక్కగా అవలంబించవచ్చును. ఈ పద్ధతిపై చెట్లను పెంచుట ప్రప్రథమమున అమెరికా దేశములోని కాలిఫోర్నియా వ్యవసాయ ప్రయోగస్థానము వారు అమలుజరిపిరి.

ఒక వెడల్పు మూతిగల గాజు లేక పింగాణి పాత్రను తీసికొని దానిలో మొక్కల కవసరమగు పై నుదహరించిన మూలపదార్థములను సరియగు పాళ్ళలో కలిపి ద్రవరూపములో నుంచవలెను. (ఇది మనము పెంచు మొక్కలపై ఆధారపడి ఉండును.) ఆ పాత్రకు రంధ్రము చేయబడిన బిరడా నుంచవలెను. అట్లు చేసినపిమ్మట వారు మొక్కలను తీసికొని వాటిని రంధ్రముగుండా మొక్క మొక్క వేరు భాగము సీసాలోని ద్రవమునకు రెండు లేక మూడు అంగుళముల దూరములో ఉండునట్లు సీసాలో అమర్చవలెను. ఇట్లు అమర్చుటలో వేళ్లు శ్వాసక్రియ (*Respiration*) జరుపుటకు వీలుగా ఉండునట్లు, కొంత గాలిలోపల ప్రవేశించునట్లు అమర్చవలెను. గాలిని లోపలకు పంపులద్వారా కాని, గాలిని ఉత్పత్తిచేయు యంత్రములద్వారా కాని పంపవచ్చును. ఈ పద్ధతిలో ఒక జాగ్రత్తనుమట్టుకు అవలంబించవలెను. అది ఏమనగా, వేళ్లు ఎక్కువగా వెలుతురుతగులు ప్రదేశములలో నుండరాదు. అట్లుంచినచో సీసాలోనున్న ద్రవములో హానికరమగు సూక్ష్మజీవులు వృద్ధిపొంది మొక్క వేళ్ళ భాగమునకు హాని కలుగ జేయును. ఈ విధముగా రెండుమూడు పర్యాయములు ప్రయత్నించిన మంచి అనుభవము సంపాదించవచ్చును. అట్లు అనుభవము పొందినపిమ్మట వీలైన, మనకు సులభమైన పద్ధతుల నవలంబించవచ్చును. ఈ పద్ధతిపై కాయగూరలను పెంచి వ్యాపారము చేయు సంస్థలు కూడ ఇప్పుడు అమెరికా దేశములో కొన్ని కలవు. అట్టి సంస్థలు ఈ పద్ధతి నవలంబించుటకై పెద్దపెద్ద సిమెంటు తొట్లు కట్టి వాటిలో తీగతో అల్లిన జల్లెడపై తడిసిన రంపపు పొట్టుగాని, ఊకగాని వేసి ఆ తొట్లపై అమర్చెదరు. తొట్లలోపల పోషకద్రవమును పోసెదరు. పిమ్మట వారు మొక్కలను ఈ జల్లెడలోనున్న పొట్టుపై నాటెదరు. తొట్లలోనున్న ద్రవపదార్థమునకు ఈ జల్లెడకు మధ్య దూరము రెండు మూడు అంగుళములకన్న ఎక్కువ ఉండరాదు. అట్లమర్చినపిమ్మట చిల్లులగుండా వేళ్లు లోనికి చొచ్చుకొనిపోయి ద్రవపదార్థమున చేరి ఆరోగ్యవంతముగ పెరుగును. మొదట చెప్పిన పద్ధతికి ఈ వ్యాపారపద్ధతికి అనుకరణలో ఏమియు చెప్పదగినంత భేదము లేదు.

ఇసుక పెంపకము

ఈ పద్ధతి ఇతర రెండు పద్ధతులకన్న చాల సులభమైనది, మరియు తక్కువ ధనముతోనే అమలు జరుపవచ్చును. జలపోషణ పద్ధతిలోవలెనే, ఇందులో కూడ గాజు, కొయ్య లేక లోహపాత్రలను ఉపయోగించవచ్చును. ఆ పాత్రలో హాని నాశకరమైన, బోలుగా నున్న ఇసుక నింపవలెను. ఎందువల్లననగా స్వేచ్ఛగా గాలి ప్రవేశించి బయటకు పోవుటకు వీలుగా నుండవలెను. దానిపై మొక్కలను వాటి మధ్యమధ్య విరామములనిచ్చి మొక్క పెరుగుదలకు అనువగు ద్రవమును చేర్చవలెను. ఈ విరామకాలము, ముఖ్యముగా ఇసుకలోనున్న నలుసులయొక్క పరిమితినిబట్టి, పెంచబడు మొక్కలను బట్టి, ద్రవముయొక్క బలమునుబట్టి (*Concentration*) ఆధారపడి ఉండును. అదనముగానున్న ద్రవమును తీసివేయుటకుగాను పాత్ర అడుగుభాగమున రంధ్రము చేయుటకూడ కలదు. ఇట్లు విడదీసిన ద్రవమును మరల ఉపయోగించవచ్చును. ఇందులోనే మరియొక సులభపద్ధతి కలదు. అది ఏమనగా ద్రవముతో నున్న పాత్రను ఎత్తగు ప్రదేశములోనుంచి, మొక్కలుగల పాత్రను ఎత్తు తక్కువగల ప్రదేశములో నుంచుదురు. ఈ రెండు పాత్రలను వంచిన గాజు గొట్టములతో కలిపెదరు. ఈ పద్ధతివలన ఎప్పుడు, ఎంత ద్రవము అవసరమో, అంత క్రిందను మొక్కలు కలిగియున్న పాత్రకు తేలికగా అందజేయవచ్చును. ఈ పద్ధతి ప్రతివారు తేలికగా అనుసరించుటకు అనువైనది. దీనిని మన ఇండ్లలోను, తోటలలోను తేలికగా అమలుజరుపవచ్చును.

ఈ పద్ధతికూడ అమెరికా, జపాను దేశములలో విరివిగా అమలు జరుపబడుచున్నది. ఇది వ్యాపార సంస్థలకు జలపోషణ పద్ధతికన్న ఎక్కువ ఉపయోగకరము. ఎందువలననగా, ఇది ఆ పద్ధతికన్న చవకగాను, తేలికగాను అనుసరించవచ్చును. వ్యాపార దృష్ట్యా ఇది చాల లాభసాటిగా కూడ ఉండునని అభిప్రాయము. ఈ పద్ధతిపై, మంచి అందమైన పూల మొక్కలను, చిన్నచిన్న పండ్లచెట్లను, కాయగూరలను ఎంతో విరివిగా ఆకర్షవంతముగా పెంచవచ్చును.

కంకర లేక గులకరాయి పెంపకము

ఈ పద్ధతికూడ ఇతర రెండు పద్ధతులలోకల సూత్రముపైనే ఆధారపడి ఉన్నది. కాని దీనిని విశాలమైన స్థలములలో పెద్దపెద్ద తోటలను పెంచుటకుగాను విరివిగా అనుసరించెదరు. ఈ పద్ధతిలో గులకరాయి (*Gravel*) ని మొక్కలు పెంచుటకు ఆధారముగా ఉపయోగించెదరు. గులకరాళ్లతో పెద్ద

ముడిగా తయారుచేసి ఉంచెదరు. దీనిలో రెండు విధములైన లాభములు కలవు. 1. గులకరాయి అగుటచే గాలి లోనికిపోయి బయటకు వచ్చుటకు మిక్కిలి వీలుగానుండును. 2. అదనముగానున్న పోషకద్రవమును తేలికగా బయటకుతీసివేయవచ్చును. అట్లు తీసివేసినదానిని, తిరిగి ఉపయోగించవచ్చును. అందుచే ఇది వ్యాపారరీత్యాగూడ మిక్కిలి లాభసాటిగా నుండగలదు. అట్లుమళ్ళను తయారుచేసిన పిమ్మట అనువగు పంటలనుగాని, పండ్లతోటలనుగాని, వేసి ఎంతో విజయవంతముగా పెంచవచ్చును. ఇది అనుభవముమీద మిక్కిలి తేలికగాను లాభసాటిగాను కూడ ఉండును. ఈపద్ధతిపై నుదహరించబడిన రెండు పద్ధతులకన్న తేలికగునదియు, మిక్కిలి లాభసాటిదియు అనికూడ శాస్త్రజ్ఞుల అభిప్రాయము.

కంకర పెంపకము

ఇది సాధారణముగా పెద్దబయలు ప్రదేశములలో అనుసరించెదరు. దీనిని ఇండ్లలోను, చిన్న చిన్న తోటలలోను ప్రారంభించుటకు ఇతర రెండు పద్ధతులవలె అనువైనది కాదు. ప్రప్రథమములో కొంచెము వ్యయము ఎక్కువగానున్నను, రాను రాను ఇది ఎక్కువ లాభసాటి పద్ధతిగా నుండగలదు. ఏలనన దీనికి తిరిగి తిరిగి మిగత పద్ధతులలోవలె అంతఎక్కువ ధనమును వెచ్చించవలసిన అవసరము లేదు. అనుభవము పొందిన పిమ్మట, ఈ పద్ధతి మనకు అనువగు మార్గములలోనికి మార్చుకొని విజయవంతముగా మొక్కలను పెంచవచ్చును. ఇది ప్రస్తుతము అమెరికా దేశములో ఇతర రెండు పద్ధతులకన్న ఎక్కువ వాడుకలో కలదు.

ఈ మూడు పద్ధతుల ననుసరించి తోటలను పెంచుటలో మిక్కిలి జాగ్రత్తగా నుండవలసిన విషయము ఒకటి కలదు. అది ఏమనగా, మూలపదార్థములతో కూడిన పోషకద్రవమును సరియైన పాళ్లలో మిశ్రమముచేసి ఉపయోగించవలెను. ఆ మిశ్రమము, మనము పెంచదలచిన మొక్కలనుబట్టి, ఆయా పదార్థములయొక్క భాగములు మారుచు ఉండును. అందుచేత ఈ మిశ్రమ ద్రవమును తయారుచేయుటలో సాధ్యమైనంత జాగ్రత్త కలిగిఉండుట శ్రేయస్కరము. ఈ వివరములను తగు శాస్త్ర గ్రంథములను పరిశీలించి తెలిసికొనవచ్చును. అట్లు తయారుచేసిన మిశ్రమము మొక్కలు తేలికగా గ్రహించుటకు వీలుగా నుండవలెను. అందుచేత వాటిని మనకు సులభముగా దొరకు లవణ రూపములో—ఉదాహరణకు, పొటాసియమ్ నత్రితము, సోడియమ్ నత్రితము, అమ్మోనియా గంధకితము మొదలగువానితో మొక్కలకు తేలికగా అందజేయవచ్చును.

అమెరికా, జపాను దేశములలో అవసరమగు తోటలు పెరుగుటకు వీలుగాలేని ప్రదేశములలో ఈ పై మూడు పద్ధతులలో ఆయా ప్రదేశములకు ఏ పద్ధతి మిక్కిలి అనువైనదో, దానిని అవలంబించి, ఆ దేశస్థులు వారియొక్క అవసరములను సులభముగా ఎదుర్కొనగలుగుచున్నారు. ఇదే విధముగ మన దేశములో కూడ నిస్సారవంతమైన, లేక నిరుపయోగకరమైన ప్రదేశములలో నివసించువారు ప్రభుత్వ శాస్త్రజ్ఞుల సహాయముతో గాని, తదితర శాస్త్రజ్ఞుల సహాయముతో గాని, ఈ పద్ధతులను కార్యరూపములో పెట్టినయెడల ఎంతో శ్రేయస్కరముగా నుండగలదు. అట్టి ప్రదేశములలోనే కాక, మనము సాధారణముగ మన ఇండ్లలోకూడ ఈ పద్ధతులపై ఆకర్షణీయమగు పూలమొక్కలనుగాని, నిత్య జీవితమున కుపయోగకరమగు కాయకూరలను గాని, పెంచవచ్చును. మన ఇండ్లలోని పెరటిభాగములు, ప్రాంగణములు, లేక వరండాలవంటి అనువైన ప్రదేశములలో ఈ మొక్కలను జలపోషణము లేక ఇసుకపోషణ పద్ధతులపై విజయవంతముగ పెంచవచ్చును.

శరదవసరము ★

శ్రీ గట్టి
లక్ష్మీనరసింహశాస్త్రి

వెలుగుల మింటిమానికపు వీథుల నన్నిటి మూసివేసి, పి
ల్లల జతతోడ బత్తుల గులాయనిలాయములం బొనర్చి, గు
ర్తుల గనరాక దిక్కులను, దుర్దినముల్ ఘటియించి, మించు తా
జలధరకాల ముల్లసిల జాలె, మఱొక్క తెఱం గెసంగగాన్.

అంబురుహాప్తమిత్రు డరుదార జగంబున నైశతామసం
బంబరమందు నంబుదమయాంధతమంబును, దమ్ములందు నై
ద్రంబగు చీకటిన్, నిజకరంబులతో నడగించినైచె; దే
జంబున నొప్పనుచ్ఛ్రితులశాత్రవు లెయ్యెడ నొంద రాహతిన్?

తాలిమి, నెల్ల దేహులకు దా సమకూర్చు, బలాబలంబులం
గాలమె; నిక్కమంచు బలుకం దొరకొన్నటు లొప్పచుండ్, శర
త్కాలమునందు హంసలరుతంబులు, వీనులవిందు వెట్టి, సు
శ్రీలలితంబు లయ్యె, బరుషీకృత బర్హికలస్వరంబుగాన్.

రాజమరాళబృంద మృదురమ్య మనోహరమంజుకూజిత
శ్రీజిత కంఠరావమయి, చెందిన యీసున జేసిపోలు, దా
నాజి, వెసం దనూరుహములన్నియు రాల్చుకొనెన్ శిఖండభృ
ద్రాజు; సహింపరానిదిగదా పరపక్షపరాభవం బొగిన్?

ప్రతియొక కానలో బహుళరాగజపాధర రమ్యమైన సం
తత వనరాజిరాజవదనాముఖభాగమునందు సుందరే
క్షిత మృదుపభ్రమంబు లొలికించుచు నల్లన నుల్లసిల్లె న
ప్రతిమగుణంబులై వికచబాణదళావళు లెంతయేనియున్.

పలుచని పైడిరేకులటు పచ్చనిరేకుల విచ్చి నవ్వుచున్,
వలచురజంబులో మునుగబాఱిన యెఱ్ఱని కేసరంబులం
బలుమరు దువ్వుచుం, బ్రియవిమానిత మానవతీ మనంబులం
దలకొను కిన్కకున్ నిరసనం బవసం బవృథార్థతం గొనెన్.

బాలసరోజమిత్ర మృదుబాహులతా పరిలబ్ధమై సరో
లోల తరంగడోలికలలో దమి దేలెడి పూవుదమ్మి, యు
ద్వేల మదమ్ముతో నరుణదీప్తులు సిమ్ము ప్రియాస్యబింబముం
బోలుట జేసి, యెవ్వనిని ముంపదు తద్గత కౌతుకంబునన్?

ఎలమిని, శాలిగోపిక, తదీరితకోమల గీతనిస్వనం
బులు విని వీనులం, గనులు మూయక, ముంగల బచ్చిపైరుప
చ్చలు దినమాని, మైమఱచి, చక్కఁగ నిల్చియయున్న లేళ్ళగుం
పుల నదలించి తాదఱుమబూనదు, పండిన యాశ్వినంబునన్.

ఒకయెడ శెల్ల మబ్బుతెర, లుల్లసితాసిలతాసితమ్ములై;
యొకయెడ దెల్లమబ్బుతెర లొప్ప, మహేంద్రగజేంద్రచర్మ కం
చుకకలితంబులైవటులు, శోభిలు శారదదిక్తటంబులం
బ్రకటముగా గనుంగొన, విభాసిలవో జనలోచనాబ్జముల్?

గాలికి శేగివచ్చు నవకాంచనకంజ పరాగమున్ శర
త్కాల సరోరుహాస్య, నవుతాలకునెల్ల సరోజలోచనా
జాలముపైని గౌతుకవశమ్మున జల్లదలంపు గొన్నటుల్,
వాలున జల్లె దా బరిమళమ్ములు నిమ్మచు దిఙ్ముఖమ్ములన్.

ప్రమద మెలర్పఁగా, హరితపత్రములుఁ, నవపల్లవంబులున్,
దని గొనకూర్చి, దైవతగణంబులు పంపిన మాలవోలె, వ్యో
మమున మనోహరంబయి క్షమాజనమానసముం గరంచె న
బ్రములుగ గెంపుమోము, లలపచ్చపులుంగులజాలు, ముంగలన్.

క్రాలి మనోజ్ఞ కాశనికరంబులతో గనుపండువౌ శర
త్కాలమునం దఖండ ఘన కామసుఖోదయపూర్ణసిద్ధి, కే
కాలము నాశతో నిలిచి, కాంచిన నెయ్యునిగూడి నాటి, కు
ల్లోల మహాసుఖాంబునిధిలో నొక కామినితేలె దిట్టయై.

మృదురసమాన సారస సమృద్ధ శరత్సమయోత్సవంబునన్
ముదితల గుబ్బమిట్టచనుముద్దల జిందిన స్వేదబిందువుల్,
పొదలుచు క్రొత్త ముత్తియపు బూసలదండలువోలె గూర్ప, వే
యుదనున సౌరతోత్సవ సుఖానుభవమ్మునకున్ నిరోధమున్.

విని కలహంసకామినుల విస్తృతకాకురుతమ్ము వీనులన్,
మనసిజ సన్నిభుండయిన మాలిమి నెయ్యునిపైని బ్రేముడిన్
మునిగిన యేమెలంత, మునుమున్నుగ వానినిగూడి, యేవిమో
హాన రసలీల దేల? దనయుం బలయింపగు వాని బ్రోడయై!

మనవిమర్శకులకు మనవిమాటలు

★

శ్రీ చిరుమామిళ్ల శివరామకృష్ణప్రసాద్

ఈ మధ్యకాలమునందు, కొన్ని కష్టములకు గురియై, ఆంధ్రుల యుత్తమ సచిత్రమాసపత్రిక యగు భారతిని, క్రమముగా జూచుటకు నాకు వీలుకలుగలేదు. ఇటీవల గడచిన మేనెల భారతిని జూచితిని.

మే నెల సంచికయందు, 'జాషువా కవి' అను వ్యాసము, 'సౌందరనంద సమీక్ష' నన్నాకర్షించినవి. మఱల జూను నెల భారతియందు, సౌందరనందమును గూర్చి జరిగిన వాదోపవాదములను చదివియున్నాను.

శ్రీ జాషువా కవియొక్క పిరదౌసి మొదలగు కావ్యములను, దాదాపు పదునైదు సంవత్సరములకు పూర్వము, భారతియందు నేను పరామర్శించియున్నాను. సౌందరనంద కావ్యమును 'ఆంధ్రభూమి' యను సారస్వత మాసపత్రికయందు, పది సంవత్సరములకు పూర్వము విమర్శించియున్నాను. ఇందుమూలమున, ఈ వ్యాసమును వ్రాయుటకు ప్రస్తుతము పురికొల్పబడితిని. నా యీ వ్యాస మసందర్భ ప్రసక్తి కాదని మనవి చేయుటకే ఈ యుపోద్ఘాతము: తెలుగు నాట నొకప్పుడు, విమర్శనములు వెలయించువారిలో కొందరు, విషయపరిశీలనమును విరమించి, వ్యక్తిదూషణమునకు గడంగుట కలవాటుపడియుండిరి. ఒక గ్రంథమును విమర్శింప దలచినపుడు, కథావస్తువు, శబ్దసంపద, రసపోషణము, పాత్రపోషణము, కవితాశిల్పము, మొదలగు విషయములను పరిశీలించి, మార్దవమగు భాషలో, నభిప్రాయమును వెల్లడించుట పాడి. గ్రంథకర్తయొక్క యుద్యోగ గౌరవములతోడను, సన్మానములతోడను, మనకు పని లేదు, మనము విమర్శించునది గ్రంథమును; గ్రంథకర్తగా మన నాతని పరామర్శింతుము, సాధారణ వ్యక్తిగా, మన కాతనితో పని లేదు. మొత్తముమీద, కొలది వత్సరములనుండి, విమర్శక వ్యాసములయందీ వ్యక్తిదూషణము సన్నగిల్లి, విమర్శనము విషయవిశదీకరణమునందే మగ్నమై యుండుట జూచుచున్నాము. మఱల నేలనో, ఈ దూషణము తలయెత్తుచున్నది. ఇది సత్వరము పరిహరింపబడుట యుచితము.

ఈ వ్యాసమునందు వ్యక్తులపేర్ల నుదహరించి, వారలను గూర్చి నే నొకింత ప్రస్తావింపక తప్పినది కాదు. నేను పరామర్శింపవలసివచ్చిన వ్యాసములట్టివి గాన, నే నీరీతి కలము నడుపవలసివచ్చినది. ఇందులకు, పాఠకులను, క్షమియింప వేడుచున్నాను.

శ్రీ పొట్లపల్లి సీతారామారావుగారి రచనములను నే నిదివరలో నెచ్చట చదివియుండలేదు. తొలిసారి, 'జాషువా కవి' అను వ్యాసమును జూచితిని. తరువాత, వారి 'సౌందరనంద విమర్శనము — సింహావలోకనము,' అను వ్యాసమును చదివితిని.

ఒక కవి రచియించిన కావ్యమును శ్రద్ధతో పఠియించినచో, ఆ కావ్యమునందా కవియొక్క మనస్తత్వము లేదా మూర్తిమత్త్వము, మనకు గోచరించును. శ్రీరాముని కథ నెందరో వ్రాసిరి, వ్రాయుచున్నారు, కాని తమ ప్రకృతికి సన్నిహితముగా నుండు ఘట్టమును వర్ణింపవలసివచ్చినపుడు ఒక్కొక్కరొక్కొక్క క్రొత్తమార్గము నే త్రొక్కి, తమ వ్యక్తిత్వమును ప్రకటించియున్నారు. కావ్యమునందు కవి బ్రతికియుండవలయును. పద్యకావ్యమునందే కాదు, వచనరచనమునందును, కర్తయొక్క నిజస్వరూపము మనకు గన్పించును.

శ్రీ సీతారామారావుగారు, తమ రచనములయందు, క్రొత్తవాడనగు నాకంటివానికిగూడ, సంపూర్ణ దర్శన మొసంగిరి. వారి మనస్తత్వమును, గ్రహియించుటకే వ్యాసద్వయ మెంతో యుపకరించినది. వారి వాక్యములయందు జీవమున్నది; వారి రచనము లుద్రేకపూరితములు.

సుప్రసిద్ధులు, తెలుగుబాసయొక్క పలుకుందనము నెఱింగి, రసము చిప్పిలు పద్యములను రచి

యుంచి, పెక్కు రాంధ్రాత్మరాస్యులకు స్వభాషా వ్యామోహమును కల్గించిన శ్రీ జాషువా కవినిగూర్చి, శ్రీ రావుగారొక విపుల విమర్శక వ్యాసమును వెల యించియున్నారు. ఈ వ్యాసమునందు కొన్ని విషయములు సిద్ధాంతీకరింపబడినవి. సిద్ధాంతీకరింపబడిన విషయసందోహమునకు వలయు నుదాహరణములు చూపింపబడలేదు. అందులకే సంపూర్ణ విషయ విమర్శనమున కీ వ్యాసము దోహదము గాలింపక, కొన్ని వివాదముల నుద్భవింప జేసినది.

ఒక కవియొక్క ప్రతిభావ్యుత్పత్తులను విశద బరచుటకు, తక్కిన కవులను హేళన మొనరింప వల సినపని యేమున్నది? ఇతర కవుల రచనములనుండి కొన్ని భాగముల నుద్ధరించి చూపి, వానిని ఈ కవి రచనములతో పోల్చి, విషయపరామర్శ మొనరించుట యుక్తము. అంతేగాని, 'ఈనాడు పెద్ద పెద్ద సన్మానాలు చేయించుకొనేవారిలో, మహాకవుల మనుకునే వారిలో, యూనివర్సిటీ ప్రొఫెసరులని పిలువబడే వారిలో, పీఠాధిపతులైనవారిలో నీ దోషములు కుప్పతిప్పలుగా నున్నవి.' (పుట. 454) అని, కొందరిని హేళనముచేస్తూ శ్రీ జాషువా కవియొక్క ప్రతిభనుగూర్చి ముచ్చటించుటలో సాధించిన దేమి? ఈ పైన పేర్కొనబడిన వాక్యములయందు 'పీఠాధిపతులైనవారిలో' అని యనుటలోని యర్థమేమో! — ఒక వైపు, సౌందరనంద కావ్యమును గూర్చిన విపరీత విమర్శ, వేరొకవైపు 'యూనివర్సిటీ ప్రొఫెసర్ల'ను గురించిన యప్రస్తుత ప్రసంగము, క్రొత్తవాసనను నావంటివానికి చూపి, శ్రీ సీతారామరావుగారి హృదయమును, కరతలామలక మొనరించినవి!

'నేడు అభ్యుదయ కవు లనిపించుకొనువారంద [illegible] నేతిబీరకాయపురుషులు. వారిలో పలువురికి వర్ణక్రమము తెలియదు. అభ్యుదయత్వం, వేషములో నున్నదే కాని కవిత్వములో కాదు. పోనీ శబ్దజ్ఞానం లేకపోయినా ప్రతిభ ఉన్నదా అంటే అదీ లేదు.' (పుట. 449) అను శ్రీ రావుగారి వాక్యములు, ఖేదమును గూర్చుచున్నవి. మల్లెపూవుయొక్క చక్కదనమును వర్ణించుటకు, గులాబిపూవులను త్రెంపి, నలిపి, పారవేయవలయునా? శ్రీ రావుగారు తమ యభిప్రాయములను వెలువరించుటకు పూర్వ మింకనైన కొంత యుద్రేకమును తగ్గించుకొనవలయునని, వినీతభావమున వేడుచున్నాను. ఆమూలాగ్రముగ పరిశీలింపక యొక విషయమునుగూర్చి త్వరపడి తూలనాడుట సాహసము. అభ్యుదయ కవుల రచనములను సవిమర్శకముగ పఠియించి, యుదాహరణములతో శ్రీ రావుగారొక వ్యాసమును ప్రకటించి, తమ పై వాక్యములను బలపరచుకొందురని యాశింతును. అభిప్రాయభేదము లుండవచ్చును, అభిరుచులయం దంతరము లుండవచ్చును. కాని, వర్ణక్రమ మెఱుంగనివారు కవులవరుసలో చేరినారని పలుకుట హేళనముగా నున్నది. శ్రీ జాషువా కవిగారి పద్యమును, రావుగారియొక నుదహరించిరి. ఆ పద్యమునందలి ప్రతిశబ్దము, మార్దవముగా నుండి, అభిప్రాయభేదముగల విషయమునుగూర్చి మాటాడవలసి వచ్చినప్పు డెట్లు లాల్యముగ భావమును విశదపరుపవలయునో తెలియజేయుచున్నది. శ్రీ సీతారామరావుగా రా పద్యమును తిరిగి పఠియింతురు గాక!

'నేనీ వ్యాసములో సాహిత్యంలో జాషువా స్థానాన్ని నిరూపించడం లేదు, ప్రస్తుతము కవులని పిలువబడే వారిలో జాషువా స్థానాన్ని నిరూపిస్తున్నాను' అని శ్రీ రావుగారొకచో సెలవిచ్చియున్నారు. ఇదియొక వింతవాక్యము. కవులను, వారి రచనములను, గూర్చి వ్రాయుట, సాహిత్యమును గూర్చి వ్రాయుట కాదా? 'కవులని పిలువబడే వారిలో' అనగా, వారు కవులు కాకున్నను, కవులనే పేరుతో, లోకమును వంచించుచు, కాలమును బుచ్చువారిలో, జాషువా కవిగారి స్థానమును నిరూపించుట కీ వ్యాసమును ప్రకటించి యున్నారట! అసలైన, నిసలైన, కవులలో, శ్రీ జాషువా కవి స్థానమును, శ్రీ రావుగారేల నిరూపింపదలచలేదు? ఎవరేని యట్టివారున్నచో, ఈ నేతిబీర పురుషులకును, జాషువా కవిగారికిని గల సంబంధమేమి? వారితో వీరిని పోల్చి చూపుటలోని యర్థమేమి? తుదకు మాటలమూలముననే విషయములు వియత్పథమున విహరించినవి గాని, ఒక్క స్థలమునందైన, ఒక్క పద్యమునైన, పోల్చి చూపకుండుట శోచనీయము. ఇది రసవాదము నెఱింగినవారి విమర్శనా విధమేమొ!

మన మెంత ధీమంతులమైనను, ఒక వర్గమునకు చెందిన వ్యక్తుల శక్తిసామర్థ్యములను గూర్చి, విరిలింపు మాటల విసరివేయకుండుట యుక్తము. ఇది సహృదయుడు చేయవలసినవిషయము: శ్రీ సీతారామ రావుగారు, 'ఇంతవరకీ దేశములో వచ్చిన విమర్శలన్నియు వట్టి గాలికబుర్లు. కవియొక్క ప్రతిభను చూచేవి కావు. ఇలాంటి విమర్శలవల్ల దేశంలో దుష్టమైన సాహిత్యము పెరిగినది.' (పుట. 561) అని సెలవిచ్చినారు. ఎంత సాహసమైన మాట! వేదము వేంకటరాయ శాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, కట్టమంచి రామలింగా

రెడ్డి, కాశీభట్ల బ్రహ్మయశాస్త్రి మొదలైనవారు తెలుగునాట, పేరుమిగిలిన విమర్శకులు. వీరివలన దుష్టమైన సాహిత్యము పెరిగినదనియేనా, శ్రీ రావుగారి యభిప్రాయము? కాకున్న, 'ఇంతవరకు దేశములో వచ్చిన విమర్శలన్నియు,' అనుటలో వర్థమేమి? గాలి కబుర్లతో గాకుండ, గట్టికబుర్లతో సెలవివ్వవలయును.

శ్రీ సీతారామరావుగారు సమగ్రముగ నలంకారశాస్త్రము నెఱింగిన పండితులే కావచ్చును; కాని నేటి సాంఘిక, రాజకీయ, మత, సారస్వత పరిస్థితులను గుర్తింపక 'అలంకార శాస్త్రము చదివి దాని దృష్ట్యా విమర్శించవలె, వేరొక గత్యంతరము లేదు' అని వాదించుటయు సమంజసముగా లేదు. అలంకార శాస్త్రమును నిరాదరింపుమని యెవరును కోరరు. కాలము ననుసరించి, నేడు చదువుకొనిన వారి యభిరుచిని గుర్తించి, అన్యభాషా ప్రాశస్త్యములను గమనించి, ఎంతవరకు విలువను కలిగియుండునో అంతవరకే మన శాస్త్రమును వాడుకలోనికి తెచ్చుట యుక్తము. 'విమర్శించడానికి కావలసిన కొన్ని శాశ్వతమైన పరమసత్యాలను,' అలంకార శాస్త్రము తెలియజేయునని, శ్రీ రావుగారనుచున్నారు; అట్లు కాదని వాదింపము గాని, వాతావరణము మారినచో, ఆదర్శములు, ఆశయములు, అభిరుచులు, సంఘమునందు మారినచో, ఆమార్పు ననుసరించి సారస్వతము, సారస్వతమునకు, జవము జీవము గల్గించు శాస్త్రములు మారక తప్పదు. అట్లే, మార్పునకవి యాలవాలము గానిచో, విస్మృతివారాశిలో విలీనమగును.

మన శాస్త్రమునందు, రెండెద్దులబండియే వర్ణింపబడినదని, రైలుబండి నెక్కుట మానినామా? ఇంజక్షను పద్ధతి, ఆయుర్వేదమున చెప్పబడియుండలేదని, రోగము వచ్చినచో, దాని నుపయోగింపలేక మానుచున్నామా? సినీమా లెందుకు, మనకు వీథిభాగవతము లున్నవిగదా? మన వేషము, మన నడవడి, మన యాచార వ్యవహారములు, మన రాజకీయపరిస్థితి, మారినవి, కాని సారస్వతము మారకూడదా? తనకు లోకమున గలిగిన యనుభూతి సాధారణముగా నుంచుకొని, మానవుడు పెక్కువిధములగు శాస్త్రములను సృష్టించుకొనినాడు. ఇప్పుడా యనుభూతియందు మార్పులు వచ్చినవి, అందులకే శాస్త్రము లోకింత మారి, క్రొత్తవిషయముల నలవరచుకొనవలసి వచ్చినది :

శ్రీ రావుగారు, తమ వ్యాసములయందు; 'లక్ష విధాలగా', 'అందం వచ్చింది', 'అవన్నీ ఉదహరిస్తే' 'అర్థవ్యక్తి కలుగుతూంది', 'స్వవచన వ్యాఘాతాలే', మొదలగు శబ్దములతో వ్యాసరచన జరిపియున్నారు. ఇవి మనకుగల పూర్వ వ్యాకరణసమ్మతమైన ప్రయోగములేవా? ఈ వ్యావహారిక భాషను వీరు వ్రాయుటకు కారణము? అలంకార శాస్త్రమునందు మార్పు వచ్చుటకు వీలు లేకున్న, వ్యాకరణశాస్త్రమునం దెట్లు వీలైనదో! ఒక శాస్త్ర మెందులకు మారినదో, వేరొకటియు నందులకే మారును!

విమర్శకులు, దుష్టసాహిత్యమును పెంచియున్నారు. వర్ణక్రమము తెలియనివారు కవులయినారని, కోపించిన రావుగారు, 'పోయింది, తూంది, వంటి ప్రయోగములను తమ రచనయందు జొప్పించి, ఇంకను, పూర్వశాస్త్ర నిరాదరణమున కితరులను, తూలనాడుట శోచనీయము.

భాషయే కాదు, భాషా సంప్రదాయములు, మారినవి, మారనున్నవి. మార్పులేని విషయము జడసమానము, జీవద్భాష యట్లు కానేరదు.

శ్రీ జాషువా కవి, నేటికి, శ్రీ రావుగారి యనుగ్రహమున వ్యుత్పన్నుడు కాకపోవుటలో నాశ్చర్యము లేదు. పిరదౌసి, స్వప్నకథ, ముంతాజమహలు, గబ్బిలము, ఖండకావ్య సంపుటములు, మొదలగునవి, శ్రీ జాషువా కవియొక్క సుప్రసిద్ధ రచనములు. వీనినుండి కొన్ని పద్యములను, సన్నివేశములను, శ్రీ రావుగా రుద్ధరించి చూపి, తమ యభిప్రాయమును బలపరచియుండిన బాగుండెడిది. 'అవన్నీ ఉదహరిస్తే వ్యాసం పెరుగుతుంది, స్థూలంగా జాషువాకవిత్వం, ఇది—ఇది అని చూపించడమే నా ఉద్దేశ్యం, అన్ని ఉదాహరణలు చూపడం న్యాయంకాదు' (పుట. 452) అని సెలవిచ్చినారు. కవిని, వ్యుత్పన్నుడు కాడని చాటి చెప్పవచ్చు, వ్యుత్పన్నత, ఎచ్చట లోపించినదో చూపుట కొక్క యుదాహరణమైన వివరింపక, విడచుట న్యాయమా? ఉదాహరణములను సమగ్రముగ జూపి, తాము, శ్రీ జాషువ కవినిగూర్చి వివరించిన విషయములను, సమర్థించుకొనవలసిన బాధ్యత, శ్రీ రావుగారిపై నున్నదని మనవి.

శ్రీ జాషువా గారి వ్యుత్పన్నతను కొంచెపరచు యత్నములో, శ్రీ సీతారామరావుగారు, తమ వ్యాసమును స్వవచన వ్యాఘాత దోషభూయిష్ఠ మొనరించినారు, మీదుమిక్కిలి, 'ఇక గణపతిశాస్త్రిగారు

ఆయన యేమి వ్రాస్తాడో, ఆయనకే తెలియదు. అన్నీ స్వవచన వ్యాఘాతాలే' అని యొకచో హేళన మొనరించినారు. ఇట్టి వ్రాతలు, శ్రీరావుగారివంటి పండిత ప్రకాండులకు, విమర్శక చక్రవర్తులకు తగవు. వారివంటి యల్పు లెన్ని పొరపాటుల నొనరించినను, పండితలోకము మన్నించును; కూలంకషముగ సంస్కృత వాఙ్మయమును పఠియించి, నాగరకులై, సారస్వత రంగమున, సింహగర్జనములతో విహరింప దొరకొనిన శ్రీరావుగారు, ఇట్టి దోషములను గావించుటాశ్చర్యము!

'ఆధునిక కవులలో వింత విస్పష్టముగా భావమును వ్యక్తీకరించే సామర్థ్యమున్న కవులు కనుపించకున్నారు' అని జాషువా గారి కవిత్వమును గూర్చి యొక యభిప్రాయమును వెలువరించి, మరల 453 పుటలో 'జాషువా కవిత్వం ఎంతో తేలికగా ఉందని చెప్పినా ఆలోచించకుండా మాత్రము స్ఫూర్తికి రాదు' అని సెలవిచ్చినారు ఈ రెండవ వాక్యము, కవిగారి రచనా వైభవము నుగ్గడించునదియే గావచ్చును కాని, తొలి వాక్యములోని, 'ఇంత విస్పష్టముగా' అను పలుకులయందలి యర్థము నిది ఖండించి వైచినది.

'అసలు కవిత్వము తేలిగ్గా ఉండాలి అనే వాదానికి అర్థము లేదు' అని రావుగారు 458 పుటలో శాసించినారు, కాని వెంటనే, 'ఒకప్పుడు తేలిగ్గానే వ్రాయాలి' (458 పుట)అని సెలవిచ్చినారు. మఱల, 'గద్యరచన ఎప్పుడూ తేలికగానే వుండాలి, కవిత్వం ప్రజ లందరికి అర్థం కావాలి అనే వాండ్లకి రహస్యం తెలియదు' అని దబ్బరించివేసినారు. 'అసలు కవిత్వముయొక్క ప్రయోజనము విషయాన్ని బోధించడం గాదు, మనస్సునకు అలౌకిక సుఖానందమును కలగజేయడం' అని శ్రీరావుగారి ప్రవచనము. ఈ పై వాక్యములనుబట్టి, విషయ మర్థము గాకున్నను, ఆనందము పాఠకునకు కలుగవలయుననియు, అట్టిదియే సరియగు కవిత్వమనియు, తెలిసికొనినారము.—విషయము, అర్థము గాకున్నచో చిత్తమునందు వికార మెట్లు జనించును?

'ఉచితానుచిత వివేకము వ్యుత్పత్తి యనబడు. సందర్భశుద్ధికి, వస్త్వైక్యమునకు వ్యుత్పత్తి మూలము. వస్తుపరిశీలనచే వ్యుత్పత్తి లభించును'. అని పెద్దలు నిర్వచించినారు. శ్రీ రావుగారు 'ఈ కవికి భావనాశక్తితోపాటు పరిశీలనాశక్తి కూడా నున్నది. పది మాట లెందుకు, గొప్పకవికి కావలసిన సర్వలక్షణము లున్నవి' అని, వెంటనే 'వ్యుత్పత్తి లేదు' అనినారు. పరిశీలనాశక్తియే వ్యుత్పత్తికి మూలముకాగా, అట్టి పరిశీలనాశక్తి యీ కవికి గలదని తామే సెలవిచ్చి, వెంటనే శ్రీ రావుగారు ఈ కవికి, 'వ్యుత్పత్తి లేదు' అని యనుటలో నర్థమేమొ!

పుట 455 లో 'ఈ కవికి కవితా తత్వము తెలియదు, కవిత్వం వ్రాయడము వేరు, దానిపద్ధతి తెలియడం వేరు, ఆ అభిప్రాయాలు వెల్లడైనప్పుడల్లా కవి శక్తి కొంచెము వెలితిపడుతుంది' అని శ్రీ రావుగారనినారు; కాని 450 పుటలో 'అట్లా చెప్పటానికి కావలసినంత కవితాశక్తి యుండాలి, ఈ కవిలో నదే పుష్కలంగా నుంది' అని రావుగారనినారు. పై వాక్యమునందు 'పద్ధతి' అనే పదమును నిర్వచించి, కవి శక్తికి, కవితా శక్తికి, గల యంతరమేమొ, రావుగారు, వివరించనంతవరకు, దీనిని స్వవచన వ్యాఘాత దోషముగనే పరిగణింపవలసి యుండును.

'కవి ఎప్పుడూ రసములోనుంచే ప్రపంచాన్ని చూడాలని' ఆలంకారికులయాశయమని శ్రీ రావుగారు విశదపరచినారు. ప్రపంచ మన్నివిధముల నీరసించియున్నను, కవి, లోకమును రసమునుండియే జూచి, తాను వెలయించు కావ్యమునందు, నీరసజగతిని, రసమయప్రపంచముగా వర్ణింపవలసియుండునా? యథాతథముగ యీనాటి లోకమానాటి కావ్యమునందు ప్రతిబింబింపవలయునుగాని, వేరు విధముగా నున్నచో, కావ్యలక్ష్యము, కవియొక్క ప్రయోజనము, లోకమున కుండదు. కాటకముల మూలమున లోకము క్షోభించునుగాక, యుద్ధములవలన ప్రపంచము దహించుకొనిపోవునుగాక, జాడ్యముల మూలమున జాతి నశియించునుగాక, కవి రసమునుండియే, అందును 'శృంగార రసము పరమాహ్లాద హేతువైన రసము' గావున, దానినుండియే లోకమును జూచి రచనము జరుపవలయును కాబోలు!

'ఈనాటి కవులు రాజకీయాలలోనుంచి కవిత్వాన్ని చూస్తున్నారు' అని శ్రీ రావుగారనుచున్నారు. 451 వ పుటలో 'ఈ కవి కవిత్వంలో ఎక్కువభాగము పూర్వ చరిత్రస్ఫోరకంగా ఉంటుంది. ఈయనకు ప్రతిష్ఠరావటానికిదియొక కారణం' అని సెలవిచ్చినారు. నేటి రాజకీయములే, ముందునాటి చరిత్రము. ఒక పుటయందు, చరిత్ర నాధారపరచుకొని కావ్యములు వెలయించిన కవిని స్తుతియించి, మఱల, వేరొక పుటయందా కవినే, చరిత్రను తమ రచనమునకు వస్తువుగా నిర్ణయించుకొను కవుల వరు

సులో పడిపోయినవాడని, నిరుత్సాహమును వెల్లడించుటలో నర్థము కానరాకున్నది.

శ్రీ జాషువా కవియొక్క రచనా కౌశలమును శ్రీ రావుగారు వేరొకవిధమున విశదపరచియుండిన బాగుండెడిది. కవినిగూర్చి శ్రీ సీతారామరావుగారు చప్పటచ్చట యొకింత మ్రదేక సహితములగు వాక్యములను పొందుపరచియున్నారు; ఉదకు, 16½ మాటలు మాత్రమే నేర్చిన కవులవరుసలో శ్రీ జాషువా కవికి స్థానమున్నదని యనుట, (పుట. 458) అందుచేతనే, ఈకవి, అప్రతిష్ఠకు గురియైనాడని పలుకుట, సాహసము. సంస్కృతి వాఙ్మయమును సంపూర్ణముగ పరిచయ మొనరించుకొని, అలంకారశాస్త్రమును కూలంకషముగ నవలోడించి, యాంధ్ర సారస్వతరంగమున విస్తృతవిహార మొనరించిన శ్రీ రావుగారి కట్టి సాహసము తగునుగాని, యొరుల కెట్లు సరిపోవును! ఇదియొక తీరు విమర్శనము కాబోలు! ఇది రసమయమా? లేక 'తామస' మాయమా? అట్టులే గాకున్న, 'వాడి బుకాయింపు అంటావేమి?...నాకీయన సమాధాన మెంతవరకిచ్చాడో దానికి మాత్రమే జవాబు చెప్తాను' అని, ఏకవచన ప్రయోగమునకు వీరేల గడంగవలసి వచ్చెను?

సౌందరనంద కావ్యము రసవిహీనమైనదని శ్రీ రావుగారు నిరసించినారు, నిరసించుటే గాదు, తమకు ప్రత్యుత్తర మొసంగిన శ్రీ గణపతిశాస్త్రిగారిని కూలవాడినారు; 'సంస్కృతి భాషావైభవం తెలియనివా రనాగరికులు, శాస్త్రిగారీ సత్యాన్ని తెలుసుకోవాలి', అని సెలవిచ్చి, తమ 'నాగరికత' నుగ్గడించుకొని, శాస్త్రిగారి 'యనాగరికతను' వెల్లడియొనరించినా మనుకొనినారు. 'తనకు దూరదారి లేదు పైగా మెడకొక డోలట' అని 'సురభి' గారిని, శాస్త్రిగారిని, అవధి యెఱుంగని కటువు పలుకులతో కసరివేయుట సరికాదు. ఇది 'నాగరకుల'కు చిహ్నము కానేరదు. సౌందరనంద కావ్య మేనాడో తెలుగువారి మన్ననల నందినది; అందలి పద్యముల నెందరో కంఠస్థ మొనరించుకొన్నారు. తెలుగునాట నా కావ్యమున కొక గౌరవస్థానమున్నది. కొందరను, న్యూనపరచుచు వెలువడిన విమర్శనములు విస్మృతికర్హములు.

విమర్శనమునందు మాటవిసురు దుమార్గము మంచిదికాదు. తక్కిన కవులను, పండితులను, విమర్శకులను, 16½ శబ్దము లెఱింగినవారని హేళన మొనరించుట పాడికాదు. ఇట్టి దూషకవాక్యములు విషయ గౌరవమును వమ్మొనరించును. విమర్శక వాఙ్మయమును 'మరామత్తు' ఒనర్ప నడుముబిగియించిన శ్రీ రావుగారు, తమ యపార విజ్ఞానధనమును, తెలుగువారికి సరళము, సవ్యము, సరసము, అగు మార్గమువెంట నందించి భాషాసేవ గావింతురుగాక !




దినదినమునకు
ఇంక మృదువైన
టువంటియు,
ఇంక మనోహరమై
నటువంటియునైన
చర్మము
రెక్సోనాలోని కేడిల్‌తో ఈ
అద్భుతమైన మార్పును మీరు తెచ్చుకొంటారు.
కేడిల్‌తో గూడిన రెక్సోనా సబ్బును ప్రతిదినము వాడండి. అది
దినదినము మీ చర్మమునకు క్రొత్త ఆరోగ్యమును, క్రొత్త
మనోహరత్వమును తెచ్చును.
Rexona
రెక్సోనా
ఇది ఒక్కటే కేడిల్*తో గూడిన సబ్బు
* చర్మమును పోషించేటటువంటియు, చర్మమును
మెత్తగాచేయునటువంటియునైన నూనెల ఒక
ప్రత్యేక మిశ్రమమునకు రిజిస్టర్డ్ పేరు.
RP. 110-50 TL
రెక్సోనా ప్రొప్రయిటరీ లిమిటెడ్ వారిచే ఇండియాలో తయారుచేయబడినది

సౌందర్యమునకు ఆధారము మీ చర్మము



మీ ముఖ సౌందర్యమును కాపాడుకొనండి

వేడిమి మరియు చలి, తేమ మరియు పొడిదనము, ఎండ మరియు దుమ్ము... ఇండియాలో వీటినుండి మీ చర్మమును కాపాడుకొనవలెను. విపరీత శీతోష్ణ స్థితులనుండి మీ ముఖ సౌందర్యమును కాపాడుటకై హిమాలయా బుకే స్నో ప్రత్యేకముగా తయారుచేయబడినది. మీ చర్మమును మృదువుగాను, స్వచ్ఛముగాను నుంచేటందుకై దానిని ప్రతిదినము వాడండి. పౌడరును రాసుకొనుటకు ముందర దానిని వాడుటకు మీరు మిక్కిలి ఇష్టపడుతారు. దాని సువాసనను మీరు మెచ్చుకొంటారు.





హిమాలయా బుకే స్నో

మరియొక దివ్యమైన **ఇరాస్మిక్** సరకు

HBS. 9-X52 TL

ఇరాస్మిక్ కంపెని లిమిటెడ్, లండన్ వారి తరఫున ఇండియాలో తయారుచేయబడినది

నిష్క్రమణం

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

★

హలో! ఎవరు?

నేను నీలకంఠంగారి నౌఖర్నమ్మా కూర్మయ్యని

నువ్వేనా? నీలకంఠంగారున్నారా?

ఉన్నారమ్మా! ఇప్పుడే భోజనానికి కూర్చో బోతున్నారు.

భోజనానికా? ఏమిటి, నిజమే? వారి నొక్కమారిలాగ రమ్మనగలవా?

చిత్తం! చెప్తానమ్మా!

బాబూ! నిర్మలమ్మగారు తమర్ని ఒక్కమారు ఫోను దగ్గరికి రమ్మంటున్నారు.

ఓరిఘాలం! ఎవరు పిల్చినా నేను లేనని చెప్పమన లేదురా?

ఏమిటో బాబూ! మరెవరితోనయినా అలా చెప్పాలనుకొన్నాను. నిర్మలమ్మగారితో లేరంటే ఏమంటారోనని...

నీ స్వంత తెలివి తేటలు కొంత వెలిగించేవు. నిర్మల ఎక్కువేమిటి? అందరిలాటి మనిషేకదూ?

అదేటిబాబూ! అలా అంటారు. ఆరిని తెలిసిన కాడినుంచి ఈ పదినెల్లలోనూ ఒక పదిరోజులయినా ఇక్కడ భోంచేశారా? ఆయమ్మ పిలిస్తే, తమరు లేరంటే ఏమంటారోనని భయపడ్డాను బాబూ! తమరితో తప్పకుండా మాట్లాడాలిట!

విడిసివట్టున్నాయి తెలివి తేటలు! ఏమని చెప్పావు. ఇంట్లో నే నున్నాననేనా? అందులోనూ ఒక్కణ్ణే ఉన్నాననా?

అదేటీ నేదు బాబూ! తమ రున్నారు; భోజనానికి కూర్చుంటున్నారని చెప్పేను.

మా గొప్పపని చేసేవు, ఆవిడకి మరీ కోపం రావడానికి. సరే, మరి తప్పదు.

హలో!

ఎవరు శ్రీమాన్ నీలకంఠంగారే? ఆహా! ఇవతల వాకి రిసీవరు పట్టుకొనిఉండగానే నిద్రవచ్చేట్లయింది. పోనీ ఇప్పటికయినా తెమిలేరు.

క్షమించాలి. ఆలస్యం అయింది. అందులో మా కూర్మయ్య సంగతి మీకు తెలియదా? అసలిందాకా నేను మీ యింటికి రావాలని బట్టలు వేసుకొన్నాను. అంతలో సరిగ్గా...

ఏమయిందేమిటి?

ఏమీ లేదు. మా చిన్ననాటి స్నేహితుడొకడు, అమాంతంగా వచ్చిపడ్డాడు.

ఓస్ అంతేనా? మరేమీ ప్రళయం కాదన్న మాట?

కాదుగాని, వాడు నా అతిథి చూడండి; వాడికి భోజనభాజనాదులు సమకూర్చాలి. వాడికి మళ్ళీ పని

ఉండట. ఈ రాత్రి పన్నెండుగంటల బండికి వెళ్ళిపోతానంటున్నాడు.

అయితేనేం, ఇద్దరూ కలిసి, ఇక్కడికి వచ్చెయ్యక పోయారా? నాకూ రాధాకృష్ణ లేకపోడంవల్ల ఒంటరిగా ఏమీ తోచకుండా ఉంది. అయినా మీ బ్రహ్మచారి కొంపలో అతిథిసత్కారం ఏమి బాగా సాగుతుంది? ఇప్పుడు మాత్రం మించిపోయిందేమిటి? వచ్చెయ్యండి. మీరు మా యింట్లో అభ్యంతరం అయితే ఏదయినా హోటలుకి పోదాము. అక్కడనుండి ఏదయినా సినీమాకి వెళ్ళి, తర్వాత ఆయనను రైలుకి దిగబెట్టి మనం కలిసి రావచ్చును. ఏమంటారు?

బాగానే ఉంటుంది కాని...

మరి కాని ఏమీ లేదు. అంతే. ఇప్పుడే కారు పంపిస్తాను. మీరు రండి. మీరు వచ్చేలోగా నేను తయారవుతాను.

ఒక్క క్షణం ఆగండి నిర్మలాదేవి! మా వాడు చాలా మొంగమాటం మనిషి. అందులోనూ స్త్రీల సమక్షంలో మరీని. ఇటీవల వాడికి వ్యాపారంలో బాగానే కలిసివచ్చిందట. కాని, ఇంటి విషయాల్లో మాత్రం, బహుకుటుంబీకుడు లెండి, చాలా అనుకోని గొడవలు వచ్చి పడ్డాయట. ఈ పన్నెండుగంటల పర్యంతం అవన్నీ నేను ఆకర్ణించి సానుభూతి ఒలకబొయ్యాలి. దగ్గర లేదులెండి, మేడ మీద నా కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

ఎవరో చాలా చిత్రమయినవాడులాగున్నాడే. పోనీ లేకపోతే మీకా గొడవ వదిలిపోతుంది! నాకూ కాస్త కాలక్షేపంగా ఉంటుంది; నేనే తిన్నగా అక్కడికి వచ్చేద్దునా?

మీరే వస్తానంటే వద్దంటానా? కాని, చూసేరు కదూ, వాడికి తన మనసుని పీడిస్తున్న సంగతులన్నీ ఏకరువుపెడితేనే గాని తృప్తి లేదు. ఇప్పుడుగాని, అందుకు సరిఅయిన అవకాశం దొరకలేదంటే రేపంతా ఉండి వేధిస్తాడు. అంతకంటె వాడు ఇందాకా కాస్త మొంగమాటపడినట్లుగా అన్నాడు, ఇప్పుడు తొమ్మిదిగంటల పాసెంజరులో నే వీలయితే వెళ్తానని. వాడుగాని, కదిలితే, వదిలితే, నేను తొమ్మిదిన్నరకల్లా మీ యింటికి వస్తాను. మనం కలిసి సినీమాకి వెళ్దాము.

తప్పకుండా వస్తారు కదూ?

శాయశక్తులా ప్రయత్నిస్తాను.

లేకపోతే తొమ్మిదిన్నరకి నేనే వద్దునా?

ఎందుకు మీకు శ్రమ? వాడు కదిలితే, తిన్నగా స్టేషనునుండి నేనే వస్తాను. కదలకపోతే, ఆ గొడవలో మీకుకూడా ఎందుకు తలనొప్పి?

నాకిప్పుడే తలనొప్పి వచ్చేట్లుంది. తొమ్మిదిన్నరకల్లా మీరు రాకపోతే, మీ యింటికి తిన్నగా వస్తాను. అతని గొడవలు వింటూంటేనయినా నా తలనొప్పి తగ్గుతుందేమో?

అరరె! తలనొప్పిగా ఉందా? ఎలాగయినా నిద్ర తెప్పించుకొండికి ప్రయత్నించండి. నేను తప్పకుండా వస్తాను. వచ్చేసరికి మీరుగాని నిద్రపోతూ ఉంటే మాత్రం మరి లేపను లెండి-మరి శెలవా?

తప్పకుండా వస్తారు కదూ? అతను ఎప్పుడు వెళ్ళిపోయినా సరే! మేడమీది నా గదిలో లైటు వెలుగుతూండంటే నేను మేలుకొని ఉన్నట్టేలెక్క.

అలాగే. తప్పకుండాను. వీలయినంతమట్టుకు నిద్ర తెప్పించుకొనే ప్రయత్నం చెయ్యండి.

—అమ్మయ్యా! కూర్మయ్యా! ఇప్పటికి బ్రతికి బయటపడ్డాను.

ఏటో బాబూ! తమరి సంగతంతా చిత్రంగా ఉంది.

చిత్రమా, మరీచిత్రమా? ఇదంతా ఎందువల్ల వచ్చి పడిందో తెలుసునా?

ఒక్కమాట నువ్వు సరిగ్గా ఇంటిదగ్గర లేరని ఉంటే ఇంత గొడవ లేకపోయేది కదా!

ఏటో బాబూ! నాకేటీ తెలవకుండా ఉంది.

నీకు బోధపడేసరికి రోజున్నర పడుతుందిలే. పోనీ, అలాగని చెప్పినపని చెప్పినట్టు చెయ్యవు, నీ పైత్యంకూడా కొంత జతచేస్తేనేగాని నీకు తృప్తి కలగదు. నీ తెలివితక్కువ - కాదు అతి తెలివి మూలంగా, ఇప్పుడు లేని స్నేహితుణ్ణొకణ్ణి సృష్టి చేసుకోవలసి వచ్చింది. వాడయినా ఎంత వరకు అడ్డు నిలబడగలడో అనుమానమే. ఆవిడ కారు వేసుకొని ఏ నిమిషం వచ్చినా రావచ్చును.

ఒస్తే ఏటి భయంబాబూ అబద్దానికి తయారయినాక, స్నేహితుడుగారు ఇప్పుడే ఎల్లిపోయినా రంటారు.

ఏడిసినట్టే ఉన్నాయి నీ తెలివితేటలు. ఏ పనీ నీకు చెప్పినట్టుగా చెయ్యవు. ఆవిడ వచ్చిందంటే లాభం లేదు, ఊహూ! ఆవిడ రావడానికి వీల్లేదు. వస్తే

నేనే వెళ్తాను. సరే, కాని, భోజనాని కేమున్నాయి, ఆ పేర్చిన వస్తువులేనా? వారంరోజులుగా పస్తుపడు కొన్న వాడికయినా అవిచూస్తే మరి తినాలని బుద్ధి పుట్టదు.

తమరికి తెలవనిదేటుంది బాబూ! అయినా తమరీ మధ్దివల్లా ఇంటికాడ భోంచెయ్యడమే లేదు. ఆరింటికాడో, హోటేల్లోనో తప్ప - మధ్యాన్నం కాసింత సప్పేసి ఉంటే...

అవునవును, సకాలంలో అంటే వారంరోజులు ముందుగా నీతో విన్నవించుకోవాలి. లేకపోతే వెధవయింట్లో తిండికయినా గతిలేదు. మరి లాభం లేదు కూర్మయ్యా! నువ్వు బాగా ముసలివాడివయి పోయేవు. రేపటినుంచీ పెన్షనుతీసుకో, నేను మరొకణ్ణి పెట్టుకొంటాను.

తమరంతలా ఆగ్రహిస్తే ఏటి చెయ్యమబాబూ! తమర్ని నా చేతుల్లో ఎత్తుకొని ఆడించేను. చదువు కెళ్ళినా, అడవులు కొండలూ ఒకటేమిటి తమరితో పాటు సముద్రంకూడా దాటేను. ఇప్పటికి తమర్ని ఒక్కరోజు విడిచిపెట్టలేదు. నాన్నగారు తమర్ని నాకప్పగించేరు. ఈ ముసలోణ్ణి ఇప్పుడు పొమ్మంటే-

నీకేం నష్టం వచ్చింది? నీ జీతం పూర్తిగా నీకు నెల నెలా వచ్చే ఏర్పాటు చేస్తానంటూ ఉంటే-నాకు ఉన్న పనులే తక్కువ. అవికాస్తా నువ్వు పుణ్యం కట్టుకొంటావు.

లేదు బాబూ! పొరపాటయిపోయింది. మరెప్పుడూ...

ఇలా అనడానికిది వెయ్యోమాటు. కాదుగాని కూర్మయ్యా, పని చెయ్యకుండా నిండుజీతం పుచ్చుకోడానికి నీకేమిటి కష్టం?

కష్టం కాదూ బాబూ! తమ నాన్నగారు నా కుటుంబానికి ఏలోటూ లేకుండా చేసేరు. నాకొడుకు లంతా పెద్దవాళ్ళయి వాళ్ళ బ్రతుకులు వాళ్ళు బ్రతుకుతున్నారు. ఒక్క కూతురు. దానికికూడా భగవంతుడి దయవల్ల ఏ లోటూలేదు. నాకింకేం కావాలి? నాన్నగారు నన్ను తమర్ని ఎన్నడూ విడిచిపెట్టవని ఒట్టేసుకోమన్నారు బాబూ! తమరు జీతం ఇచ్చినా ఇయ్యక పోయినా సరే, సేవచెయ్యనిస్తే నాకంతే చాలును. తమరు పెళ్ళి చేసుకొని, ఒక యింటివారయితే, అప్పటికి నా బరువు తగ్గుతుంది.

ఇదుగో ఇదే నీలోని దుర్గుణం. నాకు మంచి చెయ్యాలనే అనుకొంటావు. కాని, నాకు అక్కర లేని, చికాకువేసే మాటలే మాటిమాటికీ అంటూ ఉంటావు. ఇదివరకెన్నిమార్లు చెప్పాను, నా పెళ్ళి మాట ఎత్తవద్దని.

అలా అంటే ఎలా బాబూ! ఇదివరకంటే చిన్నతనం. వీరూ రాధాకృష్ణ బాబుగారిలాగ పెళ్ళి చేసుకొని, చిలకా గోరింకల్లాగుంటే...

చేసుకొందామంటే మాత్రం అందరికీ నిర్మల లాటి మనిషి దొరుకుతుందా?

ఎందుకు దొరకరు బాబూ! తమ కేటి లోటు? రూపం, డబ్బు, చదువు అన్నీ ఉన్నాయి; తమరు సరేనంటే చాలు కోకొల్లలు పెళ్ళికూతుళ్ళు-అందాల భరిణలు, బంగారు బొమ్మలు...

ఊఁ చాల్లే చాలించు కవిత్వం. అందం! వట్టి అందమయితే ఏం లాభం? అంతకంటె ప్రాణంలేని చిత్రాలు శిల్పాలు వెయ్యిరెట్లు నయం. వట్టి అందమే కాదు, అందుకు విలక్షణమయిన ఆకర్షణ...సర్లే,నీతో ఏం మాట్లాడి ఏం లాభం? నీకు చెప్పేది ఒక్కటే మాట—నీ ఉద్యోగం బర్తరఫు కాకుండా ఉండా లంటే, ఈ మారెప్పుడూ నా పెళ్ళిమాట ఎత్తకు! మరి తిండిమాట ఏమంటావు?

తమ సెలవయితే, ఏవి తెమ్మంటే అవి నిమిట్ల మీద తెచ్చేస్తాను.

నీ మొహం తెచ్చేవుగాని, నే చెప్పేది ఒకటి నువ్వు తెచ్చేది మరొకటి. అంతకంటె నేనే పోవడం మేలు. నే వెళ్తున్నానుగాని, చెప్పింది కాస్త కునికి పాట్లు పడకుండా విను. నేను వచ్చేలోగా నిర్మలాదేవిగాని వస్తే, నేనూ మా స్నేహితుడూ కలిసి భోం చేసి ఎక్కడికో వెళ్ళమని చెప్పాలి. రైలు స్టేషనుకో ఎక్కడికో నీకేమీ తెలియదు. మురుగుల కథలాగ మాత్రం చెయ్యకు, ఫోనులో పిలిచినా అంతే-

చిత్తంబాబూ. తమరొచ్చి, నిద్రపోయినాక, ఒకమారు మా వాళ్ళింటికెళ్ళి వస్తాను.

నీకు కావాలంటే ఇప్పుడే వెళ్ళు. నా తాళం నా పర్సులోనే ఉందికదూ. నా పక్క అదీ వేసి, రాసుకొనే వస్తువులూ అవీ టేబిలుమీద ఉంచి, నీ యిష్టం ఎప్పుడు వెళ్ళినా సరే...

తమరికి నిద్రపట్టదంటున్నారు. ఏ మవసరం పడుతుందో, నేను పొద్దున్నే వస్తాను బాబూ!

సరేగాని, ఆవిడ వచ్చినా ఫోనులో పిలిచినా ఏమిటి చెప్పాలో జ్ఞాపకం ఉండికదూ.

చిత్తంబాబూ! మరి మరిచి పోతానా?

ఏమోన్లే, మళ్ళీ నీ స్వంతకవిత్వం వెలిగించి పొరపాటయిపోయింది బాబూ అని మాత్రం అంటే ఊరుకో నేదిలేదు.

పెద్ద హోటలు. అందులో ప్రత్యేకమయిన గది. వెయిటరు ఒక్కొక్కటి చొప్పున ప్లేట్లు తెచ్చి పెడుతూ ఉంటే ఇవన్నీ తాను ఆర్డరిచ్చినవేనా అని పించింది. కాని చెప్పిందీ వాడెందుకు తెస్తాడు.? పోనీ ఈ మారు తెచ్చే ఈ డిష్ అయినా కొత్త తినబకు తుందేమోనని చూస్తున్నాడు నీలకంఠం. కాని ఏమిటో అన్నీ ఒక్కలాగున్నాయి.

పదార్థాల రుచిలో ప్రత్యేకించి ఇది లోపము అనడానికి వీల్లేదు. ఇంతకంటె చిన్న హోటల్సులో, మంచి కుర్చీలు బల్లలూ విశ్రాంతిగా కూర్చుండికి తగిన స్థలమూ లేనిచోట్లకూడా ఎంతో తృప్తిగా తిన గలిగేవాడు, పదార్థాల రుచినిగురించి ఎక్కువ పట్టింపు లేకుండా. ఇక్కడ కుర్చీలు, బల్లలు దీపాలు పంకాలు, అద్దాలు అన్నీ సక్రమంగా ఉండవలసి నంత బాగానూ ఉన్నాయి. పదార్థాలు, పానీయాలూ వెయిటర్లు—ఏ అంశములోనూ లోటు లేదు.

అయితే మరి ఎందుచేత తాను తృప్తిగా తినలేక పోతున్నాడు? ఏదో లోటుంది. ఆ లోటు బాహ్య మయిన వస్తు సముదాయంలోనూ, వాతావరణంలోనూ కాక లోపలే ఉంది. లేకపోతే ఈ పదినెల్ల లోనూ ఈ హోటల్లోనే ఈ గదిలోనే ఎన్నో మార్లు నిర్మలా రాధాకృష్ణులతో కలిసి భోంచేసేడు. అప్పుడు తిన కెటువంటిలోటూ కనబడలేదు. అసలు కనబడడానికి తగిన విశ్రాంతి ఉంటే కదూ! రాధాకృష్ణ—నిర్మల—వీరి సాహ చర్యం తన ఇంద్రియాల పరిశీలన జ్ఞానంలోనే ఏదో చిత్రమయిన మార్పు తెచ్చి ఉండాలి.

అందరూ తన మంచినీ సుఖాన్నీ కోరేవారే. తనకి కష్టాలు కలిగించేవారే—కూర్మయ్యలాగ. వాడి తెలివితక్కువ పనులవలన అంత ప్రమాదం లేదు; కాస్త విసుగుకొని నాలుగు కేకలువేస్తే సరిపోతుంది.

కాని రాధాకృష్ణలాటివాడి స్నేహమూ అభి మానమూ ఉన్నాయే ఇవి మొదట్లో ఎంత అభిలష ణీయమయిన వయినా చివరికి మరింత బాధపెట్టడానికి మాత్రమే పనికివస్తాయి.

హాయిగా స్వేచ్ఛగా ఒక పూచీపేచీ లేకుండా దేశాటనం చేస్తూ ఎక్కడ ఎన్నాళ్ళు కావాలంటే అన్నాళ్ళు ఉంటూ, ఎప్పుడు కావాలంటే అప్పుడు బయలుదేరి పోగలిగేవాణ్ణి ఒకచోట తెచ్చి కట్టి పడే సేడు. పోనీ అంతతోనయినా ఊరుకొన్నాడా? తనతోపాటు కారులో తిప్పడం! తగిన పరిశ్రమ లేకుండా ప్రతినిత్యమూ విలువయిన పుష్టికరమయిన భోజనం చెయ్యడం! ఇప్పటికప్పుడే ఈ పది నెల ల్లోనూ బరువు పదిహేను పౌనులు ఎక్కువయింది. ఈవిధంగా బద్ధకంగా మరొక ఏడాది తిని కూర్చుంటే మరి పదిహేను కాదు పాతిక పౌనులు బరువెక్కు వయినా ఏమీ ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. ఇప్పుడు ఎక్కువయినది పదిహేను పౌనులే అయినా వందపౌనులు ఎక్కువయితే ఉండేపాటి స్థూలత్వం వచ్చింది.

ఇదంతా రాధాకృష్ణతనకు జీవితమంటే ఆకర్షణ, అభిరుచి, ఉత్సాహమూ కలిగిస్తానని చేసిన నిర్వా కమే. ఆటలూ పాటలూ విందులూ నృత్యాలు—తనకి తీర్చుకోవాలని ఉన్న సరదాలన్నీ ఇవతలిమనిషి పేరుపెట్టి తీర్చుకొనే ఎత్తుమాత్రమే.

నిజంగా రాధాకృష్ణ ద్రోహంచేసేడా? తనకు పూర్వం ఒక పూటంతా ఒక నదిఒడ్డున తిరుగుతూ ఉంటేనో, కొండ ఎక్కుతూ ఉంటేనో, వేట అనే పేరుతో అడవుల్లో సంచరిస్తూ ఉంటేనో అతి ఉల్లా సంగా గడిచిపోయేది. ఆతరవాత చల్లని మంచినీళ్లే అద్భుతమయిన పానీయంగా ఉండేవి; ఏపదార్థా లయినా అత్యంత రుచికరంగా ఉండేవి. కాస్త కంటికి అందంగా కనిపించినచోట ఆగడం, ఉండా లనిపించినన్నాళ్ళుండడమూ, ఎప్పుడు బుద్ధిపుడితే అప్పుడు బిచాణా ఎత్తివెయ్యడమూ, ఎంత హాయిగా నిర్విచారంగా ఉండేది! అరికమయిన సంతతి చలన శీలాన్నీ సహజసిద్ధమయిన తృప్తినీ అంతరింప జేసిన వాడు రాధాకృష్ణే.

ఉద్దేశించినా ఉద్దేశించకపోయినా అతను తనకు ఇటీవల చేసిన అలవాటులు అధికవ్యయంతో కూడుకొన్నవే కాక సహజమయిన ప్రకృతితో సంబంధంలేనివి. అందరూ ఏవో తప్పనిసరిఅని భావించేవి, ఎవరూ ఎక్కువగా ఆనందించని విన్నీ—విందులు—పేకాట...అసలు ఆడేన ఆట కంటె ఆటలోని పొరపాట్లనిగూర్చిన చిత్రవధే ప్రధానము.

ఛ ఛ ఛ. ఇంతటి అలసత్వానికి తా నెలా అల

వాటుపడిపోయేడు, ఇదంతా రాధాకృష్ణ బాధ్యత కాదా?

అయితే అతనేమి కట్టిపెట్టిఉంచేడా? అతను చెప్పిన పనులన్నీ ఎందుకు చెయ్యాలి? నిజంగా ఇష్టం లేదని ఎదురుతిరిగితే అతనేం చెయ్యగలడు? లోపల లోపల కొంత ఇష్టంఉండికూడా అతడిని నెపపెట్టడం జరుగుతూందన్నమాట. లేకపోతే ఇప్పుడింతలా మథనపడకపోతే తిన్నగా రయిలెక్కిపోరాదూ?

అయితే రైలెక్కిపోవడమే మేలు—ఎక్కడికి వెళ్ళాలి. ఏమిటి చెయ్యాలి?—ఎక్కడికయినా బాధ లేదు; ఏమీ చెయ్యకపోయినా నష్టంలేదు. ఎక్కడికో ఒకచోటికి తననుండి తనను కాపాడుకొందికి ఈరాత్రి దూరంగా పారి పోవాలి.

అదే బాగుంది, తొమ్మిదిగంటలకి ఎలాగూ స్నేహితుణ్ణి దిగబెట్టడానికి స్టేషనుకి వెళ్ళాలికదూ. ఆ వెళ్ళడం అతడి బలవంతంమీద రైలెక్కి వాళ్ళ ఊరు వెళ్ళిపోయేమన్నమాట. మళ్లీ తరవాత మూడు రోజులనాడు రామకృష్ణ వచ్చేవరకూ తిరిగి రానక్కర లేదు.

కాని రెండుమూడురోజాలుండాలంటే బట్టలూ అవీ తీసుకోవాలి. డబ్బుకూడా పర్సులో పాతిక కంటె ఎక్కువ ఉండదు. ఇంకా సుమారు అరగంట పైగా టైముంది, బండీ రావడానికి. ఇంటికి వెళ్ళి కావలసినవి చాలుగూ తీసుకొనే బయలుదేరవచ్చును. కూర్మయ్యచేత రేపు ప్రొద్దున్న కబురు చెప్పించ వచ్చును, తప్పనిసరిగా వెళ్ళవలసి వచ్చిందిటఅని.

ఏంకూర్మయ్యా! నాకోసం ఎవరయినా వచ్చేరా?

లేదు బాబూ!

బ్రతికాను. సరే. మరి నేను ఇప్పుడీ టైల్లో...

బాబూ! ఆయమ్మ నిర్మలమ్మగారు ఫోనులో పిలిచి తమర్ని రాగానే పంపించమన్నారు. తలబాధ ఎక్కువగా ఉందట.

ఉంటుందిలే...

తమ రక్కణ్ణించే ఒస్తున్నారేమిటి బాబూ!

లేదుగాని నాకు తెలుసునులే. మరి నేను ఇప్పుడీబండిలో వెళ్తున్నాను.

ఆదారిని ఆయమ్మ యింటికెళ్ళిచూసి ఎళ్తారా బాబూ?

నీ తెలివి తెల్లవారినట్లే ఉందిగాని, ముందు జాగ్రత్తగా విను. రేపు ఉదయం ఆవిడఇంటికి వెళ్ళి బాబు గారిని ఆ వచ్చినస్నేహితుడు బలవంతంచేస్తే, బయలు దేరివెళ్లేరని, రేపుకాదు ఎల్లుండి సాయంత్రానికి వస్తా నన్నారనీ చెప్పు. ఎక్కడికి వెళ్లేరోమాత్రం నీకు తెలియదు, తెలిసిందా?

ఏటో బాబూ, నాకంతా ఇచ్చిత్రంగా ఉంది. ఇందాకా, ఎవరూ లేందే ఉన్నారంటే తమాషా చేస్తున్నారనుకొన్నాను. ఇప్పటికిప్పుడీ పయన మేమిటి? అందులోనూ ఒక్కరే ఉండి, ఇద్దరని చెప్పడమేమిటి?

అబ్బ, నువ్వు ప్లీడరీచేసిఉంటే సాక్షులప్రాణా లను తీసి ఉందువు. ఎందుకయితేనేమి నాకిప్పుడిలా బుద్ధిపుట్టింది, నేను వెళ్తున్నాను, నాయిష్టం ప్రకారము. మధ్యను నువ్వెవడివి నన్ను అడగడానికి?

అదికాదు బాబూ! ఆయమ్మ తలపోటుతో ఎంత బాధపడుతూందో? అప్పుడు తమజబ్బులో రాత్రనక పగలనక ఆయమ్మ ఎంత అవస్థపడ్డాది బాబూ! అయితే తమరటు వెళ్ళకుండానే రెయిలుకెళ్ళి పోతారన్న మాట? పోనీ, నన్నెళ్ళమంటారా బాబూ?

నీకావాలంటే వెళ్ళు, నా అభ్యంతరంలేదు, కాని, ఎందుకు నువ్వెళ్ళడం?

ఎందుకేమిటిబాబూ! బాధపడుతున్నవోరికి సాయం చెయ్యడానికి డాక్టరుగారిని పిలుచుకు రమ్మంటారేమో?

ఆమాత్రం పని చెయ్యడానికి ఆవిడకి ఎవరూ నౌకర్లు చాకర్లు లేరనుకొన్నావా? నువ్వు అక్కడికి వెళ్తే ఇక్కడ ఉద్యోగం ఊడినట్టే. నువ్వు మరేమీ అతితెలివి వినియోగించకుండా నేచెప్పినట్టు చెయ్యి: ఒకవేళ ఆవిడ ఇప్పుడే రైలువెళ్ళేలోపున అడిగితే స్నేహితుణ్ణి దిగబెట్టడానికి స్టేషనుకి వెళ్ళేరనీ అటు నించి తమయింటికే వెళ్తున్నారనీ చెప్పాలి. నువ్వలే. నువ్వు బట్టలూ అవీ సర్దడం మొదలుపెడితే ఈబండికి కాదు, పన్నెండు గంటల బండీకికూడా తెమలదు. తొందరగా పరుగెత్తివెళ్ళి జట్కా తీసుకురా?

చిత్తంబాబూ!

కూర్మయ్యని అన్నాడేగాని, అతను జట్కా తీసుకొని వచ్చేసరికి అలాగే కూర్చుని ఉన్నాడు నీలకంఠం. నాలుగు పెట్టెలలోనివీ బట్టలు చుట్టూ విరజిమ్మి ఉన్నాయి. ఎదురుగాఉన్న సూట్ కేసు

ఖాళీగా ఉంది. వెలిగించిన సిగరెట్టు దానంతట అది కాలి చివరకు చెయ్యి చురికి తేనేగాని పారెయ్యాలని స్ఫురించలేదు.

చెయ్యి చురికిందని చికాకుపడుతూ ఉండగా 'జట్కా వచ్చింది బాబూ' అన్నాడు కూర్మయ్య.

నీ మొహం వచ్చింది. ఎందుకు జట్కా! ఇప్పుడింత హఠాత్తుగా పారిపోవలసిన అవసరం నాకేం పట్టింది! నేనే తెమ్మంటే మాత్రం చెప్పిన ప్రతిపని వెంటనే చేసి ఏడిసేవా? సరే వాడికి ఏవో కొన్ని డబ్బు లిచ్చిపొమ్మను.

వాడిని పంపించివచ్చి కూర్మయ్య బట్టలు తీసి పెట్టెలలో సర్దసాగాడు. ఇదంతా నీలకంఠం చూస్తున్నాడంటే చూస్తున్నాడు; లేదంటే లేదు. కొద్ది క్షణాలు పరధ్యానంగా కూర్చొని, చివాలున లేచి, "అయితే ఆ జట్కాని పంపించేసేవు కదూ" అన్నాడు.

చిత్తం బాబూ, తమరు చెప్పినవెంటనే పంపించేసినాను.

నాకు తెలీదూ. నీ తెలివితేటలూ—హుఁ అక్కరలేని పనులు మాత్రం ఇంకా నా నోట్లో మాట నోట్లో ఉండగానే చేసి తగలెడతావు. ఆ సైకిలు కూడా వేళకి పనికిరాకుండా పోయింది.

తమరు తొక్కడం లేదుకదా అని బాగు చేయించలేదు బాబూ! కావాలంటే ఎంత! జట్కా నిమిట్లలో తెచ్చేస్తాను.

అక్కర్లేదులే.

అయినా ఏటో బాబూ! తెస్తే ఒద్దంటారు. పంపించేస్తే కావాలంటారు. తమరి ఒంట్లో ఎలా ఉందో? ఎక్కడికీ తిరగకుండా చల్లగా పడుక్కోండి బాబయ్యా! కాళ్ళు పిసుకుతాను. నిద్రపోతే అంతా అదే సర్దుకొంటుంది.

నిద్రపోతే అంతా అదే సర్దుకొంటుంది - నిద్రపోలేను. కాని, నిద్రపోవడ మెలాగ? అసలు టైమెంతయిందో చూడు.

టైమా, ఏటిబాబూ! తమ చేతినే, వాచీ ఉండగా నన్నడుగుతారు? తమకి సుస్తీగా ఉంది బాబూ పడుకోండి.

వెధవ ఉపన్యాసమూ నువ్వూనూ. నా వాచీ నడుస్తున్నదో ఆగిపోయిందో—నీకేం తెలుసును, చెప్పగానే హాల్లోకి వెళ్ళి టైముచూసి రారాదూ? అడ్డదిడ్డమైన వెధవసమాధానాలు చెప్పకపోతే...

తొమ్మిదికి అయిదునిమిషాలుంది బాబూ!

సరే, ఇప్పటికి మహా గొప్ప విషయం కనిపెట్టేవులే. నేను వెళ్తున్నాను.

ఎక్కడికి, రైలుకేనా బాబూ!

ఆ సొదంతా నీకెందుకు? ఎన్నివేలమార్లు చెప్పేను, వీధిలోకి బయలుదేరేముందు ఎక్కడికని ఎప్పుడు తిరిగివస్తారని అడగవద్దని...

కాదు బాబూ! మళ్ళీ యింటికి వస్తామంటే పక్కఅంతా సర్ది ఉంచుతాను. రాకపోతే, పాలు ఇప్పుడే తాగేసి వెళ్ళండి. భోజనం సరిగా చేసేరో లేదో?

నీలాటి నౌఖరున్న తరవాత మరి తిండి తిన్నగా తినడం అంటూ ఉంటుందేమిటి? నా బసకు నేను రావడానికీ పోవడానికీ కూడా మధ్యను నీ పెత్తన మేమిటి? వస్తే వస్తాను, లేకపోతే లేదు. నాయిష్టం. నీచేతనయినపని చెయ్యి, లేకపోతే మానీ. తాళం వేసుకొని దొక్కాపో...ఏది నా తాళం. పర్సులో ఎక్కడా కనబడదు. ఎక్కడ తగలెట్టావో?

నాకేమి తెలుసును బాబూ: తమరి తాళం తమ దగ్గరే ఉండాలి ఎక్కడ పోయిందో?

పోతేపోనీ బాబూ! తమరెళ్ళండి. తమరు తిరిగొచ్చేదాకా నేనెక్కడికీ కదలను. అయినా ఒంట్లో బాగులేదు కాబోలు. ఎందుకెళ్తారు బాబూ పడుకోకూడదా?

తిన్నగా నోరు మూసుకొని పడివుండక వెధవ మాటలూ నువ్వూను.

కూర్మయ్యమీద కోపంతో కొంతమేర చరచరా నడిచివెళ్ళేడు నీలకంఠం. నిజంగానే కూర్మయ్య చెప్పినట్లు తన ఒంట్లో బాగులేదేమో? లేక తన మనసు సరిగా పనిచేస్తూ ఉందో లేదో?

లేకపోతే ఇంత ఆలోచన తటపటాయింపు దేనికి? తనకేం కొత్తా, మొగమాటమా? ఆప్తమిత్రుడు రాధాకృష్ణయింటికి వెళ్ళడాని కింత సంకోచం దేనికి.

అతనికి తెలియకుండానే నడక చాలా మందగించి పోయింది.

ఇప్పుడు తాను కేవలం ఆప్తమిత్రుడుగానే రాధాకృష్ణ ఇంటికి వెళ్తున్నాడా? ఇంతకీ అతను ఇంట్లో నేకాదు, ఊళ్ళోనూ లేడని తెలుసునుకద!

అయితేమాత్రం, లోగడ ఎన్నిసార్లు రాధాకృష్ణ ఇంట్లో లేని సమయాల్లో తాను నిర్మలాదేవితో కబుర్లు చెప్తూ కూర్చోలేదూ. ఎన్నిసార్లు, తామిద్దరే, కలిసి సినీమాకి వెళ్ళలేదు. అంతకంటె ఇప్పుడున్న విశేష మేమిటి?

ఏ విశేషమూ లేకపోతే ఇప్పుడింత తటపటాయించవలసిన అవసరం ఏం వచ్చింది?

ఏమిటిది, ఈ అడుగుల చప్పుడు? సరిగా నాతోనే ఎవరో నడుస్తున్నట్టున్నారు. ఊహూఁ ఎవరూ లేరే. తన పదధ్వని తనకే వింతగా వినిపిస్తోంది కాబోలు. దొంగతనం చెయ్యబోయేవాడు తన నీడని చూసి తానే భయపడతాడంటే ఇదే అయి ఉంటుంది.

ఇందులో దొంగతనానికీ భయానికీ ఏముంది?

ఆవిడకు ఒంటరిగా ఉండడంవల్ల ఏమీ తోచడంలేదు; పైగా తలనొప్పిగా ఉంది. అటువంటి స్థితిలో కాస్త కాలక్షేపంగా ఉంటుందని రమ్మంది. కలిసి సినీమాకి వెళ్ళడమో, ఏవో కబుర్లు చెప్పడమో సాగిస్తారు. ఇంతమాత్రంలో ఎవరికి ఏమి హాని చేసినట్లవుతుంది? అప్పుడు తన జ్వరంలో ఆవిడ రాత్రింబగళ్లు ఎంతలా సేవ చేసిందికాదు. ఇదివరకెల్లా లేని తప్పు ఇప్పుడేనా వచ్చింది? తనవన్నీ వట్టి ఆధారంలేని అనుమానాలు.

మళ్ళీ నడక వేగాన్ని అందుకొంది. కాని హఠాత్తుగా ఆగిపోయేడు, మళ్ళీ ఏదో తనను అనుసరిస్తున్న పదధ్వనిలా వినిపించింది. ఆగినతరవాత ఏ చప్పుడూ లేదు. ఎవరా గోడప్రక్కను మనిషి? ఎవరో ముష్టివాడు కాబోలు. ఇప్పుడు నేను వచ్చినప్పుడక్కడ ఉన్నాడా? ఏమో సరిగా చూడలేదు. లేక, తన ఈ నడక, ఈ గాభరా ఈ వైఖరి అంతా చూసి, ఏ పోలీసు ఉద్యోగి అయినా వెంటాడుతున్నాడేమో? ఇదీ చిత్రంగానే ఉంది. చూసి చూసి, నిన్ను ఎరస్టు చేస్తున్నాను పద పోలీసు స్టేషనుకి అంటే?

అంటే అననీ, ఏం భయం? మహారాజులా వెళ్తాడు. ఈ రాత్రిమటుకు స్వేచ్ఛ లేకపోతేనే బాగుంటుంది. రేపు సాయంకాలానికి రాధాకృష్ణ వస్తాడేమో? హుఁ తనని హింసించాలని కాకపోతే, నిర్మలనుకూడా తీసుకొని పోకూడదూ?

అతనికేం తెలుసును, తన మనసు యిటువంటిదని—తానింతటి స్నేహద్రోహి అనిన్నీ - తానీరకం మనిషి అని తెలిసిఉంటే, అసలు చేరనిచ్చేవాడే కాడేమో? మొదట్లో జీవితమంటే విసుగ్గా సంఘమంటే బెదురుగా, ఒంటరిగా అడవులూ కొండలూ పట్టుకొని తిరుగుతున్నవాడికి జీవితంలోని మాధుర్యమేమిటో రుచి చూపించాలని ప్రయత్నించేడు, తన పాటులు కూడా అశ్రద్ధచేసుకొని—అదే అతడు చేసిన నేరం.

అటువంటి ప్రేమపాత్రుడయిన స్నేహితుడికి తానుచేసే ప్రత్యుపకృతి అతని భార్యను కోరడం. ఛఛఛ. ఇంతకంటె నీచమయిన మిత్రద్రోహం ఇంకెక్కడుంటుంది. ఇంతకంటె ఆత్మహత్య వెయ్యిరెట్లు నయం—తక్కున ఆగిపోయేడు, వెనకనుండి వచ్చే పదధ్వనికూడా ఆగిపోయింది. కాని ఉందా లేదా అని అనుమానంగా ఉండే ప్రతిధ్వని మాట ఆగిన కొంచెంసేపటిలో ఆగినట్టయింది. అది నిజం కావచ్చు, తనభ్రమ కావచ్చును.

అబ్బబ్బ! తాను ఒకమూల అటో ఇటో తేల్చుకోవలసిన ముఖ్య సమస్య గురించి కొట్టుకు చస్తూ మధ్యలో ఏవో నీడలు వెన్నంటివస్తున్నాయనీ, ఏవో పదధ్వనులు వినిపిస్తున్నట్టున్నాయనీ అనుమానపడుతూ కూర్చుంటే ఎలాగ?

ఇలా నడుస్తూ ఆలోచిస్తే లాభం లేదు. ఎక్కడో ఒకచోట ఒక్క రెండునిమిషాలు నిశ్చలంగా కూర్చొని, నిదానంగా ఆలోచించి అటో ఇటో ఏదో ఒక తిరుగులేని నిశ్చయానికి రావాలి. ఎక్కడిదాకానో ఎందుకు? ఇక్కడే, ఎవరిఇల్లో గాని, ఈ అరుగు ఎత్తుగా చాలా బాగానే ఉంది; వీథికూడా నిర్మానుష్యంగానే ఉంది.

తగినంత చీకటి లేక రేడియండయలు వాచీ ముళ్ళు కనిపించీ కనిపించనట్టున్నాయి. ఒక గబ్బిలం ముంజూరు దగ్గరనుండి బైటపడి, టపటపమని కొంతసేపు కొట్టుకొని ఎగిరిపోయింది; ఊరకుక్క ఒకటి లేచి టపటపమని చెవులు కొట్టుకొని, ఏదో పెద్ద పని ఉన్నట్టు పరుగెత్తసాగింది. ఇందాకటి ముష్టివాడు అలాగే గోడవారనే ఉన్నాడు. బహుశః ముష్టివాడు కాడేమో? ఎవడయితేనేం వాడి ఉద్దేశం నేను తనను గమనించలేదని అయిఉంటుంది—ఎవడయినా మనకొక్కటే—ఇందాకా ఎగిరిన ఒక్క గబ్బిలమే కాదు ఇంకా ఉన్నాయి కాబోలు, కంపు కొడుతూంది; అందుకు పల్లమెరుగని నీరు నిలవయిన మురుగుకాలవ సౌగంధ్యం కూడాను.

సంశయాత్మా వినశ్యతి అన్నారు, మరి సందేహించడం వట్టి తెలివితక్కువ — సరిగా ఇందాకా వస్తానన్న టైముకూడా అయింది. మామూలుగా వెళ్తాము, ఆవిడ సినీమాకి వెళ్దామంటే వెళ్తాము, లేదా కబుర్లు చెప్పుకొంటాము, కాదంటే ఆవిడకు నిద్ర వచ్చే పర్యంతం ఏదయినా పుస్తకం పైకి చదువుతాము. ఇందులో పొరపాటెక్కడుంది? తన మనస్సెలా నుంటే నేమి? ఒక్క చేతితో తట్టినంతలో చప్పుడు కాదుకదా? ఇంతకీ ఆవిడ ఈసరికి నిద్రపోతూ ఉంటే ఏ గొడవా లేదు. తిన్నగా తానూ ఇంటికి పోయి పడుకొంటాడు.

చకచక నడక సాగించాడు. ఇందాకటి నీడలూ పదధ్వనులూ ఏవీ గోచరించలేదు. అంటే అదంతా తన భ్రాంతి మాత్రమే నన్నమాట.

ఇంటిముందు తోటలోని చెట్ల సందుల్లోంచి కనిపిస్తుంది దీపం. అనుమానం లేదు. అదుగో రెండవ అంతస్థు. ఆమెగదే. బహుశః కిటికీ దగ్గరే ఉండి ఉంటుంది. మరి కొద్ది అడుగులు వేస్తే కనబడిపోతాడు. స్పష్టంగా ఫలానా అని తెలియకపోయినా, ఒడ్డు పొడుగులనుబట్టి, నడకనుబట్టి ఆవిడ పోల్చుకోగలదు. కంటబడి నవక్క మరి తిరిగిపోవడం పురుషలక్షణం కాదు.

అయితే ఇలా దొంగతనంగా పారిపోవడం మాత్రం పురుషలక్షణమా. ఏమో, తల పగలకొట్టుకొన్నా తేలకుండా ఉంది.

ఏమిటీ చిత్రం, తననెవరూ బంధించి ఉంచలేదే — తాడుకట్టి ఇక్కడకు ఈడ్చుకొని రాలేదే. అయినా ఏదో అదృశ్యశక్తి తనను బలవంతంగా లాగుతున్నట్టే ఉంది. రైలెక్కి దూరంగా ఎక్కడికో పోవాలనుకొన్నవాడు ఉండిపోవడం దేనికి? ఉన్నా ఇంట్లో పడుకోక ఇలా బయలుదేరడ మేమిటి? బయలుదేరినవాడు ధారాళంగా వెళ్ళక మధ్యలో ఇన్నిమార్లు ఆగడం, 'మనమా వద్దిక వాడుమాట వినుమా మర్యాదగా పాడుమా' అన్న శ్రవణానందం ధోరణిని తర్జన భర్జనలు చెయ్యడం ఏమిటి?

మరేం అనుమానం లేదు, తన మనస్సు పూర్తిగా చెడిపోయింది. లేకపోతే రాధాకృష్ణ ఒంటరిగా ఊరికి వెళ్తున్నాననగానే ఏదో చెప్పలేని ఉత్సాహం ఎందుకు కలగాలి? ఆ తరవాతయినా, ఒకవంక తప్పించుకొందికి ప్రయత్నిస్తున్నట్టు ఉండికూడా ఎందుకు దూరంగా పారిపోకపోవాలి? ఆమె తనకు కావాలి, లేకపోతే మరి బ్రతకలేడు, తనను ఒకటవ రకం మిత్రద్రోహి అని లోకం దుమ్మెత్తినా సరే.

ఇది కేవలం తనలోపమే కాదు. ఇటీవలి ఆమె చర్యలోనూ తనలోని ఈ రకమయిన వాంఛను రేకెత్తించే గుణాలెన్నో ఉన్నాయి. ఆమె నవ్వులో మునపటికీ ఇప్పటికీ చాలా భేదం ఉంది; మాటలో, నడకలో ఎవరూ లేనప్పుడు మరిచిపోయినట్టుగా చెయ్యి పట్టుకోవడంలో... ఊహుఁహుఁ ఎటువంటి అనుమానం లేదు; తన మనస్సుకంటె స్పష్టంగా తెలుస్తుంది ఆవిడ మనస్సు. ఇందాకా ఫోనులో వినిపించిన గొంతుకలో కూడా ఎటువంటి సందేహచ్ఛాయా లేదు. ఆవిడ సహజంగా ఎంతో మంచిదికానీ, ఇదేదో ఆవిడ బలానికి కూడా మించిన అదృశ్యశక్తి లాగడం వల్లనే కావచ్చును, పక్కదారిలోకి లాగుకొని పోబడుతూంది. అంతా పూర్తిగా తనలాగే. లోగడ తానెందరు ఎంతటి సౌందర్యవతులను చూడలేదు, అప్పుడెల్లా చలించని మనసు, వట్టి చలించడం కాదు, బలవంతంగా మెడక్కు తాడుకట్టి లాగుకొని పోయినట్లుగా ఈడ్చుకొని పోతూ ఉంటే — మరి నిలవడమెలా సాధ్యమవుతుంది?

హుఁ ఆగు, మూడు, మరి రెండడుగులు ముందుకు వేసేవా? మరి జన్మలో ఎన్నటికీ నిన్ను నువ్వు క్షమించుకోలేని నైచ్యానికి మిత్రద్రోహానికి సిద్ధపడుతున్నావన్నమాట, చూసుకో, ఆవిడ ఏదో నిన్ను కావాలంటే మాత్రం అతనిని విడిచిపెట్టేస్తుందా? విడిచిపెట్టాలంటే మాత్రం వీలుండొద్దూ? వాటన్నిటిమాటకీ ఏమి? ముందు మిత్రద్రోహానికి సిద్ధపడితే తక్కినవన్నీ తరవాత తేలవలసిన చిన్నచిన్న సమస్యలు. ఇంతటి సంశయాత్మకమయిన స్థితిలో ఏమి సుఖముంటుంది? అనవసరంగా శాశ్వతమయిన అపనిందపడడమే మిగిలిపోతుంది — కేవలం తలచుకొన్నంతమాత్రాన ఆమె చేతు లింత మెత్తగా సుదృఢంగా బంధించగలుగుతున్నాయికదా! దగ్గరకు వెళ్ళక మరి నిగ్రహించుకోవడమన్నది కల్ల.

సరే మరెందుకిన్ని మాటలు, ఇది వట్టి దాంభికత్వంకానీ, నటనకానీ, ఆత్మవంచనేకానీ మిత్రద్రోహంకంటె వెయ్యిరెట్లు నయం. కేవలం దొంగలాగ కనబడకుండా ఓడిపోవడమూ ఓడిపోయినట్టే అవుతుంది — రేపు ఉదయం వచ్చి నాలుగు సంగతులూ నిర్మొగమాటంగా చర్చించి, మరి ఎన్నడూ వారి జీవనక్షేత్రంలో చేరాదు, ఏదంపతుల జీవితప్రాంగణంలోనూ అడుగు పెట్టకూడదని నిశ్చయించుకొన్నానని

చెప్పి శెలవు తీసుకొనిపోవాలి. అదీ అసలు సక్రమమయిన కర్తవ్యం. దానిని లోకంతోపాటు తన మనస్సుకూడా నైతికమయిన నిగ్రహశక్తిఅననీ, అపౌరుషమయిన దౌర్బల్యమూ ఆత్మవంచనా అననీ— దానివలన కలిగే బాధ ఏదో తన ఒక్కడి నేతప్ప ఇతరులను హింసించదు.

తిరుగుముఖంపట్టి ఇందాకటికంటె చరచరా నడక సాగించేడు. మళ్ళీ ఆ అరుగు కనిపించేసరికల్లా నడక తనంతట ఆగిపోయింది. ఇదేకాబోలు అలవాటులోని ప్రభావం అనుకొంటూ కూర్చున్నాడు.

ఎక్కువసేపు కూర్చోలేడు. లేచేడు. లేచి నడక సాగించేడు. అటూఇటూ, ఇటూఅటూ, ఎటూ కాకుండా మధ్యను నిలబడుతూ ఏదయినా అరుగు మీద కూర్చుంటూ నడుస్తూ...

మధ్యమధ్యలో తనకు పిచ్చెత్తిందా, తాను ఏమిటి చెయ్యబోతున్నాడు ఎటువెళ్ళబోతున్నాడు. అని అనుమానాలు వచ్చేవి. పది పదిహేను గజాలు మాత్రమే నడిచికూడా వెనక్కి తిరిగి పోతూఉండేవాడు.

చిట్టచివరకు పన్నెండుగంటల ప్రాంతంలో ఎవరోవెంట తరుముతూఉంటే ప్రాణభయంతో పరుగెత్తినట్టుగా రొజుకొంటూ రొప్పుకొంటూ ఇంట్లో ప్రవేశించాడు. గాభరాతో కూర్మయ్యనోట కొంతసేపు మాటరాలేదు. అతను సర్దుకొని మాట్లాడబోతూ ఉండగా—. "నువ్వు మరేమీ వాగకుండా నేను చెప్పేవది విను. నాకు మరేమీ ఒంట్లో చిరాగ్గాలేదు. నువ్వేమీ గాభరాపడి ఎవర్నీ పిలవనక్కరలేదు. నేను హాయిగా నిద్రపోగలను, నిద్రమాత్రలు, మరొక పదో పదిహేనో ఉంటే, నిర్విచారంగా హాయిగా శాశ్వతంగా నిద్రపట్టేనుమకదా! అప్పుడు భయంకొద్దీ రెండేతెచ్చేను. సరే, నువ్వు చెయ్యవలసిందేమిటో నీకు తెలిసిందా? ఇదిగో ఈగది అవతల గొళ్ళెంపెట్టి తాళంవేసి, తక్కిన తలుపులన్నీ వేసుకొని, వీధితాళం వేసుకొని గుమ్మంలో పడుకో. నేను ఎంతపిలిచినా సరే, ఉదయం ఎనిమిది గంటలలోగా తియ్యకు. ఉహూఁ వద్దు. ఉంటే పిలిస్తే తియ్యకుండా ఉండలేవు - తాళం వేసుకొని మీవాళ్ళింటికి పో...

ఏమిటో బాబూ అంతా ఇచ్చిత్రంగా ఉంది. డాకటరుగారిని పిలుద్దునా? పోనీ నిర్మలమ్మగారికి ఫోనుచేస్తే...

ఒరేయి కూర్మయ్యా! మరి నువ్వు నా చిన్నతనంనుంచి ఉన్న నౌకరువని దయచూడను. నీకు బ్రతకాలని ఆశఉంటే, నీస్వంతపైత్యం ఏమీ చెలిగించకుండా చెప్పినట్టు తాళాలు వేసుకొనిపో... ఊఁ వెళ్ళు, చాలు, మరేమీ సర్దుబాటు అక్కరలేదు. నీళ్ళున్నాయిసరే—వెళ్ళు—తాళం వెయ్యి ముందు. తక్కినతాళాలన్నీ వేసుకొనిపో—జాగ్రత్త, ఎవరినయినా పిలిచేవంటే చూసుకో—మళ్ళీ ఉదయం ఎనిమిదిగంటలకే.

అమ్మయ్య, ఇక నిర్విచారంగా, నిర్బంధంగా నిద్రపోవచ్చును. ఇంతసులభంగా తేలిపోయేదానికి అనవసరంగా ఎంత బాధపడ్డాను.

ఉదయం మెలకువవచ్చి చూసుకొనేసరికి చేతివాచీలో ఏడున్నరయింది. కాని తనకుమాత్రం ఒక గంటకంటె ఎక్కువసేపు నిద్రపోయినట్టు లేదు. పరధ్యానంగా లేచివెళ్ళి తలుపు తెరవబోతే అవతల గొళ్ళెం పెట్టి ఉంది. ఏమిటి? ఎవరిలా గొళ్ళెం పెట్టేరని అనుకుంటూఉండగా స్ఫురించింది. రాత్రి తానే కూర్మయ్యకు అలా చెప్పిన సంగతి—ఒక్కమారుగా రాత్రి తన డోలాయమానస్థితి అంతా మనసులో మెరిసింది. సరే, ఎనిమిదంటే ఎనిమిదివరకూ రాడు కాబోలు ననుకొంటూ వెళ్లి మంచంమీద పడుకొన్నాడు.

మళ్ళీ చిన్న కునుకు పడుతూఉండగా మెత్తని తీయని కరస్పర్శతో మెలకువ వచ్చింది. కళ్ళు విప్పకుండానే తెలిసిపోయింది నిర్మలాదేవేనని.

ఏం, ఒంట్లో ఎలాఉంది?

బాగానే ఉంది; కాని మీ కెలాతెలిసింది, మా కూర్మయ్యేనా? వాడి కెలాగూ ఇవాళ బర్తరఫ్ తప్పదు. అయితే అదీ ఒకవిధంగా పనికి వచ్చింది. నేనింకా ఇప్పుడే మీదగ్గరకు వచ్చి, వెనకటిలాగ నా దేశసంచార కార్యక్రమం సాగించాలని నిశ్చయించుకొన్నానని చెప్పి, శెలవు పుచ్చుకోవా లనుకొన్నాను.

నాకేమీ బోధపడడంలేదు. నిజంగానే మీకు ఒంట్లోనో మనస్సులోనో లేక రెంటిలోనూ బాగులేదేమో? ఒళ్ళుకూడా మామూలుకంటె వేడిగా ఉన్నట్టుంది. డాక్టరుకి ఫోనుచేస్తాను.

నాకేం చిరాకులేదని రుజువు చేసుకొందికి ఏంచెయ్యమంటే అది చేస్తాను—అదుగో వచ్చాడు. ఏం కూర్మయ్యా. తెల్లవారకుండా ఆవిణ్ణి నిద్రలేపి తీసుకొని వచ్చేవుకదూ ఉండుండు...

తమచిత్తం, నన్ను చంపేసినా సరే, రాత్రి నాకేమిటో తమర్ని చూస్తే భయం వేసింది బాబూ!

అదేమిటది నీచేతిలోది?

అదేనాబయ్యా, తమకి చూపించాలనే తెచ్చేను. రాయికి ఈ సుద్దకట్టి కిటికీదగ్గర పడిఉంది.

ఏదేదీ, ఈఉరుమాలు రాధాకృష్ణది, ఇక్కడి కెలా వచ్చింది.

ఏదీ ఇలా ఇయ్యండి. ఇది రాధాకృష్ణదే నని మీకేం తెలుసును.?

అబట్టి నేను కొన్నది, అందిమీద సీతాకోక చిలక నేను కుట్టేనది, నాకు తెలియక పోవడమేమిటి? అదుగో అందులో కనబడీ కనబడకుండా రాధాకృష్ణ పేరు కూడా ఉంటుంది. ఇదుగో ఆర్. కె. సరేనా?

సరే, అయితే కిటికీదగ్గ రెందుకు పడిఉండాలీ? పట్టి రాయేనా?

లేదు, ఏదో ఉత్తరం ఉంది. ఇదుగో.

నేను చదవలేను మీరే చదవండి నిర్మలాదేవి! కూర్మయ్యా నువ్వు వెళ్ళి కొత్త కాఫీ అయినా తయారుచెయ్యి. ఊఁ చదవండి.

ఇదేమిటో చిత్రంగా ఉంది ఈ ఉత్తరం ధోరణి—

జయించిన సంశయాత్మునకు నీలకంఠానికి !

నేను ఎక్కువగా రాయనక్కరలేదు. నాకు ఆమెమీద ఉంటే మోహంకొద్దీ నేను నిర్మలాదేవిని తప్పనిసరి పరిస్థితులలో ఇరికించి, నాడబ్బు మూలంగా ప్రలోభపెట్టి పెళ్ళి చేసుకొన్నానన్న సంగతి తెలిసి కూడా గుర్తించకపోడానికే ప్రయత్నించేవాణ్ణి. ఆమె కూడా అలాగే ప్రయత్నించేది.

అంతేకాదు—నాకూ ఆమెకూ ప్రధానమయిన లక్ష్యాలలో ఐక్యము లేదు. అయినా ఆమె అన్నిటి లోనూ నన్ను తృప్తిపరచడంకోసం నా యిష్టాలే తన యిష్టాలన్నట్లుగా ప్రవర్తించేది.

మరి ఈ సొదంతా ఎందుకు? నేను నిన్ను నిజంగానే జీవితంలోని ఆనందం అనుభవించేలా చేద్దామని ప్రయత్నించాను. అయితే చిట్టచివరికి నా ప్రయత్నానికి సత్ఫలితమే కలిగింది; కాని నేనను కొన్న దానికి విపరీతంగా.

నాలో అసూయ అనేది అంత సులభంగా అంకురించలేదు; కాని, అంకురించినదగ్గరనుండి, ఇంతింతై బ్రహ్మాండమంతయింది. చివరికి నా ఊటీ ప్రయాణం కేవలం పరీక్షార్థమే.

రాత్రంతా నువ్వు వనుస్తున్నప్పుడు ఎవరో నిన్ను అనుసరిస్తున్నట్టు అనుమానిస్తూ ఉండేవాడివికదూ! అది భ్రమ కాదు నిజమే—నేను మీ యిద్దర్నీ పరీక్షించి, కౌగిలింతలో ఉండగా ఒక నాటకీయమయిన ఉపన్యాసం కొట్టి మీ యిద్దర్నీ కాల్చి నన్ను కాల్చేసుకోవాలని రివాల్వరు సిద్ధంచేసుకొని ఉన్నాను.

కాని, అప్పుడే విభాతపు వెలుగురేకలు వస్తున్నాయి; నామనసులోని చీకటికూడా అంతరిస్తూంది.

నేను తిరిగి వచ్చి నా హక్కు స్థిరపరచుకొన్నా మరి నన్ను నిర్మల ఇదివరకులాగయినా ప్రేమించలేదు—నువ్వు ఉన్నా లేకపోయినా ఆమె ప్రేమ నాది కాదు.

నాది కాని ప్రేమకోసం నేనెందుకు తాపత్రయపడాలీ? ఇన్నాళ్ళుగా నువ్వుగడిపిన రకం జీవితమే ప్రస్తుతం వాంఛనీయమనిపిస్తుంది. ఈ నా నిశ్చయంగురించి, మీ యిద్దరికీ చెప్పి మరీ వెళ్ళాలనుకొన్నాను. కాని, ఏమో తరవాత తరవాత మళ్ళీ మనసు ఎటు ఊగిపోతుందో అని ఇలా రాసి వెళ్ళిపోతున్నాను.

బాంకులో నా పేర ఎక్కువగానే డబ్బుంది. దానిమీద వచ్చే వడ్డీ నెలనెలా జీతంలాగ నాకు మనియార్డరు చేసేలాగ ఏర్పాటుచేస్తున్నాను. అది నాకు చాలును. తక్కిన ఆస్తి అంతా నిర్మల పేరుకే రాసి రిజిష్టరీ చేసి పంపిస్తాను.

నేను నిష్క్రమిస్తున్నాను మీ యిద్దరియెడల ఎటువంటి అసద్భావమూ లేకుండానే—

మనం మళ్ళీ కలుసుకొంటామనుకోను. కలుసుకొన్నా, శారీరకమయిన ఉద్రేకాలకు అతీతమయిన శాంతిమయమయిన వయస్సులో కలుసుకోవాలని కోరుకొందాము. వాటికి మీసంసారం తామర తంపరగా వృద్ధిచెందడానికి సావకాశం లేకపోలేదు.

స్నేహాన్ని మలినం చేసుకోకుండా నిష్క్రమిస్తున్న నీవాడు, రాధాకృష్ణ.

భాగ్యంలో బృహస్పతి

★

శ్రీ రాళ్ళపల్లి గోపాలకృష్ణమాచార్యులు

"నాది కుంభరాశి. అష్టమశని ఎప్పుడు పోవునో చెప్పగలరా?"

కొన్ని నాళ్ళ వెనుక గ్రామాంతరమున నా మిత్రుని ఇంటికి నేను వెళ్లియుండినప్పుడు, ఒక మధ్యాహ్నమున గదిలో ఒంటరిగా సోఫాలో కూర్చుండి, ఏదో చదువుకొనుచుండిన నా సమీపమునకు ఆ యింటి పాకశాసనుడు వచ్చి సవినయముగా చేసిన ప్రశ్న యిది.

అతని శ్రద్ధకు సంతోషించితిని.

"జాతకమున్నదా?" అంటిని.

"జాతకమెందుకు? ధనిష్ఠ మూడవ పాదము నాది."

"వచ్చే శ్రావణములో శని ముందుకు పోగలడు. కాని, గోచారముకంటె, జాతకదశలు మేలు కదా?"

"నాకు భాగ్యస్థానములో గురువు. గురు మహాదశ నడుస్తున్నది. కాని, అష్టమ శని పట్టింది. ఏమీ బాగాలేదు. ఎన్నడు పోతున్నదో? కన్యాలగ్నము నాది."

దశాఫలము బాగున్నచో, గోచారశని అంత బాధాకరముగా ఉండనక్కరలేదని చెప్పితిని. నా వాదము అతనికి నచ్చినట్టుతోచలేదు. జాతక సామగ్రి అతనికి జ్ఞప్తిలోనే యున్నది. కాని, ఎందుకో మరి, దానిలో అతనికి రుచిలేదు. ఎట్లో ప్రయాసపడి ఆ సామగ్రి అతనినుండి సంపాదించితిని. ఇదే అతని నిరయన జాతక కుండలి:—

జన్మకాల కుజదశాశేషము రెండున్నర సంవత్సరములట!

"గొప్ప జ్యోతిష్కుడొకడు ఏమేమో గొప్ప యోగములున్నవని చెప్పినాడండీ! ఏ యోగమూ ఫలించలేదు." అని నిరుత్సాహముగా జాతకుడు చెప్పినాడు.

"ఏమేమి యోగములు చెప్పినాడు?" కుతూహలముతో అతనిని మాచుచు ప్రశ్నించితిని.

"అయ్యో! పోనిత్తురూ?"

"ఏమైనా, రహస్యమా?"

"రహస్యమా, బండలా? కుండలిని చూస్తున్నారు కదా? సప్తమాధిపతి గురువు భాగ్యములో. కళత్రకారకుడు స్వక్షేత్రములో ధనస్థానములోనే. గజకేసరీ యోగమున్నది. లాభస్థానములో కుజునికి నీచభంగ రాజయోగము. గురు మహాదశలో చంద్రభుక్తి జరిగే కాలమది. ఆ భుక్తిలోనే ఉన్నట్టుండి వివాహము జరిగి తీరుననీ, పెండ్లికాగానే 'డబుల్' రాజయోగము పట్టుననీ, ఆజ్యోతిష్కుడు ఖచ్చితముగా చెప్పినాడు. అంతా శుభగ్రహసంబంధము కనుక, అప్రయత్నముగా మహాపతివ్రత అయిన భార్య వచ్చునట! రాగానే, అఖండ రాజయోగము పట్టునట! అంతా, బూటకము!"

		గు	కే
చ	(నిరయన)		శ కు
	రాశి కుండలి		బు
రా		శు	ల ర

ఈ ఉపన్యాసము విన నాకుతూహలము ఇనుమడించినది.

"ఏమి జరిగినది?" అంటిని.

"మొదట నేను నమ్మలేదండీ! గర్భదరిద్రుణ్ణి నాకేమి, రాజయోగమేమి? అంటిని. 'కంకణము కట్టి చూడవయ్యా! యోగము పట్టకపోతే, నన్నడుగు. నేనున్నాను.' అని చెప్పినాడు."

నాకు పట్టరాని నవ్వువచ్చినది.

"మరి, ఏమైనా యోగము పట్టించుకొన్నావా?"

"ఆ! పట్టింది దౌర్భాగ్య యోగము!"

పాపము! నేను నవ్వను ఆపుకొని జాతకుని చూచుచు—

"ఆ జ్యోతిష్కుడు తన్ను అడుగమన్నాడు కదా? అడిగితివా మరి?" అంటిని.

"పోనీయండి." అని క్షణమాగి మరల—

"జాతకము వేసుకున్నారుకదా మీరు చూసి చెప్పండి." అనుచు, గడియారముపైపు చూచి, "మూడు కావచ్చినది. మీరు చూడండి. ఇంతలో, నేను కాఫీ తయారు చేస్తాను." అని చెప్పి అతడు గదినుండి వెళ్లినాడు.

మూర్తి పాకవిద్యాప్రవీణుడు. యూనివర్సిటీ వారు పోటీ పరీక్షలు పెట్టినచో, ప్రథమ కక్ష్య అతని సొత్తే. ఆ విద్యలో అతడు గొప్ప పరిశోధకుడు. ఒకటే అనుపానము దినమునకు ఒక్కరుచిగా వండగల శక్తి అతనిది. పూర్వకాలమునందు మన దేశములో ఈ కళలో పేరు మోసినవారిద్దరు నల భీములు. ఈ ఇద్దరి అంశములు ఇతనిలో చేరిన వనవచ్చును. ఆకారములో, మన మూర్తి సాక్షాత్తుగా నలుడే,—బాహుకావతారము. ఇతని వంటలో భీముని ప్రభావము చూపట్టుచుండును. అతని పాకములలో షడ్రసములలో ఒక్కొక్క రసము ఒక్కొక్కనాడు భయావహముగా శివతాండవము సలుపుచుండగలదు!

ఇతడు ఒక విచిత్రవ్యక్తి. ఒకొకప్పుడు ఏ మేడ మెట్లమీదనో, ఏ డాబామూలలలోనో, ఒంటరిగా ఏ గోడకో ఆనుకుని వంకరగా నిలుచుకుని, సాయంసమయములలో వినిర్మల నీలాకాశముపైపు తదేక దృష్టితో ఓరచూపులు చూచుచుండు అతని వైఖరిని గమనించినవారికి ఇతడొక రకపు రోగియో, జడభరతుడో, అని తోచును. ఏ పుట్టలో ఏ పామున్నదో, పరమాత్మునికెరుక! వృత్తిలో సంపాదించిన ద్రవ్యమునైనా, కూడబెట్టుకొను శ్రద్ధ ఇతనికి కానరాదు. సదా రిక్తహస్తమే! వృథా వ్యయము చేయక ద్రవ్యమును నిలువచేసుకోరాదా, అని ఎవ్వరైనా అడిగినచో, "కిమర్థం దుఃఖభాజనం?" అని ప్రతి ఇచ్చుట ఇతని వాడుక. తల్లిదండ్రులు గతించినారు. ఇతర బంధువులో, బంధములో ఉన్నట్లు అగుపడదు. ఏ గృహస్థుని ఇంటిలోనైనా, పట్టుమని పదినెలల కాలము వంటకు నిలుచుట ఇతనికి అలవాటు లేదు. బుద్ధి పుట్టినన్ని దినములు మౌనముతో, శ్రద్ధతో, తన పని తాను నిర్వహించుచుండి, ఎన్నడో తనంతట నే చాలించుకుని వెడలిపోవుట ఇతని పద్ధతి. ఎన్నియో నగరములు తిరిగినాడు; ఎన్ని ఇండ్లలోనో, తన కైవాటము చూపినాడు. నమ్మకముగా ఒక ఇంట నిలువరాదా, అన్నచో, "బుద్ధిః కర్మానుసారిణీ." అని అతని ప్రతి. ఇతని తత్త్వము బోధపడుటే కష్టము. ఇతరులలో సాధారణముగా చేరడు; హెచ్చుగా మాటలాడడు; ఆటపాటలు అక్కరలేదు; వినోదములు కాబట్టవు.

దినచర్య ముగించి వివిక్త స్థలమున ఏ చిరిచాప పైననో, పరుండి హాయిగా నిద్రించుచున్నప్పుడు ఇతనిని చూచిన వారికి అజ్ఞాతవాసమందున్న భీముడే స్ఫురణకు వచ్చును. ఇతని గాఢనిద్రకు భంగము కలిగించుటకు సైరంధ్రి మాత్రమే కొరత! ఇది కలికాలము కదా? ఆమె ఏ కీచకుని ఇంటిలో ఊడిగము చేయుచున్నదో?

పాఠక మహాశయులకొక విన్నపము. ఈ పాకశాసనుని వ్యవహారనామమేదో, విచారించి తెలుసుకొను విషయమున కొంత ఏమరుపాటు వచ్చినది. జాతకపు గొడవలోపడి ఇది గమనించలేదు. పోనిండు విషయము ముఖ్యము కాని, ఏ పేరైన మనకేమి? కథ నడచుటకై ఇతనిని 'మూర్తి' అని వ్యవహరింతము గాక!

ఇతని జాతకమందలి విశేషమేమో గమనించు కుతూహలముతో సాయనకుండలిని సిద్ధపరచితిని. ఇక

ఆ చక్రము.

దాం.స.3-39			గు 11-31
చ 24-52 వ 20-13	సాయన లగ్న కుండలి — అయనాంశ=22°-41'		కే 5 53 X 10-55
భా.స. 7-35 రా 5-53			ఇ 6-37 కు 9-35 శ 11-31
	శు 13-39	ర 4-19 I-1139	బు 19-31

సూచన :— { దాం. స = దాంపత్య సహమము.
{ భా. స = భార్యా సహమము.

వాస్తవమే! భాగ్యస్థానములో బృహస్పతి కూర్చున్నాడు; భోజరాజువలె! ఆ మహనీయుని శుభ దృష్టి లగ్నముపై మాటికి నూరు వంతులు ఎంతో రమ్యముగా నున్నది. లగ్నాధిపతి శుక్రుడు ధన స్థానములో నున్నాడు. ధనాధిపతి కుజుడు సాక్షాత్తుగా లాభస్థానములో వెలుగుచుండుట! చతుర్థ పంచమాధిపతియగుటచే యోగకారకుడైన శని ఈ కుజునితో చేరి లాభమంటే కలదు. లాభాధిపతి అగు రవి లగ్నమందే గురుదృష్టి భాగ్యమనుభవించుచున్నాడు. యోగమంతయు లగ్న, ధన, లాభభావముల చుట్టు కోటగట్టుకొని కూర్చున్న రీతి దోపట్టుచున్నది. ఇక, సప్తమాధిపతి కుజుడే! యోగకారకుని సహవాసము, లాభభావస్థితి! వివాహమువలన భాగ్యాభివృద్ధి అగునని జ్యోతిష్కులు చెప్పుట సులభమే. కాని, మూర్తిగారికి పట్టినదేమో 'గరిటె' యోగము!!

లగ్నములో నీచరవి. ఈ రవికి రాహు కేతువుల కేంద్ర ఘర్షణము. ఏ రాజయోగము అంటగలదు? చాలదని, ఇంద్రుని అర్ధకోణ మైత్రి, వరుణుని పార్శ్వ కేంద్ర వేధ ఈ రవికి దాపరించియున్నవి, 'మురారి మార్గము'లో. ఊహాగానము చేయుచు ఆనందించు స్వభావము దీని ఫలము. లగ్నాధిపతి శుక్రుడు ఇంద్ర, కుజ, శనులతో క్రూర కేంద్ర వేధపాలై చెడి, వరుణుని కేంద్ర వేధకోరకై పోవుచుండుట విషాద హేతువు. బుధునినుండి తప్ప, ఏ ఇతర గ్రహముల నుండి అయినా, ఈ శుక్రునికి మిత్రదృష్టి సాహాయ్యము లేదు. భాగ్య వ్యయాధిపతియగు బుధుడు వ్యయస్థానములో నుండుటచే, అతడి మిత్రదృష్టి ప్రాపంచికముగా శుక్రునికి ఏమి హితము చేయజాలును? తత్త్వజ్ఞానమునకో, సన్న్యాసమునకో, విరక్తికో, ఉపయోగపడవచ్చునేమో? భాగ్యస్థానమందలి బృహస్పతినుండి ఈ లగ్నాధిపతి శుక్రునికి ఏమీ లాభము చూపట్టదు. రాజ్యభావములో చూతమా, మోక్షకారకుడగు కేతువు! పరలోకపు మాట ఎట్లో కాని, ఐహికముగా ఈ కేతువు బంధమోక్షమునకే దారి తీయజాలును. రాజ్యాధిపతియగు చంద్రుడు లాభాధిపతిని ద్వేషించుచున్న వరుణుని యందు చేరుకొని ప్రయోజకత్వమును కోలుపోయినాడు. వృత్తిలో, నిలుకడ లేదు. ద్రవ్యమా, అంటిరాదు! కాయక్లేశము లాభమని కుజ శనుల ఆశీర్వాదము!

సరే కాని, లగ్నముపైనున్న భాగ్యగురువు శుభ దృష్టి ఏమైనది? లగ్న దశమములు, వీని అధిపతులు, నిష్ప్రయోజకులగుటచేత, తృతీయ షష్ఠాధిపతి యగు గురువుయొక్క దృష్టి ప్రాపంచికముగా జాతకమునకు ఉపకరించలేకపోయినది. లగ్నాధిపతికి ధనము అంటదు. రాజ్యాధిపతికి స్థిరచిత్తము లేదు. లగ్నములోని నీచ రవికి యోగములు కూడి రావు. ఇక, గురువు ఈయగల భాగ్యమేమి? దశమకేతువు విరక్తిని తెచ్చిపెట్టగా, భాగ్య గురువు ప్రాపంచికముగా ఏమియు హితము చేయలేక, సాధుస్వభావము నిచ్చి, పారలౌకికముగా ఉపకరించదలచియున్నాడు కాబోలు?

ఇది ఇట్లుండగా, అతీంద్రియజ్ఞానమునో, అతి మానుష్యమునో, సూచించు భాగములో లగ్నమున్నదనుట ముఖ్యముగా గమనించదగిన విశేషము. ఈ రెండు స్వభావములు ఈ వ్యక్తిలో గోచరించుచున్నవేమో అనిపించుచున్నది. మనకు తెలిసినట్లుగా, రెండవగుణమేమో కానవచ్చుచున్నది. శూన్యదృష్టులతో ఆకాశమువంక చూచుచు కాలక్షేపము చేయుచుండు కాలములో ఇతనికి అతీంద్రియ జ్ఞానము పని చేయుచుండునేమో? పాపభీతి, సౌమ్యస్వభావము, దైవభక్తి, ఇవి బృహస్పతి అనుగ్రహించిన గుణములు. భగవద్గీతిలోని శ్లోకములు కొన్ని అప్పుడప్పుడు అతని మాటలలో వినవచ్చుచుండుట గమనించితిమని, అతడు గొప్ప విరక్తిగలవాడని తోచును.

ఇది బాగుగ నేయున్నది. కాని, లగ్నాధిపతి శుక్రునిపైన హేమాహేమీ లనదగిన ఇంద్ర, కుజ, శనుల ప్రబలవేధ యున్నదికదా? ప్రాపంచికముగా ఇదియేమి చేసినది? ఇతని విరక్తికి కారణము ఈ శుక్రుడే మనకు తెలుపవలసి యున్నది. శని కేంద్రమువలన సుఖరాహిత్యము, క్లేశప్రాప్తి, నిస్పృహాయత, ప్రాపంచికముగా అభివృద్ధికి ప్రతిబంధకము ఇవి వచ్చి యుండును. లగ్న సప్తమాధిపతులగు శుక్ర కుజుల పరస్పరకేంద్ర దృష్టివలన, "శత్రుదృష్ట్యాథ దంపత్యోర్నిత్యం ఝుకటికోథ చేత్" అను ప్రమాణానుసారముగా, భార్యతో ద్వేషమో, కలహమో, అనుభవమునకు రావలసియున్నది. సత్యమును అసత్యముగనో, అసత్యమును సత్యముగనో, భావించి భ్రమపొందుట, గగనవీధులలో గాలిమేడలు లూగుట, వివేకము కోలుపోయి నమ్మినవారిచే మోసగించబడుట, అనవసరము లయిన అపవాదములు వచ్చుట, కలిగిన చిక్కులకు ప్రతిక్రియలేని అశక్తస్థితి ఏర్పడుట, ఇత్యాదులు ఇంద్ర శుక్రుల కేంద్ర వేధాఫలములు. ఇన్ని యోగములు ఒక్కచోటనే మిళితమై యున్నవనుట మనము మరువరాదు. ఈ గ్రహముల దృష్టి గుప్తవైర ధర్మము గలది. అందులో దక్షిణదృష్టి యగుటచే, శుక్రుడికే గొప్ప దెబ్బ. దురాశామోహపాశములకో, దుర్నీతిపరుల ద్రోహమునకో, లోబడి జాతకుడు ఇడుములు పడవచ్చును. కాని, భాగ్యమందలి గురువు లగ్నమును చూచుటచే, సాధారణముగా, దుర్నీతి కాని, ద్రోహము కాని, జాతకుని ప్రవర్తనములో చూపట్టుట అసంభవము. ఈ వేధలో సప్తమాధిపతి చేరియుండుటచే, ఏదో విధముగా భార్యకైవాటము కావరావలసి యున్నది. ఏదోవిధముగా వైవాహిక జీవితములో మోసముపొందయి, కష్టము లనుభవించి, విరక్తి వచ్చియుండవచ్చును. కాని, కుజశుక్రుల కేంద్ర సంబంధముకల వ్యక్తికి సామాన్యముగా స్త్రీ విషయకముగా విరక్తి యుండుట అరుదు. ఉన్నచో, అది అభావ విరక్తియే! కళత్ర స్థానాధిపతియగుట కుజునికి ఒక వైపున మాయలమారి ఇంద్రుడు, మరియొక వైపున సౌఖ్యనిరోధకుడగు శని చేరియున్నారు. భార్యవలన కాని, భార్యను కూర్చి కాని, మోసగించబడి యున్నచో ఈ యోగము ఫలించినట్లే. భార్యా సహమము రాహువుతో కలిసియున్నది. భార్యకు గ్రహణమో, గ్రహమో పట్టియుండనోపు.

పుత్రకారకుడగు బృహస్పతిదృష్టి పంచమ భావముపైన ప్రబలముగా నున్నది. జాతకునికి సంతాన భాగ్యము కూడిరావలదా? శని కుజుల క్రూర దృష్టివలన పుత్రస్థానము చెడిన కారణమునుబట్టి సంతాన నష్టమో, దుష్టసంతానమో, చెప్పవచ్చును. విశ్వాస ఘాతకులచే వంచింపబడి, భార్యాపుత్రులను కోలుపోయి, అపహాస్యమో, విరక్తియో, వచ్చియుండినా, తప్పుకాదు. కాని, వివాహమైనట్లు జాతకుడు చెప్పడు. ఏమి చిదంబర రహస్యమో?

జాతక వాగ్దానములకు దశాసౌకర్యములు ఎదిగి రాలేదేమో చూతమని దేవమాన దశల గుణించితిని. మూడు సంవత్సరముల క్రింద ఈ క్రింది దశావిశేషములు చూపట్టినవి :—

(1) చలిత లగ్న జన్మ శుక్ర సంయోగము

(2) చలిత రవికి ఇంద్ర కేంద్రము

(3) చలిత శుక్రునికి ఇంద్రుని పార్శ్వకేంద్రము

(4) చలిత భార్యాసహమమునకు జన్మ శని సమసప్తకము

(5) చలిత దాంపత్య సహమమునకు జన్మవరుణుని అర్ధకోణము.

ఇవన్నియూ ఏకకాలమందే సమకూడినవి. తలవని తలంపుగా వివాహము జరుగుట, దాంపత్య జీవిత ప్రాప్తి, (అథవా, సంతానప్రాప్తి) స్పష్టముగా సూచింపబడుచున్నవనుట నిస్సందేహము. మోసగించబడి కాని, వివేకమును కోలుపోయి కాని, అంగవైకల్యమో, శీలవైకల్యమో, కల స్త్రీని సంపాదించుకొని, తత్ఫలముగా జాతకుడు కాయక్లేశమును, మనఃక్లేశమును సహా అనుభవించి యుండవచ్చును. ఆ మరు సంవత్సరమే, చలిత బుధునికి ఇంద్ర కేంద్రవేధ వచ్చినది. ఈ బుధునికి వ్యయస్థాన సంబంధము ప్రబలము గదా? కలిగిన అనుభవములవలన మతి చెడియో, ఆరోగ్యమును కోలుపోయియో, కొంతకాలము వైద్యశాల శరణ మాశ్రయించియుండు నన్నచో, సత్యదూరము కానేరదు. లేదా, ఇతరుల ద్రోహము కారణముగా, చెరసాల అనుభవమైనా వచ్చియుండవచ్చును. విధిలేక కాని, విరక్తివలన కాని, జాతకుడు సంసార పరిత్యాగము చేసియుండనోపు. మొత్తముపైన, చాలా వింత జాతక మిది.

నే నిట్లు ఆలోచించుచుంటిని. అంతలో కాఫీ కషాయపు పాత్రను పట్టుకొని మూర్తి నా గదిలో ప్రవేశించి, ఆ పాత్రను ముక్కాలి పీటపై నాముందుంచి, సమీపములో నిలుచుకొని,

"ఏమి తేల్చినారు?" అడిగెను.

"మూడు సంవత్సరముల క్రింద నీవు వివాహము చేసుకొన్నావా?" అతని ముఖమును చూచుచు ప్రశ్నించితిని.

"సప్తమాధిపతి గురువు కదాండీ! అతని దశలో నాకు వివాహము కావలెను. కాని, అష్టమ శని వేధ వచ్చినది. అది ఎప్పుడు పోగలదని, అందుకే మిమ్ముల నడిగినది" అన్నాడు మూర్తి.

ఈ చలిత దశలు ఏమైనట్లు? నా కాశ్చర్య మైనది.

"మూడేండ్లనాడు నీ జీవితములో ఏమైనా విశేషములు ఉండెనా?"

"ఏ విషయములో?"

"స్త్రీ వ్యామోహము వచ్చియుండును అకస్మికముగా, వివాహము కావచ్చును. కాని, ఏదో, ద్రోహమో, మోసమో, జరిగి కొంత శ్రమపడియుండ వచ్చును. ఆరోగ్యము చెడి కొంతకాలము వైద్యశాల చేరియుండవచ్చును. సం......"

అంతలోనే మూర్తి ప్రతి ఇచ్చుటచే, ఆగితిని.

"ఆరోగ్యము చెడిన మాట వాస్తవము. కొన్నాళ్లు వైద్యశాలలో నుంటిని. కొంతకాలము రెండేండ్ల క్రింద పిచ్చివారి వైద్యశాలలో సహా ఉండ వలసివచ్చినది. తత్పూర్వపు పరిస్థితులు నాకేమీ జ్ఞాపకము లేవు. వర్ణసంకరమునకు అవకాశ మిచ్చిన గాంధి నాకు శత్రువు. అతడు మరల పుట్టినాడు. కనుక, నాకు మతిపోయినది. ఇంతే నాకు జ్ఞాపకము."

ఈ జవాబునకు నాకు చాలా ఆశ్చర్యమైనది. మరల పిచ్చి వైద్యశాల మూర్తిగారిని ఆహ్వానించుచున్నదేమో, అనుకొంటిని. కషాయము రుచి చూచుచు, క్షణకాలము అతనిని అట్లే తిలకించితిని. తరువాత, ఇట్లంటిని.

"నీ మాటలు నాకు అర్థము కాలేదు. నీకు శత్రువు పుట్టినాడంటివే? ఎచ్చట?"

"ఏదో పుణ్యక్షేత్రములో." అని మరల—

"పోనియ్యండి. అష్టమ శని పోయిన తరువాత నాకు వివాహ మగునా, కాదా?"

"నీవు డబ్బు సేకరించ నేలేదే? కాసులు లేని వానికి కన్యక నెవరిత్తురు?" అని ప్రశ్నించితిని.

"ద్రవ్య మెందుకండీ! గురుమహాదశ. దైవబల మున్నది. ఈదశలో వివాహము కాకపోతే, జ్యోతి శ్శాస్త్ర మెందుకు?"

"సరే! గురువు భార్యను తెచ్చి ఇచ్చుననుకో! ఆమెను పోషించగలవా మరి?"

"ఎవరిని ఎవరు పోషించగలవారు? 'ఉద్ధరే దాత్మనాత్మానం' అన్నాడు గీతలో." నాకు నవ్వు వచ్చినది.

"ఇంత తత్త్వజ్ఞానము ముదిరితే, భార్యకు కష్టమే" అంటిని.

"ఎవరి కర్మ వారిది. 'అవశ్య మనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభం' కదా?"

"బాగానే ఉన్నది. కాని, భార్యను పోషించుట భర్త ధర్మము కాదా. మూర్తీ?"

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ అన్నాడు" కృష్ణపరమాత్మ.

మూర్తిగారికి తత్త్వజ్ఞానము ముదురుపాకములో పడిన దనుకొంటిని. ఏమీ చెప్పుటకు తోచలేదు. అంతలోనే మూర్తి—

"మీరు చెప్పినా, చెప్పకపోయినా, గురుమహాదశలోగా, నేను వివాహము చేసుకోక తప్పదు. ఎవరినైనాసరే, ఏకులమైనాసరే! ఫలము దైవాధీనము. 'కర్మణ్యేవాధికారస్తే, మాఫలేషు కదాచన' అంతటికీ అతడే! మనము నిమిత్తమాత్రమే!" అనుచు గది వెడలిపోయినాడు. భాగ్యస్థానమందలి బృహస్పతి అనుగ్రహించిన ఫలమింతేనా, అని ఆశ్చర్యపడితిని.

తరువాత రెండుమూడు దినములలో, అతనికి చిత్తము వచ్చినపుడు కొంత కొంతగా, అతని జీవిత కథను తెలుసుకోగల్గితిని. దాని సారాంశ మిది.

మూడు సంవత్సరముల క్రిందట జ్యోతిష్కుడొకడు అతనికి త్వరలో పెండ్లి కానున్నదనియు, తరువాత అఖండ రాజయోగము పట్టుననియు, ఫలాదేశము చేసియుండెనుగదా? తన కేమి, వివాహ మేమి, అంతా ఎగతాళి అనుకొని మూర్తి తనలో తాను నవ్వుకొన్నాడు. చేతిలో చిల్లిగవ్వ అయినా లేదు. పూనుకొని చేసే బంధువులయినా లేరు. ఇట్టి పరిస్థితులలో కన్యక నెవరిత్తురు?

కాని, కొన్ని దినములలోనే, ఒక అపూర్వ సంఘటనము జరిగినదట! ఒకనాడుదయాన ఏదో

దేవాలయములో మూర్తి ప్రదక్షిణ నమస్కారములు చేయుచుండినాడు. అప్పుడప్పుడు ఇట్లు చేయుట అతనికి వాడుక. ఆనాడు ఆ గ్రామమువాడే, కొంత వయస్సు చెల్లిన పూజారి యొక్కడు, తన కులము వాడే, వచ్చి తదేకదీక్షతో క్షణకాలము మూర్తిని చూచి, 'మా ఇంటికివచ్చి తాంబూలము తీసుకొని వెళ్లుదురు రండి.' అని వినయముగా ఆహ్వానించినాడు. ఏదో, దక్షిణకాసులు వచ్చునని ఆశ మూర్తికి. ఆ పూజారివెంట అతని ఇంటికి వెళ్ళినాడు. అచట ఆ పూజారి మూర్తికి పీటవేసి కూర్చుండబెట్టి గౌరవించినాడు. ఉపహారము పయితము కొంత లభించినది మూర్తికి. తరువాత ఆ గృహస్థుడు కనుసైగ చేయగా, తాంబూలము, టెంకాయలు, కలకండ, ద్రాక్ష, ఖర్జూరఫలములు, పూలు, సుగంధ ద్రవ్యములు, నిండిన పళ్లెరమును పట్టుకొని లోపలనుండి నవయావనవతియగు కన్యక యొకతె, కామధేనువువలె, విలాసముగా వచ్చి మందహాసముతో మూర్తిచేతికి పళ్లెరము నందిచ్చి, నమస్కరించి లజ్జావనతముఖియై నిలువగా, అతడు విభ్రాంతుడైనాడు. ఆ క్షణమందే ఆకాశమునుండి తళతళ మెరయుచు త్రికోణాకారమైన నక్షత్ర మొక్కటివచ్చి ఆ కన్యక దేహములో ప్రవేశించినట్లు మూర్తి కన్నులకు కానవచ్చుటచే, అతి డాశ్చర్యచకితుడైనాడు. వెంటనే, ఆ పూజారి లేచి చేతులు జోడించి నిలిచి,

"నిన్నరాత్రి స్వప్నములో నాకు భగవంతుడు సాక్షాత్కరించి 'ఉదయము దేవాలయములో వెదకుము. మీ అమ్మాయికి తగిన వరుడు దొరకగలడు.' అని ఆజ్ఞాపించినాడు. మా పాప అదృష్టము ఫలించినది. దైవాజ్ఞగా భావించి దేవాలయమునకు పోగా, భగవంతుడే మిమ్ములను చూపించినాడు. వివాహము చేసుకొని ఉద్ధారము చేయవలెను." అని ప్రార్థించెనట!

ఇది అంతయు మూర్తికి స్వప్నమువలె తోచినది. కాని, కళ్లెదుట నిలిచియున్న కన్యక భూమికి అవతరించిన అప్సరసవలె ముగ్ధమోహనమూర్తియై అతనికి కానవచ్చుచు, ఇది వాస్తవ ప్రపంచమే అని సూచించుచుండెను. దైవజ్ఞుడు చెప్పిన యోగము ఫలోన్ముఖమైనది కాబోలు! అతని హృదయములో, లోలోన తీయని ఆశలు మొలకలెత్తినవి. మూర్తి ఆనందపారవశ్యముతో మైమరచెను. క్షణకాలము ఆ కన్యకను రెప్పవాల్చక చూచుచు, నిర్విణ్ణుడై మాటలాడజాలక ఊరకుండి, కడకు,

"అంతా, దైవాజ్ఞ! మనము నిమిత్తమాత్రము" అని కన్నులుమూసికొన్నాడు. వెంటనే ఘుమ ఘుమలాడు పుష్పదామ మొకటి అతని కంఠసీమ నలంకరించినది! ప్రక్కనే సిద్ధముగ నున్న మరి యొక్క పీటమీద ఆ కన్యకను కూర్చుండబెట్టి, ఇంట నున్న సుమంగలులు మంగళ హారతు లెత్తినారు. దైవ యోగము!

కంకణబలము కలిసివచ్చినది. తరువాత కొన్నాళ్లకు ఏదో, తదేక లగ్నములో, మూర్తికి వివాహము జరిగినది, ఆ పూజారి ఇంటిలోనే! తలవని తలంపుగా గురుమహాదశ ఫలించినది. స్వస్తి వాచనములు జరిగెను. ఫల తాంబూలముల సమయములో మునుపటి కార్తాంతిక మహాశయుడు ప్రత్యక్షమై,

"ఏమయ్యా, జ్యోతిష్యము ఎంత త్వరలో ఫలించినదో, చూచినావా? వివాహమునకు క్షేమ తార! బృహస్పతి మహాదశ!! చంద్రుని భుక్తి!!! అదృష్ట మనగా, నీదే. 'శీఘ్రమేవ సుపుత్రా వాప్తిరస్తు'."

అని ఆశీర్వదించెను. దక్షిణలకై వచ్చి గుంపు కూడియుండిన అల్లరి వటువులు కొందరు హల్లకల్లోలముగా కరతాళధ్వనులు చేయుచుండగా, 'తథాస్తు', 'తథాస్తు' అను వాక్యము సభలో నాల్గు మూలలనుండి శరపరంపరగా వినవచ్చినది. ప్రక్కన కూర్చుండి ముసిముసి నగవులతో ముద్దులు మూట కట్టుచున్న పెండ్లికూతురును చూచుచు, మూర్తి లోలోన మురిసిపోయినాడు.

ఆ రాత్రికే నిషేక ముహూర్తము. రాజోపచారములు జరిగినవి. మూర్తి తన్ను తానే మరచినాడు. ఆనందబ్రహ్మ అతనికి సాక్షాత్కారమయినది. ఎంతలో, ఎంత మార్పు!

"శ్వశుర గృహనివాసః స్వర్గతుల్యో నరాణాం" అను సుభాషితము మూర్తికి అనుభవమునకు వచ్చినది. దినములు వారము లగుచుండెను. మామగారిది చాలా బీద కుటుంబము. వృత్తిలో వచ్చు కాసులతోనే సంసారయాత్ర జరుగుట దుర్లభము. అందులో, దేవునిపైననే భక్తి తగ్గుచున్న యీ దినములలో, పూజారి నెవరు విచారించువారు? చిన్నపిల్లలుగల పెద్ద కుటుంబము వారిది? కాని, మూర్తి భార్య పని పాటలలో మంచి చాకచక్యము గల సమర్థురాలు. వంట వార్పులు చాలా రుచిగా చేయగలదు. గృహకృత్యములలో మంచి దక్షత ఆమెది. నిరర్థకముగా నుండ నేలయని, పొరుగింటిలో కాపురమున్న ఒకా


తెల్లగా
ఉతుకబడినవి
ప్రకాశవంతముగా
ఉతుకబడినవి
ఇందుకు
సన్‌లైట్
సబ్బు కారణము
బాదకుండగనే బట్టలను
తెల్లగాను, ప్రకాశవంత
ముగాను ఉతుకును!
SUNLIGHT
SOAP
SUNLIGHT
SOAP

నొక ఉద్యోగికి,—పాపము అతనికి కుటుంబము లేదట! కొంత వయస్సు చెల్లినవాడు—అతని ఇంటికి పోయి వంటచేసి రెండుపూటలు భోజనము పెట్టుచు, తృణమో, పణమో, తగుమాత్రము సంపాదించి తండ్రి సంసారమునకు ఎంతో సహాయపడుచున్నది. మూర్తికి ఒక్క ఆలోచన తట్టెను. తామిద్దరును ఏ మదరాసుకో, బొంబాయికో, పోయి ఆధునిక పద్ధతులతో హోటలు ప్రారంభించకూడదా, అని. బాడుగ ఎంతైనా సరే, పెద్ద బంగళానే తీసుకోవలెను. చక్కని రేడియో కావలసినదే. అన్ని రకములయిన సౌకర్యములు సమకూర్చవలయును. అప్పుడు కొన్నాళ్ళలోనే వేనవేలు సంపాదించవచ్చునుగదా? మంచి పేరు పెట్టవలసియున్నది. "భాగ్య విలాస్" అని నామకరణము చేయుట బాగుండునని మూర్తికి తోచినది. కాని, ప్రారంభములో కొంత మూలధనము కావలయునుగదా? ఇన్ని చేసిన బృహస్పతి ఆ మాత్రము చేయలేడా? ఏదో మార్గమును చూపగలడు. తన ఊహలలో అసాధ్య విషయము మూర్తికి గోచరించలేదు.

ఒకానొకనాటి సాయంకాలమున 8 గంటల వేళ మందముపైన హాయిగా విశ్రమించి నీలాకాశమున నక్షత్రములను చూచుచున్న మూర్తికి ఇట్టి ఊహాపరంపరలు వచ్చి, మనస్సులోనే మండిగలు సిద్ధమగుచుండినవి. ఈ ఆలోచనా ప్రవాహములో ఇంకొక్క విషయము అతనికి స్ఫురణకు వచ్చెను. తన నవోఢ విరామములేక శ్రమపడి పనులు చేయుచుండగా, తాను వృథా తండులధ్వంసము చేయుచు కూర్చుండియున్నాడు కదా? పని పాటలలో ఆమెకు కొంత సాహాయ్యమైనా చేయుట యుక్తముకాదా? వెంటనే, దిగ్గుమనిలేచి తన భార్య పని చేయుచుండిన పొరుగింటికి వెళ్లి, ఊరక తేరమూసియుండిన తలుపులు త్రోసుకొని లోపల ప్రవేశించినాడు మూర్తి. ఒంటరిగా వంటయింటిలో ఆమె పని చేయుచుండునని అతని ఊహ. కాని, దైవమాయ! స్వప్నములోనైనా ఊహించియుండని దృశ్యమొకటి. పడకగదిలో అతనికి కానరాగా, పిడుగు కొట్టినట్లై, భ్రమనుపడి, నిశ్చేష్టితుడైనాడు. నోటిస్వరము వెలువడలేదు; కాలుచేతులు కదలలేకపోయినవి. రెండు నిమిషములలో ఆ యింటి యజమానుడు మూర్తిని చేరవచ్చి, అక్రమప్రవేశము చేసినందుకై చీవాట్లు పెట్టుచు, అర్ధచంద్రప్రయోగముతో ఇంటిబైటికి గెంటివేసి వీధితలుపులు గొళ్లెము పెట్టుకొనుదాక మూర్తికి ఇహలోకజ్ఞానము రాలేదు. అతనికి గాఢాంధకారము ఆవరించినది; నిర్మించుకొనియున్న స్వర్గలోకము తిరోధానమైనది; ఊహాసౌధము నేలకూలినది. పాపము!

మరి ఎవ్వరైనా సరే, ఇట్టి పరిస్థితులలో కన్నుమిన్ను కానక, ఏ ప్రమాదకార్యమునకైనా చేయి చేసి యుండెడివాడే! మూర్తి అట్టి పాపకార్యమునకు పూనుకొనలేదు. అతనికి ఒకటే చింత. ఇది స్వప్నమా, వాస్తవమా, అని. భాగ్యస్థానమందలి గురువుమహాదశలో ఇట్టి అవినీతి సంభవమా? అందులో, గురువు కళత్ర స్థానాధిపతి. (నిరయనముగా కన్యాలగ్నము కదా?) భార్యకు పాతివ్రత్యము లోపించగలదా? కాని, ఇది స్వప్నము కాదని, అర్ధచంద్ర ప్రయోగమువలన మెడకు కలిగిన బాధ చెప్పుచున్నది. అయినా, అంత వయసు చెల్లినవానికి, కులముకాని కులమువానికి, ఆముగ్ధ లోబడగలదని నమ్ముట కష్టము. దిక్కుతోచక, కుక్కురు మెక్కురుమనక, మూర్తి శ్వశురగృహము చేరుకొన్నాడు. తరువాత, ఎప్పుడో, వీలు పడినప్పుడు రహస్యముగా భార్యను చేరదీసి, మంచి మాటలతో లాలించి ప్రశ్నించగా, ఆ ముగ్ధ సత్యమును ఒప్పుకొని, వివాహమునాటికే తనకు మూడు నెలలని తెలియచేసినది. అమాయకురాలని, భార్యకు ఏదో కొంత హితోపదేశము చేసి, తరువాత సమయముచూచి మూర్తి మామగారితో మెల్లగా ఈ విషయము ప్రస్తావించెనట. కాని, ఇతడికి చీవాట్లు వచ్చుటే ఫలము. అల్లునికి పిచ్చిపట్టి ఏమేమో మాటలాడుచున్నాడని మామగారు ప్రచారము చేయసాగినాడు. ఈలోపల, వేరో, వెల్లంకియో, ఏదో ప్రయోగము జరిగి భార్యకు దోషనివృత్తి అయినది. పీడవదలిపోయినదిలెమ్మని నెమ్మది పడినాడు మూర్తి.

దినములు గడచినవి. భార్య ఆరోగ్యము కుదుటపడెను. ఆమెను పిల్చుకొనిపోయి ఏదైనా బ్రతుకు తెరువు చూచుకోవచ్చుననుకొని, తన భార్యను పంపమని మూర్తి మామగారిని ప్రార్థించినాడు. ఇల్లు వాకిలి

చేసి, జీవనోపాయము చూపినచో, అవశ్యము కావచ్చునని, వల్లగా ప్రతి వచ్చినది. మరల ఏమైనా పొరపాటు జరుగునేమో అనుకుని, తప్పించు కొని పోదలచిన మూర్తిగారి ఉపాయము సాగలేదు. కడకు పొరుగింటిలో సైరంధ్రీత్వమునయినా భార్యకు తప్పించుటకు అతనికి సాధ్యము కాలేదు. వివాహము నకై ఆ ఉద్యోగితో తెచ్చుకొన్న అప్పు తీరిపోవు దాక, ఆమెకు దాస్యవిముక్తి కాదని తేలినది. ఆ ఋణము తీరులోపుగా, ఇంకెన్ని ఋణానుబంధములు ఏర్పడగలవో, అని అతని భయము. కొన్నాళ్లలో నే మరల అనుమానాస్పదములగు సందర్భములు కానవచ్చినవి. మూర్తి భార్యను పిలిచి దండించ నారంభించగా, మామగారినుండి అతనికి దేహశుద్ధి అయినది. వైద్యశాలలో కొంతకాలము గడిపి ఇంటికి వచ్చిన మూర్తి తన భార్యకు జరుగుచున్న అన్యాయమును గూర్చి పోలీసువారికి ఫిర్యాదు చేయగా, అతను పిచ్చివాడనియు, భార్యకు అనవసరముగా తొందర కలించుచున్నాడనియు, గోలపెట్టి మామగారు అల్లుని గదిలో పెట్టి తాళము వేసి పోలీసువారికి ఏకో యుక్తితో సమాధానము చెప్పిపంపినాడు. భార్యను చూచుటకైనా అతనికి అవకాశము లభించుటలేదు; కొన్ని నెలలకు భార్య కుమారుని ప్రసవించినదను వార్త విన్నాడు. అతనికి కల్గిన మనోవ్యథ అపారము. కొన్నాళ్ళలో అతనికి వాస్తవముగానే మతి పోయినది. ఏకో నగరములోని పిచ్చివారి వైద్యశాలలో నుండి విడుదల అయిన తరువాత, తాను వైద్యశాలకు ఎప్పుడు వచ్చెనో, ఎవరు తెచ్చిరో, ఎన్నాళ్లు కడచెనో, ఏవీ స్ఫురణలో ఉండలేదు. కొంతకాలమునకు తన వివాహము, గురు మహాదశ, భార్యకు సంతానప్రాప్తి, ఇవి జ్ఞప్తికి వచ్చినవి; పుత్రునిపైన ద్వేషము పుట్టినది; సంసారముపైన విరక్తి కలిగినది. దేశాటనము చేయుచు, అతడు ఏకో రీతిగా శరీరయాత్ర కడపుచున్నాడు. భార్యపైనమాత్రము అతనికి ద్వేషములేదు. ఆమె అమాయకురాలని అతనికి నిశ్చయము. ఆమె పుత్రుకు మాత్రము తనకు శత్రువను భావము వచ్చినది. కాని గురుమహాదశ ముగియులోగా, తనకు మరల వివాహము కాగలదనియు, భాగ్యము రాగలదనియు, అతని ఆశ! భాగ్యస్థాన మందలి బృహస్పతిపైన అతనికి గొప్ప నమ్మకము.

కడచిన వికృతి సంవత్సర జ్యేష్ఠ శుక్ల పూర్ణిమా బుధవారము అనూరాధా నక్షత్రములో అభిజన్ముహూర్తమునందు జరిగినది ఇతని వివాహము. ఆ ముహూర్తపు విశేషము గమనించుట విద్యార్థులకు లాభకారి. ఇదే అప్పటి సాయనకుండలి:—

గు 6-20	రా 4 9 శు 28-29	బు 19-3	X 8-0 ర 9-14
	వివాహ ముహూర్తము (సాయనము)		వ 3-36 దాం. స. 14½
భా. స. 14½			
చ 5-33		కే 4.9 ఇ 14-45	I 6-30 శ 14-48 కు 26-14

సూచన:— { భా. స. = భార్యా సహమము.
దాం. స. = దాంపత్య సహమము.

వివాహముహూర్తమునందు లగ్నము వధువును, సప్తమము భర్తను, సూచించునని శాస్త్రమర్యాద. లగ్నములో శని యున్నచో, నీచ సంబంధమువలన కన్యకకు శీలచ్యుతి కలుగునని ముహూర్తులు చెప్పిరి:—

"లగ్నస్థే రవితనయే,
రమయతి నీచోత్థితాన్ బహూన్ పుంసః."

సప్తమభావములో గురువున్నాడు. దశానాథుడు కదా? కాని, సప్తమభావములో గ్రహముండుట మహాదోషములలో నొకటి. వనిత చెడి కన్యక పతిచేత విసర్జించబడునట!

"సప్తమగే దేవగురౌ,
భ్రష్టచరిత్రా, వివర్జితా పత్యా."

అని ప్రాచీన సూత్రము. కాని, శుభ గ్రహమయినచో, బాధలేదని కొందరు వ్రాసినమాట వాస్తవమే.

"ఇష్టాస్తు సౌమ్యా, స్సుత సౌఖ్యదాస్తే." అని వామదేవుడు చెప్పియున్నాడు. కాని, ఈ వాక్యములో 'సుత సౌఖ్యములు' చెప్పబడియున్నవే కాని, శీలమును గూర్చిన ప్రశంసయే లేదు. ఉద్దేశ పూర్వక

ముగా వాసుదేవుడు ఆ ప్రశంసను మానుకొన్నాడేమో? ప్రశంసలోని వివాహములో పై నిషేధ సూత్రము, ఈ అపవాదసూత్రము సహా ఫలించినవి కదా?

లగ్నములోనున్న శని పంచమాధిపతి. పంచమ (పుత్ర) భావఫలమును మోసుకొనియే వధువు వివాహ వేదికమీదికి వచ్చినదని అర్థమగునేమో? సప్తమ కేంద్రములో గురువు ఉండుటచే, అతి శీఘ్రముగా ఫలము అందినదికదా!

భార్యా సహాయము, దాంపత్య సహాయము, ఈ రెండును ఇంద్రునిపైన తులాభారము తూగుచుండుట చదువరులు గమనించవలసిన చమత్కారము. అంతా ఇంద్రజాలమైనది. మనము విన్న కథకు ఈ ముహూర్తపు కుండలి ఎంత చక్కని సాక్ష్యమిచ్చుచున్నదో కదా?

పరిస్థితులు సుకరముగా లేనప్పుడు, ఎంతటి వాడైనా, ఏమి చేయగలడు? ఇతర గ్రహముల సహకారము, సాహాయ్యము వచ్చియుండెనేని, ఈ బృహస్పతి ఎంతో పనికివచ్చియుండెడివాడు. ఇంద్ర, కుజ, శనులు జట్టుకట్టుకొని కుటుంబస్థానమందలి శుక్రుని వేధించుచుండగా, పాపము, అసహాయుడై, భాగ్యమందలి గురువు ఏమి చేయగలడు? గుటకలు మ్రింగుచు కూర్చుండి, ఎందుకైనా మంచిదే అని, భగవద్గీతలోని శ్లోకములు కొన్ని కంఠపాఠము చేయించినాడు. అమాయిక స్వభావము, సాధుశీలము, క్రౌర్యపరాఙ్ముఖత, అహింసాతత్వము, దైవభక్తి ఇవి గురువిచ్చిన గుణములు. ఇతనికి ద్వేషము లేదు. జరిగిన ద్రోహమును గురించి ప్రతిక్రియ తలపెట్టడు. ఈ సౌకర్యములను పురస్కరించుకొని, ఇంద్ర కుజ శనులు తమ కార్యమును నిరాతంకముగా నిర్వహించుకొనుచున్నారు. గురువునుండి ఆ గ్రహములకు మిత్ర దృష్టియే కలదుకదా? కాని, సప్తమస్థానమునకు అర్ధ కేంద్రములో నున్న వరుణుడు దీనిని సహించలేక, భార్యాపరిత్యాగము చేయించినాడు. ఎవరి పని వారిది!

చెప్ప మరచితిని. ఇతని భార్యజాతకములో ఇంద్రుడు ఇతని గురువునకు నిండు కేంద్రమునే ఉండుట! అంతా ఇంద్రుని మాయ!

ఏదో శుభగ్రహము నొకదానిని చూచి, ఇతర పరిస్థితులను గమనించక, ఆ గ్రహదశలో గొప్ప యోగము రాగలదని ఆశపడుట ఎంత అనర్థకరమో, మనకీ కథ బోధించుచున్నది.

"చిప్పలోన పడిన చినుకు ముత్యంబాయె,
నీటబడిన చినుకు నీళ్ళగలిసె;
ప్రాప్తిలేనిచోట ఫలమెట్లు వచ్చురా,
విశ్వదాభిరామ, వినుర వేమ." — వేమన.



లబ్ధి

★

శ్రీ నాయని కృష్ణకుమారి

ఏ మహాదృష్ట రేఖయో యిటుల మెరసి
కాంతివాకలు కట్టి నీయంత వాని,
నాడు కన్నుల తళతళ లాడు వాని,
నా వశము చేసి దయచూపి నవ్వి కెఱల,
ప్రణయ గంభీరు సుస్నిగ్ధు ప్రభుని నిన్ను
స్వమ్ముగా జేసికొన్న గర్వమ్ము నాది.
నీవు నవ్వితి వానాడు నిలువు నిలువు
సిగ్గుచెఱగుల ముంపులో నుగ్గబట్టు
కొన్న ప్రాణమ్ము లోక కన కూడనీక;
నేను నవ్వెద నీనాడు నిన్ను జూచి
అంత స్వామివి, నా హృదయాంతరమున
చిక్కుకొని, దారి తెలియని చింతపడగ.
ఏ పురాకృతపరిపాక మిదియొ స్వామి!
వలపు పండిన నీ కన్నుగొలకులందు
తీవ్ర లజ్జా విముగ్ధమ్ము తెఱలె నాడు
రూపు, కల్లోలహృదయ ప్రకాశ చణము!
బెఱుకుదనమున ముందంజ వేయలేని
మనసు గుడుసుల్ల పడి లోన మఱిగిపోయి
నీవు నావాడ వగుదువో కావో యన్న
సంశయమ్మున నొకనాడు సంచలింతు.
కాని యే పార్వతీనాథు కరుణారసమొ
శీతకరు వెన్నెలయొ గాంగ శీకరమ్మొ
యనగ గుమిలెత్తి కురిసి నా తనువు తనువు
వెలుగు వెల్లువ మలచిన వేళ యిద్ది.
ఎపుడొ యేనాడొ సంశయాలెగసి కలచి
యంతరంగమ్ము క్షుబ్ధ నీరాకరమ్ము
ఇపుడు ఈనాడు హర్షాశ్రు లెగసి కెఱల
నంతరంగమ్ము పూర్ణిమ యలము కడలి!
స్వామి యీమహాభావ తీవ్రతల నాచు
కొనుటకే శక్తి చాలమి కూలు హృదయ
తటము నెడి భయమ్మున పెల్లు తత్తరమ్ము
చెంది గాసిల్లి శూన్యనై కుందు నన్ను
అభయ హస్తమ్మదే మహావిభుని విశ్వ
నిర్మితిం గార్యదక్షమై నిగ్గు దేల—
దాని తాకిడి నా యెడద విపుల మగు
చు నిను నా స్వామి నా రాజు శుభదమూర్తి
కణకణమ్మున నిల్పుకో గలిగ నిట్లు —

★ కిటికీ ★

శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి

★

ఒ...క...టీ...ఒ...క...టీ... అడుగులు నెమ్మదిగా వేస్తూ వెళ్తోంది పాతకర్ర.

అరిగిన పాతకర్రని పట్టుకున్న ఎండిన కొమ్మ లాంటి చెయ్యికూడా దాన్తోపాటు అలానే నెమ్మదిగా వెళ్తోంది.

విద్యుద్దీపాల వెలుగువంతెనని అరబోసిన ముగ్గులా పరుచుకొన్న సిమెంటురోడ్డు అంతే నెమ్మదిగా వెనక్కి జరుగుతోంది.

వెళ్ళగా వెళ్ళగా అరబోసిన ముగ్గు గడ్డకట్టిన తారుగా మారింది.

కృష్ణ సర్పంలా మెరిసే తార్రోడ్డు కూడా వెనక్కి జరిగి జరిగి ఆఖరయింది.

పాతకర్ర ఆగి సేద తీర్చుకొంది ఒక్క క్షణం.

ఇంకా ఎంత దూరం ?

తారూ, కంకరా కలిసే స్థలంనుంచి ఇంకా ఇరవై 'ఎలక్ట్రిక్' దీపాలు దాటాలి. అక్కడనుంచి ఎడంచేతి వైపు మళ్ళి, ఎనభయ్యడుగులు నడవాలి.

ఇరవై దీపాల కంకర్రోడ్డూ, ఎనభయ్యడుగుల కాలిబాటా దాటగా,

ఎడమవైపున ఉండేది పాతమేడ.

కుడివైపున ఉండేది సగం కూలిన పెంకుటిల్లు.

ఆ పాతమేడ వినా ఆ ప్రాంతం విద్యుచ్ఛక్తితో గాని మరెట్టి కాంతితో గాని ప్రకాశించదు. అంతా అంధకారం.

ఎదురెదురుగా ఉన్న ఆ రెండు ఇళ్లూ దాటిన తరువాత ఏవేవో తోటలూ, ఎవరెవరివో చిన్న చిన్న ఇళ్లూ లేకపోలేదు. కాని ఎండిన చేత్తో ఆ పాతకర్రని పట్టుకున్న మనిషికి వాటి వేటితోనూ సంబంధం లేదు.

కూలిపోయే ఇంట్లో ఇంకా పూర్తిగా పడిపోకుండా నిల్చిన వరండాలో కూర్చొని చూడ్డానికే అతను వెళ్తున్నది.

క్షణంసేపు సేద తీర్చుకున్నాక దీపాలు లెక్కపెట్టుకుంటూ, ఎంతో అలసిపోయినట్టుగా ఊపిరి తీస్తూ బరువు నడక సాగించేడు.

ఇరవై దీపాల దూరంగల కంకర్రోడ్డు ఎలాగయితేనేం వెనక్కి వెళ్ళింది. పాతకర్ర ఎడమవైపుకి మళ్ళింది.

ఇహ ఉన్నవి ఎనభయ్యే అడుగులు.

పైన చంద్రుడు లేడు. అక్కడ పక్కన మ్యునిసిపల్ దీపాలు లేవు. నక్షత్రాల కాంతి అతని కంటికి చాలదు.

చాలా చీకటిగా ఉంది. కొంచెంగా చలిగాలి వీచింది.

చీకటిగా ఉన్నప్పటికీ చేతికర్రకి దారి బాగా తెలుసు. అలసిపోయినప్పటికీ ఎనభయ్యడుగుల మేరనీ తొందరగా వెనక్కి నెట్టి నిట్టూర్చింది.

అదిగో కిటికీ !!

ఇదిగో వరండా.

పెంకుటింటి ముందు భాగం మాత్రం కొంత నిల్చింది. చీకటిలో నిండిన ఆ ఇంటి వరండాపైకప్పు

ఒక వార కొంత మేరకూలింది. కింద, గచ్చు, ఎన్నో చోట్ల, దాదాపు అంతటా, గాయాలు పడింది. ఉన్న రెండు రాతి స్తంభాలకీ రక్త మాంసాల్లేవు, ఇంటికి ఇవతల నిల్చొని ఇంటి మీదకూడా విస్తరించుకొంది ఓ మామిడిచెట్టు. కప్పుకూలిన వైపు వరాండా మీదా, ఆ మామిడిచెట్టు మీదా ఎదటి మేడ లోంచి వచ్చే దీపంవెలుగు పల్చగా పడుతోంది.

ఆ వరాండాలో చీకటిగావున్న వైపు గోడని ఆనుకుని కూర్చొని, కర్రని పక్కన పెట్టి, ఎడం భుజాన్న ఉండే బరువుతీసి ఎదురుగా పెట్టుకొని, ఎదట మేడవైపు తలెత్తి చూసేడతను.

కిటికీ కనిపిస్తోనే ఉంది.

మిగతా మేడంతా చీకటి. ఆ కిటికీ వే కనిపిస్తోంది.

చాలీచాలని నక్షత్రకాంతి నిగనిగలాడే రాత్రిలో కరిగి పోతోంది. ఎదట ఉండే పాతమేడా మేడ వెనక తాటిచెట్ల వరసా, చీకట్లో కలిసీ కలియనట్టుగా ఉన్నాయి. తాటిచెట్ల తలల్లోంచి చిన్న చిన్న చుక్కలు కనిపించని కదలికతో ఆకాశంలోకి లేస్తున్నాయి.

అవన్నీ చీకట్లో ఛాయలు. మట్టిపీసలు. ఆ నక్షత్రాలైనా, అవన్నీ చీకట్లో మునిగిన మెరుగు తగ్గిన రాళ్లు.

ఆ కిటికీ ఒక్కటే ఆ ప్రాంతంలో ఆ నిశీథంలో ధగ ధగ లాడేది; జిగ జిగ మెరసేది.

మేడమీద ఒకటేగది, సరిగ్గా ఆ గది వెడల్పునా దాని పక్కనే చిన్న డాబా ఉంది. గదీ, డాబానీ వేరుచేసే గదిగోడకి ఎదురుగా ఉంటుంది, అతను కూర్చొనే స్థలం. అతనికి ఎడమవైపుది గది. కుడివైపుది డాబా.

ఆ గది అట్టే పెద్దదికాదు. గదికి మధ్యగా ఉన్న ఆ కిటికీ చిన్నదికాదు. ఇనపవిగాని, మరెట్టివిగాని కిటికీకి ఊచల్లేవు. తలుపులు తెరుచుకొనే ఉంది. వెనక వెల్తురులో వజ్రంలా ప్రకాశిస్తోంది.

చిట్ట చీకటి తెరని ఆ కిటికీఉన్న ఒక్కచోటా కత్తిరించి అడున దాగున్న వెలుగుని ఎవరో చూపెడుతోన్నట్టుగా ఉంది. ఎవరో పుణ్యాత్ములు ఆ తెరని ఆ మేరకి కత్తిరించో లేక ఒత్తిగిలించో అవకాశం కలిగిస్తున్నారు ప్రతి రాత్రీ అతనలా చూసి సంతోషించడానికి, అను నిమిషం తన్మయుడవడానికి.

తెరవెనక అంతా ఆనందం, తెరఇవతల వానికి లేనిది సౌఖ్యం.

అతనికి లేనిది, అతనికి కావాలని ఉన్నది, అందరికీ ఉండాలని అతను కోరేది అంతా ఆ కిటికీ వెనక ఉంది. కిటికీలోంచి కనిపిస్తోంది.

కిటికీ వెనక ఉన్నది ఏమిటి ?

తెల్లగా, వెల్ల వేసిన గోడలతో ఒకే ఒక గది.

చీకటి వరాండాలో కూర్చొన్న మనిషికి ఆ గదిలోని కనిపించేవి ఏమిటి ?

ఆకుపచ్చ గాజు టోపీ పెట్టుకొని, తీగని పట్టుకొని గది మధ్యకి జారిన విద్యుద్దీపం; ధగ ధగ లాడే దీపం వెలుగు; ఎదట గోడని బ్రాకెట్ మీద ఒక నీలి రంగు గాజు గడియారం; దానికి పక్కగా పెద్దదికాని అద్దాల బీరువా; బీరువామీద పేర్చిన నల్లటి గంధపు బొమ్మలు; వాటి మధ్య రంగులు వేసిన రెండు చిన్న పాలరాతి విగ్రహాలు—ఒకరు లక్ష్మి, ఒకరు సరస్వతి; బీరువాపైన గోడని ఒక పటం; అందులో పడుకొని పుస్తకం చదివే ఆడమనిషి బొమ్మ; దానికిపైన గది కప్పు బిళ్ళపెంకు; ఒక వార ఉండే దోమ తెరకట్టిన పందిరి మంచపుకోడ; కిటికీకి చేరువగా ఒక మనిషి కూర్చో వీలయే సోఫా.

ఇవన్నీ ఆ కిటికీలోంచి అతనికి సుస్పష్టంగా కనిపించవు. కాని, చాలా మనోహరంగా కనిపిస్తాయి. సుస్పష్టంగా కనిపించకపోవడం చేతనే ఎక్కువ మనోహరంగా ఉంటాయతనికి. ఆ గదిలో,

వాళ్ళిద్దరూ ఉంటారు !! వాళ్లిద్దరే ఉంటారు.

ఆవిడ, ప్రాణం వచ్చిన పాలరాతి బొమ్మ; చిగిర్చిన తీయమామిడి కొమ్మ; వికసించిన కుసుమం; స్తంభించిన విద్యుల్లత; దిగివచ్చిన దేవత.

నవనవలాడే లేజవరాలు.

అతని శరీరం మెరుగుపెట్టిన లోహం. అతన్ని కుతకుతలాడే రక్తం. అతను కొమ్మపై వాలిన గండు కోయిల; మనిషిగా మారిన మధుపం.

అత నామెకోసం దిగివచ్చిన దివ్యుడు.

అది గదిగా మారిన స్వర్గం. అది తెరవెనక స్వప్నం. అక్కడ నిత్య వసంతం.

తెరచిన తెరలోంచి ఈ స్వప్నాన్ని, ఈ నిత్య వసంతాన్ని, ఈ స్వర్గాన్ని చూడ్డానికే అతను నడచి నడచి నడచి నడచి వస్తోన్నది.

ఎన్నాళ్ళనుంచి ?

—ఓ రెండు దశాబ్దాలు కావొచ్చు.

ఆపట్నం వచ్చి సంవత్సరం అయింది. శేళ, కావచ్చింది. వచ్చినరోజు రాత్రి దారితప్పడిపోయి తిరుగుతూండగా, చీకట్లో దొంగచాటుగ వచ్చిన సికందరుసైన్యంలా పల్లమబ్బులు అన్ని వైపులనుంచీ కమ్మేశాయి. కురిసేవరకూ వర్షం వస్తోందన్న సంగతి అతను గమనించనే లేదు.

ఒక్కసారిగా గడగడలాడించే చలీ, మొత్తేసే జడివానా వచ్చిపడ్డాయి.

పక్కనేఉన్న ఆ వరండాలోకి తననీ చేతి కర్రనీ చప్పున చేరవేయవలసి వచ్చింది.

ఆదినం వంట్లో బావుంది కాదు. అన్నం హితవు కాలేదు. సహించింది కాదు.

వళ్లంతా వణవణ వణుకుతోంది. మనసంతా బరువుగా ఉంది. చూస్తోండగానే గుండె చెరువయింది.

—రొండవ రొండవ రొందవ బతుకు.

ఈరీతిగా ఎన్నాళ్లు? ఎన్నాళ్లయినా ఎందుకు?

వీధిలో ఎండ. ఏటిలో నీరు. చెట్టుకిందనీడ.

ఎంతకాలం?

ఎక్కణ్ణించి ఎలా వచ్చేను? ఇక్కడ ఇలా ఎందుకు ఉంటున్నాను? ఎప్పుడు ఎలా ఎక్కడికి పోతాను?

ఆసే ప్రశ్నలకి ఎవరికైనా జవాబులు తెలుసునేమోగాని, అతనికి అటువంటి ప్రశ్నలు వేసుకోడం కూడా సరిగ్గా తెలియదు.

“నేను” అనే పదంయొక్క అన్ని విభక్తుల తోనూ నిండిన ఈలోకంలో “షష్ఠం”చేత అతనికి నొప్పిగాఉంది. కాని, ఆనొప్పికి కారణం స్పష్టంగా కనిపిస్తూన్నా ఎవ్వరికీ తెలియనట్టే అతనికూడా తెలియదు.

వర్షం పడుతోంది. చలి వేస్తోంది. అతను దుప్పటీ దగ్గరగా లాక్కొని కప్పుకున్నాడు. అతని వళ్లంతా పీకుతోంది.

—కాళ్లీడిపోతున్నయ్.

దూసుకువచ్చే చలిగాలి. జల్లుజల్లుగా జడివాన. మధ్యమధ్య మెరుపువాలికలు. మాటిమాటికీ ఉరుముల హోరు.

వానజల్లుకి వరండా తడుస్తోంది. సగంమాత్రం నిల్చిన మారులోంచి నీరు ఉరుస్తోంది.

—సత్తే శానా సుకం రేం! ఓ పిడుగుపడ కూడదా?!

పిడుగు పడింది కాదు. పిడుగులు ఎక్కడెక్కడో పడ్డాయి. మూలనున్న ముసలమ్మని కొట్టడం ఎందుకని కాబోలు పడిపోయే పెంకుటింటిని మాత్రం అన్ని పిడుగులూ విడిచిపెట్టేయి.

—వాలాటోళ్ని సూసే దాతే నేడు! బగమంతుడే సూణ్ణప్పుడు అరి మాటా ఈరి మాటా సెప్పుకు చేటి సాబం?!

పడే పిడుగులూ, చూసే దాతలూ, చూసీ చూడని భగవంతుడూ కూడా అంటకుండా దూరంలోనే ఉంటూఉండడం జరిగింది. జరుగుతోంది.

—ఈపాలికి సత్తే బావుంటాది.

“చస్తే బావుండును” అని అనుకొనేంతవరకూ పరిస్థితి “వచ్చింది” అవడం నిజం కాదు.

పరిస్థితి ఎప్పుడూ అక్కడే ఉంది. పరిస్థితులు ఎప్పుడూ ఒక్కలాగే ఉన్నాయి.

జ్ఞానం వచ్చినప్పటినుంచీ ఇలాగే ఉంది అవస్థ.

ఎవరు కన్నారో వారు గుర్తులో లేరు.

దౌర్భాగ్యులు! పాపాత్ములు! శక్తిహీనులు! బానిసలు!

ఎవరో ఒకరు కన్నారు.

భయంతో కన్నవారు భయపడి పారిపోయేరు.

ఇహ జ్ఞప్తికి వచ్చేదెలా?

పెంచిన ముసలమ్మ మాత్రం బాగా జ్ఞాపకం ఉంది.

“నానే గాని సూడకపోతే ఆపొద్దే సచ్చేవురా సుంటనారొండవ! ఇశవాసంగా బతకరా”

అని మాటిమాటికీ చెప్పే ముసలమ్మ హింసించి హింసించి హింసించి ఏనాడో పోయింది.

ఎంతగా ఎంతగా హింసించింది!!!!

పోయే ముందు ఈ దార్లోనే వదిలేసింది.

ముసలమ్మ నడిచి చూపెట్టిన దయ్యాల బాట వెంబడి నడవక తప్పటంలేదు. మరో మార్గం కనిపించదు. ఎవరూ చూపించరు.

ఈ దయ్యపు బతుక్కి ఆనందం, సౌఖ్యం ఉండవు. కాని కొన్ని—అతి తక్కువ—మధుర స్మృతులు మాత్రం ఉన్నాయి.

అవి ఎట్టివి? ఎంత గొప్పవి? లేకుంటే ఎంత చిన్నవి? పచ్చటిముఖంతో, రూపాయంత బొట్టుతో, కుండంత కొప్పుతో, మందహాసరేఖతో ఓ ముసలావిడ ఓ మధ్యాహ్నం దయతో పిల్చి, ఆదరించి, దీవించి, పంపింది. దీవన ఫలించకపోతే నేం? దయతో దీవించడం ఎంతకాదు? ఒకనాడొక తప్పిపోయిన పిల్లని తల్లిదగ్గర చేరవేసినందుకు ఆమె ఒక సరికొత్త పంచె ఇచ్చింది. ఒకరాత్రి తాగి తందనాలాడే సీమ సిపాయి అయిదురూపాయిలు పారేసుకున్నాడు. తన అన్నం కొంత పెట్టినందుకు ఒకరాత్రి ఒక ఆడమనిషి వంటిమీద చెయ్యి వేయనిచ్చింది. ఓనాడు ఓ పోలీసు వాడు కొట్టకుండా విడిచిపెట్టేడు. ఓ సాయంకాలం కరవబోయిన వెర్రికుక్కని ఎవరో వచ్చి తరిమి తరిమి కొట్టేరు.

స్మృతిపథాన మధురంగా మెరిసేవి ఇవి గాక—

ఓ వూళ్లో చెట్టుకింద గట్టెకట్టి గంతులు వేసిన ఆడపిల్లా; రెయిలుబండిలో కూర్చొని పిల్లడికి పాలిస్తూ ఒకసారి కనిపించిన వెన్నెలవంటి ఒక చల్లని తల్లీ; ఒకరాత్రి "ఊర్మిళమ్మ నిద్ర" పదం పాడిన జంగిలీ వాడూ; ఓ సత్రంలో కూర్చొని చిలుం వేడిలో మంచుకొండల మహిమలు చెప్పిన బైరాగి మనిషీ; వీళ్ళగురించి, వీటిగురించి తల్చుకున్నప్పుడు కూడా మధురంగా ఉంటుంది.

మిగతాదంతా

—గడ్డు, గడ్డు, గడ్డుబతుకు.

కాలంలో ఉన్నన్నాళ్లు, జబ్బు చేయనన్నాళ్లు ఫరవాలేకపోయింది.

ఇప్పుడు కాలం బాగా ముళ్ళింది. జబ్బు చేసింది. కర్రపట్టుకొంటూంటే చెయ్యి వణుకుతోంది. చలికాలం కాకపోయినా చలివేస్తోంది. వేసవికాలం కాకపోయినా ఎండ భరించ శక్యం కాకుండా ఉంది. నిండినా నిండకపోయినా కడుపు ఒక్కలాగే ఉంటోంది. నిండకపోడం పరిపాటవుతోంది.

బైట,

అంతటా వర్షం పడుతోంది. ఎక్కడో పిడుగు పడింది. మాటిమాటికీ మెరుస్తోంది.

అతనుమాత్రం ఎటూ చూడకుండా "వస్తే ఎంత బావుండును" అనే విషయం గురించి ఆలోచిస్తూ కూర్చుండిపోయేడు.

చిన్నమగత నిద్రపట్టింది కాబోలు.

ఇంతలో చూరునుంచి ఒక పెంకు జారిపడింది కాబోలు. అందుకే కాబోలు అతనికి మెలకువ వచ్చింది.

కళ్లు నలుపుకొని అటూ ఇటూ చూస్తున్నాడు.
కంటికి కనిపించని చిక్కటి చీకటితో నిండుకొని, అందాలతో నీళ్ళు కుమ్మరించిన ఆకాశం, నిద్రలేచి చూసేసరికి, చల్లగా నిగనిగలాడుతూ కంటికి స్పష్టంగా కనిపిస్తోంది. అందులో, వెదజల్లిన ముత్యాల్లాగ ఎక్కడ ఎటుచూసినా చక్కటి చుక్కలు వెలుగుతున్నాయి. మొత్తేసిన మేఘాల్ని చలిగాలి ఇంకోవైపుకి ఎక్కడికో మోసుకుపోయింది. గాలి వీయడం లేదు. అంతా నిశ్శబ్దంగా ఉంది.

స్నానం చేసి, కొత్తబట్టలు కట్టుకొని, పువ్వులు పెట్టుకొని, దీపంలేని గదిలోకి వచ్చిన ఆడమనిషి శరీరంలా ఆ రాత్రంతా ఎంతో చల్లగా ఉంది.

అంతా నిశ్శబ్దంగా ఉంటూండగా, అతనలా చూస్తూండగా, ఎటునుంచి,

తలుపులు తెర్చుకొని వెయ్యి దీపాల వెలుగు బైటికి వచ్చింది.

వెలుగులోంచి దేవతలెవరో వీనుల విందుగా నవ్వేరు.

అప్పుడే నిద్రలేవడంచేత, ఎదట మేడ కనిపించక పోడంచేత, అక్కడ ఇల్లున్నాదని తెలియక పోడంచేత, ఆకాశానికి తలుపులు తెరిచేరనే అనుకున్నాడు. స్వర్గంలో దేవతలు నవ్వుతున్నారనే అనుకున్నాడు.

వళ్ళంతా జలదరించి, పులకరించి తన్మయత్వం పొందింది.

వెలుగులోంచి రెండు చేతులు బైటికి వచ్చేయి.

"జల్లు పూర్తిగా పోయిందండీ! ఎంత చల్లగా హాయిగా ఉందో చూసేరా!

"నీకంటేనా?"

ఆవిడ చేయీ అతని చేయీ లోనికి పోయేయి.

ఆవిడ అటువైపు తిరిగింది. అత నావిణ్ని వెనక్కి లాగేడు.

ఎవరు వారు?

మనుష్యులు కారు, దేవతలు కాదు; మనుష్యులే కాదు, దేవతలే!

వాళ్లనలా చూడాలనే అనిపిస్తోంది.

వాళ్లని చూడకుండా ఉండలేకుండా ఉన్నాడు.

ఆవాడు వర్షం కురుస్తూండగా, చిక్కటి చీకటిగా ఉంటూండగా "ప్రాణంపోతే ఎంత హాయిగా ఉండేది" అనుకొంటూ చిన్న కునుకు తీసేడు.

నిద్రలేచేసరికి వర్షం వెలిసింది. ఆకాశం పువ్వులు విరిసింది. దేవతలు తలుపులు తెరచేరు.

అతనికి అది నిజంగా స్వర్గమే.

అందుచేతనే ప్రతిరాత్రీ అక్కడికి లాక్కుపోతుంది ఆ అరిగిన పాతకర్ర.

ఏడాదిక్రితం ఆవూరు వచ్చిన తొలిరోజురాత్రి ఆ కొన్ని క్షణాలూ, "అది స్వర్గం; వారు దేవతలు" అని కలిగినట్టి ఆభావన, ప్రతిదినమూ ఆచీకట్లో అక్కడికివెళ్లిన కొన్ని క్షణాలు—అతనికి మళ్లీ కలుగుతుంది. ఆ కొన్ని క్షణాలూ కూడా అతని మనసు గాల్లో తేలి, చుక్కల్ని చేరి, అమృతంలో మునుగుతుంది.

ఆదృశ్యం చూడ్డానికైనా, అనుభూతి పొందడానికైనా బతకాలని ఉం దతనికి.

ఆరాత్రినుంచీ అతణ్ణి బతికిస్తూ వస్తున్నదే ఆదృశ్యం.

ఆకాశం కాదు; పాతమేడ. స్వర్గానికి సింహద్వారం కాదు; ఊచల్లేని కిటికీ. ఇంద్రనగరపు దీపశిఖరం కాదు; ఊళ్లో ఉండే మామూలు విద్యుద్దీపం. దేవతలు కారు; సామాన్య యువతీ యువకులు.

అది స్వర్గం కానే కాదు; వెల్లవేసిన చిన్నగది.

అవొచ్చు. అంతే కావచ్చు. నిజం అంతే కూడాను. కాని ఆనిజంతో అతనికి ప్రసక్తిలేదు.

ఇంద్రుని హార్మ్యం. స్వర్గకవాటం. రత్నఖచిత కుడ్యం. మాణిక్య దర్పణం. హంసతూలికా తల్పం. అమరుల ఆరనిదీపం. సువర్ణసింహాసనం. నిర్జరమిథునం, అతివాస్తవిక అధివాస్తవిక స్వర్గం.

అతనికి—

అదే నిజం. అవే నిజం. వారేనిజం.

తనకి ఎంతో నిజమైన ఈ అబద్ధాన్ని చూడ్డానికే—(అతని స్థాయికి అది నిజమే నేమో)—అతను ఎంతో దూరంనుంచి శ్రమపడి వస్తోన్నది.

నిజం ఏమిటో, వాళ్లు నిజంగా ఎవరో అతనికి తెలుసుకోవాలని లేదు. తెలిస్తే రోజూ కలిగే భావన మరింక కలక్కపోవచ్చు. ఆ భావనని, ఆ భ్రాంతిని విడిచిపెట్టుకుందామనే ఉద్దేశంలేదతనికి.

వాళ్ళనసలు, రాత్రివేళ తప్పించి పగటిపూట చూడనైనా చూడ్డతను.

వాళ్ల అసలు రూపాలు, నిజ వృత్తులు, సంఘంలో వారి స్థానాలు, అటువంటి వాటితో అతనికి నిమిత్తం లేదు. తెలుసుకుందామనే కుతూహలం లేదు. ఆనందంగా సంతోషంగా వాళ్ళా గదిలో అలానే ఎప్పుడూ ఉంటూ అతనికా తన్మయత్వాన్ని ప్రసాదిస్తూంటే చాలు నతనికి.

వాళ్ళు ఇంతవరకూ అలా సుఖంగా ఉంటూనే వస్తున్నారు.

వాళ్ళు ఏం చేస్తూన్నా అతనికి హాయిగానూ, సుఖంగానూ ఉంటుంది.

సోఫాలో కూర్చుంటారు, మంచంమీద పడుకుంటారు. అద్దంలో చూసుకుంటారు. డాబామీద పచారు చేస్తారు. ఏదో చదువుకుంటారు. ఆకాశంలోకి చూస్తారు. కళ్ళల్లోకి చూసుకుంటారు.

ఎప్పుడూ నవ్వుతూన్నట్టుగానే ఉంటారు.

"నూతన వధూవరులా? లేచివచ్చిన మేనత్త మేనమామ పిల్లలా? ఆ ఇల్లు వారిదేనా? ఆవిడది ఏం కులం? అతనికి ఏం పని?"

వీటికి సమాధానాలు ఎవరికైనా కావాలా?

అతనికి మాత్రం అక్కర్లేదు.

రాత్రి చక్కగా ఉంది. గదిలో వెలుగ్గా, వెచ్చగా ఉంది. జంట ఎంతో ఇంపుగా ఉంది.

అందుచేత, పైన చీకట్లో, వరండాలో, కూర్చొన్న మనిషికి భ్రాంతిగా హాయిగా ఉంది.

కొంత రాత్రివరకూ దీపం వెలిగే ఉంటుంది.

తరువాత దీపం ఆర్పేసి ఆ సోఫాలో ఇద్దరూ కూర్చుంటారు. కూర్చోడం అతనికి కనిపించదు; కాని అలా కూర్చుంటారని అతనికి తెలుసు. వాళ్లెప్పుడు పడుక్కునేదీ కూడా అతనికి తెలుస్తుంది.

వాళ్లు పడుకున్న తరువాతనే గాని అతను పడుకోడు. ఇంతదూరం ఇది చూడ్డానికి వస్తున్నాడని వింటే అందరూ ఆశ్చర్యపోవడమే కాక, నవ్వుతారని కూడా అతనికి తెలుసు.

ఆశ్చర్యకరమైనది, పరిహసించ తగినది అవుతే అవుగాక, పొట్టలు చెక్కలయేలా అందరూ నవ్వితే నవ్వుదురుగాక, కాని, ఆ కత్తిరించిన తెరవెనక దృశ్యాన్ని అతను చూడకుండా ఉండలేడు. అది చూడ్డానికే బరువుగా ఉండే రోజుల బళ్లని ఈడ్చుకు వస్తున్నాడు, ఒక ఏడాదినుంచి.

అక్కడికి వెళ్ళి, ఇక్కడికి వెళ్ళి, ఎక్కడెక్కడికో వెళ్ళి, అందరిచేతా తిట్లుతిని, ఎండదెబ్బ అదేపనిగా తిని, ఈ ఎండిన మనిషి పగలల్లా ఎన్నెన్ని తిప్పలు ఎలా పడగలుగుతున్నాడు? దిన దినానికీ శక్తి తగ్గుతూన్నా ఎలా తిరగ్గలుగుతున్నాడు?

పగలంతా అబద్ధం అనుకొని, ఆ రాత్రే నిజం అనుకొని, రాత్రికోసం పగలంతా అతను బరువుని మోయగలుగుతున్నాడు. బాధని సహిస్తున్నాడు.

కాని, ఊరిచివరికి ఊరిచివారకీ, అన్నిటినీ దాటుకొని అన్నింటినీ దాటుకొని, అంతదూరం—ఎంతోదూరం ఎందుకు వెళ్తాడో ఎవ్వరికీ తెలియనివ్వడతను.

అది అతని ప్రత్యేకమైన పరమరహస్యం.

తనెందుకంత సంతోషంగా ఉన్నాడో తన తోడివారికి తెలియదు. తెలియకపోడంచేత వాళ్ళకి చిరాగ్గా ఉంటుంది. అతనికి చాలా సరదాగా ఉంటుంది.

అందర్నీ పిల్చుకువెళ్ళి చూపించాలనే ఉంటుందతనికి.

కాని అంతా కలిసి వెక్కిరిస్తారు. వేళాకోళం చేస్తారు. అతణ్ని అల్లరి చేస్తారు.

తన కది స్వర్గంలా ఉందని చెప్తే వారికి అర్థం కాదు.

—ఓ యాడాదవుద్ది కాబోసు.

అనుకున్నాడు కిటికీలోకి చూస్తూ.

ఆవిడ సోఫాలో కూర్చునేఉంది. అత నామెకి దగ్గరగా సోఫా చేతిమీద కూర్చొని నవ్వుతూనే ఉన్నాడు. తీగపట్టుకు జారిన విద్యుద్దీపం వెలుగు వెదజల్లుతూనే ఉంది. అంతా హాయిగా ఉంటూనే ఉంది.

స్వర్గం స్వర్గంలాగే ఉంది.

అత నలా చూస్తూనే ఉన్నాడు.

కాని—

అలసటగా ఉందతనికి!

అతనికి ఎంతో అలసటగా అలసటగా ఉంది.

స్వర్గాన్ని చూసినంత మాత్రాన అమరత్వం సిద్ధించదు.

అలసటైనా తగ్గదు.

తగ్గినట్టు తోచినా నిజంగా తగ్గదు.

బరువుగా రోజుల్ని ఈడ్చే మనుష్యుల జవసత్వాల్ని బరువురోజులు పీల్చి పారేయక తప్పదు! తప్పదు!

ఆరేసిన ముగ్గులోంచి, గడ్డకట్టిన తారుమీంచి, గతుకులుపడ్డ కంకరలోంచి నడవడమే కష్టంగా ఉండెను. దానికితోడు ధూళితో నిండిన బాటలో ఆ ఎవధియ్యాకుగులా తొందరగా నడవడంచేత కాబోలు అలసటగా ఉంది.

అలసిపోయిన కళ్లు అమరలోకాన్ని చూస్తూనే ఉన్నాయి.

తాటిచెట్ల తలల్లోంచి లేచే నక్షత్రాలని కారు మేఘాలు కబళించేస్తున్నాయి.

కొంచెం చలిగా ఉంది. అతనికి అలసటగా ఉంది.

అదీ!

—ఏట్రా అని సూత్తుండావు, ఇయ్యాల్ల అల్సిపోనాను.

నడుం చేరవేసినా అలసటగా ఉంది.

—గుండెలేటి ఇలా కొట్టుకుంటున్నయ్?!

గుండెల్లో దడిగా, నీరసంగా ఉంది.

—ఈపొద్దింత చలేస్తోందేటి?

మధ్యాహ్నం ఎండగా ఉండేను. సాయంకాలంనుంచీ చలిగా ఉంటోంది.

ఇప్పుడు హెచ్చు చలిగా ఉండడమేకాక బాగా చీకటిగాకూడా ఉంది.

కత్తిరించినచోట తప్పించి మిగతా తెరంతా చాలా చల్లగా ఉంది.

—ఆపొద్దువాగే ఈపొద్దుకూడా సినుకపడుద్ది కాబోలు. మా సెడ్డ చలిగా ఉందే...దుప్పటేముక్క సిరిగిపోవాదిగందా...ఏటిసెయ్యడం?

ఆ కొసనుంచి ఈకొసవరకూ ఆకాశం చీలి బద్దలయింది. మళ్ళీ అతుక్కుపోయింది. బలమైన గాయం తగిలినట్టు పెద్దగా ఘోష పెట్టింది.

చలిగాలి అధికారం చలాయిస్తోంది.

స్వర్గానికూడా చలిగాలి సోకిందికాబోలు.

"తలుపులు వేసేదామండీ" అంది దేవత.

"సరే" అన్నాడు దివ్యుడు.

—అరే! తలుపేసేసినారే!

సింహద్వారం మూసుకుపోయింది.

తెరచిన తెర కప్పుకుపోయింది.

—ఇంతసీకటిగా ఉందేటి బగమంతుడా!

చీకటిపరదలో మధుర స్వప్నం మునిగిపోయింది. ఆవరించుకొన్న మేఘాలపొగల్లో మాయమయింది. నిత్యంగా ఉండాల్సిన వసంతం ఎక్కడకి పోయింది? కళ్లముందు కదలాడిన స్వర్గం ఏదీ ఎక్కడ?

—రేపు రతిర్గాని తెరవరే!

బతికుంటె సూడవచ్చు.

రేపటివరకూ ఎలా బతకడం?

గుండెల్లో మండేవి మంటలు. పొగల్లో ఉండలేనిది ఊపిరి. పరదలో రేలని కాళ్లు. కడుపులో కదిలేవి తేళ్ళు. వీపుని పడేవి కాల్చిన మేకులు.

—జల్లుకుంటోంది.

తెరలు తెరలుగా కమ్ముకున్న మబ్బులు వాడి సూదుల తెరని కిందకి జారవిడిచేయి. వరాండాలో పడుకున్న అతనిమీద కూడా సూదుల తెరని తెచ్చి పడేస్తోంది ఈదురుగాలి.

—సలి సంపేస్తోంది.

రివ్వున చలిగాలి. రివ్వురివ్వున చలిగాలి.

—యదివ గాలి యాడనించొస్తందో, పేనం తీసేత్తోంది.

కూలిపోయే ఇంట్లో, రాత్రివేళ చీకట్లో, ఒంటరిగా పడుకొన్న ఈ ఒక్క ముసలి పక్షిని చంపడానికి,

ఎంత శక్తిని కూడగట్టుకొని,

ఎక్కణ్నించి వస్తోందీ చలిగాలి?

ఎంతదూరంనుంచి వస్తోందీ దయలేని గాలి?

మంచుకొండలమీంచి, కొండలోయల్లోంచి, అటవీ ప్రాంతాలమీంచి, శీతల జలాలమీంచి, సూర్యుడు చూడని బీడు భూములమీంచి, ఘనీభవించిన చీకటి సముద్రాలమీంచి, వెలుతురుచొరని పాముల గుహల్లోంచి, శూలాల మొనలమీంచి, కత్తుల పదును మీంచి, ఉండే చలినంతా కూడగట్టుకొని, ఎన్నో దిక్కులనుంచి, ఎంతో దూరంనుంచి శర వేగంతో, శర సముదాయంలా వచ్చే ఈ దయలేని చలిగాలి,

ఎముకల్ని దూసుకుపోతోంది;

ప్రాణాల్ని తీసుకుపోతోంది.—

రాత్రంతా పడినది వర్షం.

ఉదయం ఉదయించినవాడు బాలార్కుడు.

కిటికీ తలుపులు తెరచినది పూర్ణచంద్ర నిభానన.

తలుపులు తెరచిన కిటికీదగ్గర నలిగిన తెల్ల చీరతో నిల్చున్న చంద్రముఖి, బద్ధకంగా వళ్లు విరుచుకొని, పడిపోయే ఎదటింటి వరాండావైపు చూసి, ఇంకా మంచంమీదే ఉన్న తనవానితో

"పాపం ఆ ముసలాడెవడో అక్కడెలా ముణుచుకు పడుకున్నాడో చూడండీ! రాత్రంతా ఎంత చలి వేసిందో ఏమో!" అంది.

"నా కూడా ఇంకా చలిగా ఉంది. ఇలా రా!" అని అతను శయ్యమీంచి పిల్చేడు.

"నే రాను" అంటూనే ఆమె అటువైపు వెళ్ళింది.

పడిపోయే పెంకుటింటి వరాండాలో "ముణుచుకు పడుకొన్న ముసలాణ్ణి" ధూళితో నిండిన, వలిగిన, చినిగిన, పేలికలవుతూన్న పాత దుప్పటీ సరిగా కప్పడంలేదు.

అతను కుళ్ళిన బూజుపట్టిన చేవలేని కర్రలా ఉన్నాడు. వర్షంలో తడిసిన కుళ్ళు చెత్తలా ఉన్నాడు. ముడతలు పడ్డానికూడా వీల్లేనంతగా ఎండిపోయింది అతని చర్మం. తలమాస్తే అంతా చిక్కులుపడ్డ బూజులా ఉంది. తలమీద ఉంది కాబట్టి జుత్తని అనుకోవాలి, గడ్డం ఎదగడానికూడా వీల్లేనంత నీరసంగా ఉంది అతనిముఖం. ఆ ముఖంలో ఎడమ కన్ను లేదు. వంగిన వింటిబద్ద అతని వీపు. మోచేతివరకూ వచ్చి తెగిపోయినది అతని ఎడమచేయి. అతని కుడికాలికి లేనిది పాదం, పాదం ఉండవలసినచోట ఉన్నది ధూళితో నిండిన ఒత్తుగా కట్టిన గుడ్డలకట్టు.

అతని తలకింద ఉన్నవి తడిసిన మాసినగుడ్డలు. అతని వంటికింద ఒక పాతగోనె.


అతని పక్కని ఉన్నవి; ఒక పాతకర్ర, తుప్పు పట్టిన రేకుడొక్కు, రెండు చుట్టపీకలు, ఒక తూట్లు పడ్డ మాసిన సంచీ.

ఆ సంచిలో ఏముందో ఏమిలేదో కనిపించడం లేదు.

బాగా పొద్దెక్కింది. తాటిచెట్ల సందుల్లోంచి వచ్చే సూర్యకిరణాలు కొద్దిగా అతనిమీద పడుతున్నాయి.

కాని, ఈ లోకంలో ప్రాణానికి కారకుడైన ఆ సూర్యుడి కిరణాలు అతనిమీద ఆ సమయంలో పడ్డం అర్థరహితంగా ఉంది.




ప్రతిదిన మలినములోని
క్రిములనుండి మీ ఆరోగ్యమును కాపాడుకొనండి
లైఫ్‌బాయ్ యొక్క
రక్షకమైన
నురుగుతో!
మీరెంత జాగ్రత్తగానున్నప్పటికి మలినములోని క్రిములనుండి ప్రతిదినము అంటురోగమును పొందుటకు అవకాశమున్నది. లైఫ్‌బాయ్ సబ్బుతో తరచు స్నానముచేసి మీ ఆరోగ్యమును కాపాడుకొనండి. దాని రక్షకమైన నురగ మలినములోని క్రిములను తరిమివేసి రోజంతా మిమ్ములను హాయిగానుంచును.
LIFEBUOY SOAP
లైఫ్‌బాయ్ సబ్బు
ప్రతిదిన క్రిములనుండి ప్రతిదిన రక్షణకు
L. 229-50 TL

మళ్ళీ పెళ్ళి

శ్రీ ఆకుంది నారాయణమూర్తి

1

"మా జీవితంలో నీవల్లే మాకు బాధ కల్గుతుందని ఏనాడూ ఊహించలేదు. కానీ కల్గింది!—అందుకు నువ్వే బాధ్యుడివి. ఆఖరికి నీ జీవితసౌఖ్యం ఓ పెద్దసమస్యగా తయారయింది మాకు. నీసౌఖ్యం గురించి మీ అమ్మ ఎంత బెంగ పెట్టుకుంటున్నదో తెలుసా?—బహుశా నీకు తెలిసుండదు!—ఇంతకీ మళ్ళీ పెళ్ళిచేసుకో నెందుకు నీకెందుకు ఇష్టంలేదో సరిగ్గా మాకు అర్థంకాకుండా ఉంది. నువ్వు తెలియజేస్తున్న కారణమేమంత సబబుగా లేదు. నీసౌఖ్యం గురించి మాకు విచారం లేకుండా ఉండాలనే ఉద్దేశ్యం నీకుంటే, మేం చెప్పినట్లు విని మళ్ళీ పెళ్లిచేసుకో!—ఆ 'సబ్ రిజిష్ట్రారు' గారు మళ్ళీ వచ్చేరు. "ఏమంటారు?" అనడిగేరు. వారిపిల్ల చాలా బాగుంటుంది. చదువుకుంది కొంతవరకూ! సాంప్రదాయకమయిన కుటుంబం!—ఏమంటావు?.. మాకు సంతోషం కలిగేటట్టుగానే సమాధానమిస్తావని ఆశ!—వెంటనే ఉత్తరం వ్రాయి. వీలుంటే నువ్వోసారి ఇక్కడికి రా." అని తండ్రి రాసిన ఉత్తరాన్ని శ్రీనివాసం ఓపికతో చదివి ఓ నిట్టూర్పు విడిచేడు.

—ఏమని సమాధానం వ్రాయడం?—అందులోకీ వాళ్లకి సంతోషం కలిగేలా ఎలా వ్రాయడం?—ఏమీ అర్థం కాలేదు శ్రీనివాసానికి!...

—నిజానికి శ్రీనివాసంలో వివాహవాంఛ చాలా వుంది!—ఆ వాంఛ తీరాలంటే భార్య అవసరం ఉంది. ఇక పోతే ఒక స్త్రీ సహచారిణిగా తన ఇంట్లో లేకపోవడం ఓ లోటుగానే కనిపించిం దతనికి. ఆ లోటు తీరాలంటే మళ్ళీ తను పెళ్ళి చేసుకోవాలి!—కానీ మళ్ళీ తను పెళ్లిచేసుకొని ఒక రిని ఇంట్లో పెట్టుకుంటే ఆ తరువాత మానసికంగా తను ఎంత బాధ పడవలసుంటుందో అనేదే అతని భయం!—ఆ భయమే ఆటంకమయింది. తను మళ్ళీ పెళ్ళిచేసుకో నెందుకు ఇష్టపడకపోవడంలో గల కారణాన్ని తలిదండ్రులకు ఎలా వ్యక్తం చేయడమనే ఆలోచనలో పడ్డాడు.

...దాంతోపాటు, ఆ మరదలుపిల్ల ఉషకూడా చచ్చిపోయుంటే తను తల్లిదండ్రుల వాంఛను కాదనకుండా మళ్ళీ పెళ్లిచేసుకొనేవాడు!—కానీ ఆపిల్ల ఇంకా బ్రతికేఉంది. ఆ మరదలయినా పెద్దపిల్లే అయుంటే ఆటంకం లేకపోయేది. కాని అది చాలా చిన్నపిల్ల, నాలుగేళ్ళ వయస్సుంటుంది!—తను తప్ప, ఇంకే దిక్కూ మొక్కూ లేదాపిల్లకి. ఆపిల్లని పెంచి పెద్దదాన్ని చేసి వివాహం చెయ్యవలసిన బాధ్యత తనమీదే ఉంది. ఏదో అవ్యక్తమయిన వాత్సల్యం ఆ పిల్లమీదేర్పడింది తనకి. ఆపిల్లకు బాధలు కలిగితే తను సహించలేడు. ఆ వాత్సల్యంలో ఆ ప్రభావం ఉంది!—

—ఆపిల్ల తల్లి చచ్చిపోయేముందు తను ఆమెకి చేసిన వాగ్దానాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నాడు...."ఉష గురించి మీరేం బెంగ పెట్టుకోకండి. ఆపిల్లకు నే బ్రతి

కుండగా ఏలోటూ రానివ్వను. కన్నుల్లో పెట్టుకొని కాపాడతాను" అని.

—"ఏమో నాయినా!—కొందరు పిల్లలూ, ఆయన... నే... బ్రతికుండగానే చచ్చిపోయేరు. ఇక ఇది......ఇక నువ్వే దానికి దిక్కు!...మాపేవా... ఆరెండో అల్లుడు రానే లేడు. దాన్నయినా పంపించ... లే...దు!—వాడం...లే!..." అని ఆయాసంతో అంటూ ఆనాడు బాధతో కళ్లు మూసుకుందా మాతృశ్రీ. ఆనాటి ఆ వాగ్దానాన్నీ దృశ్యాన్నీ మరచిపోలేదు శ్రీనివాసం. ఆదృశ్యం మళ్ళీ అప్పుడు అతని మానసికబింబంలో గోచరమయింది.

తన అత్తగారన్న ఆఖరి పలుకులబట్టి తన తోటల్లుడిమీద ఆమెకు మంచిభావం లేదని తేలింది. పైగా, ఏ పరిస్థితిలోనూ ఉష నక్కడకు పంపించొద్దనే భావం ఆ పలుకులలో ధ్వనించినట్టు ఊహించేడు. బాగా దెబ్బుంది తోటల్లుడికి. అయినా తన రెండో మరదలయిన సుభద్ర కక్కడ సుఖంలేదని అతనికి తెలుసు. స్వేచ్ఛలేని బ్రతుకు గడుపుతున్నదామె అని శ్రీనివాసానికి తెలుసు. ఇక అలాంటి పరిస్థితిలో అమాయకురాలయిన ఉషను అక్కడకు పంపించేస్తే సుఖంగా బ్రతికుంటుందా అని అతని అనుమానం?!—అంచేతే భార్య చచ్చిపోయేక తల్లీ, తండ్రీ, మిగతా బంధువర్గం అంతా కలసి—"ఇంకా ఆ లంపటం ఎందుకు? నువ్వు కన్నకూతురా ఏమన్నానా?—చక్కా ఆ ఉషను దాని రెండో అక్కయ్యదగ్గరకు పంపించేసి నువ్వు హాయిగా మళ్ళీ పెళ్ళిచేసుకో!" అని ఎంతచెప్తున్నా అలా చెయ్యలేదు శ్రీనివాసం. అలా పంపించేస్తే ఉష ఎన్నో బాధలకి గురయిపోతుందని అతని భయం!—

—అదీకాక, భార్య చచ్చిపోయేముందు అంది—"ఇక మా చెల్లెలుదగ్గరకీ ఉషను పంపించేస్తారు కా...బో...లు!" అని కన్నీళ్ళు కారుస్తూ.

..."అలామాత్రం చేయను" అన్నాడు శ్రీనివాసం. కానీ ఆమాట లామె సరిగ్గా వినకుండానే చచ్చిపోయింది, ఉషనో పెద్దసమస్యగా తయారుచేసి శ్రీనివాసానికి విడిచిపెట్టి. ఆనాటి ఆదృశ్యం మళ్ళీ అప్పుడు మనస్సులో గోచరమయిం దతనికి!—కళ్లు మూసుకొని కుర్చీలో కూలబడ్డాడు ఆలోచిస్తూ!—

—తనే మళ్లీ పెళ్ళిచేసుకున్నట్టయితే ఆవచ్చేది సవతిచెల్లెలయినఉషను అభిమానంతో చూస్తుందా?—వాత్సల్యంతో చేరదీస్తుందా?—తన తోబుట్టువులాగే చూస్తుందా?—దాన్ని బాధలు పెట్టకుండా ఉంటుందా?...అది సహజత్వానికి చాలా విరుద్ధం అనే సమాధానాన్ని పొందేడు శ్రీనివాసం. ఉష సుఖంగా ఉండాలీ అంటే తను మళ్ళీ పెళ్ళిచేసుకోకుండా ఉండడమే మంచిదనే అభిప్రాయాన్ని ఏర్పరచుకున్నాడు.

—ఉషమీద తనకు వాత్సల్యం లేకపోయున్నట్లయితే వాగ్దానాన్ని అవతలకునెట్టి ఉషను దాని రెండో అక్కయ్యదగ్గరకు పంపించేసుండే వాడు. కానీ బలీయమయిన వాత్సల్యం తన కేర్పడిపోయింది మరదలిమీద. ఇక వాత్సల్యం ఎన్నడూ తెగడానికి అవకాశంలేదు. ఆ బంధం అలాంటి బలీయమయినది!—

తల్లీ తండ్రీ లేని ఆపిల్లకు తనొక్కడే దిక్కు. ఆ పరిస్థితిలో తను సౌఖ్యంకోసం మళ్లీ పెళ్ళిచేసుకున్నట్టయితే, ఆ కాపరానికొచ్చే భార్యకీ తనకీ ఉషగురించి మానసికంగా పెరిగే మనోవికారాలు జీవితంలో వికృతపరిణామాలకి దారితియ్యకుండా ఉంటాయా?...ఊహుఁ!...

—ఎందుకొచ్చిన బాధ?!—పెళ్ళి చేసుకోవడం మానేస్తేనే సౌఖ్యంగా ఉంటుందనిపించింది శ్రీనివాసానికి.

కానీ ఒక్కొక్కప్పుడు శ్రీనివాసంలో మానసికావేశాలు బయటకు ఉబుకుతూ ఉండడంకద్దు!—కానీ ఉష సుఖం ఆలోచించేసరికి బలవంతాన అణగిపోయేవా ఆవేశాలు!—పెళ్ళి చేసుకోకూడదని అనుకొనేవాడు!—

—నిజానికి ఉషకి చాకిరీ చెయ్యడం కొంచెం బాధగానే ఉండేది శ్రీనివాసానికి. ఒళ్ళు కడగడం, తల దువ్వడం, బట్టలు తొడగడం ఇత్యాది పనులన్నీ ఓ పనిదానిలా ప్రతిదినం చెయ్యడం మొదట్లో కొంచెం కష్టంగానే ఉన్నా రానురాను అలవాటయిపోయింది. కాఫీ తిండీ అంతా హోటల్లోనే!—

—ఒక్క ఆఫీసు వేళల్లో తప్పిస్తే మిగతా వేళల్లో ఎప్పుడూ ఉషను తనదగ్గరే ఉంచుకొనే వాడు. ఆఫీసుటైములోమాత్రం అక్కడి కెదురుగానే ఉన్న ఓ ఎలిమెంటరీ స్కూలు హెడ్మాస్టరుగారికి ఉషను అప్పజెప్పేవాడు. ఆ హెడ్మాస్టరు జాగ్రత్తగా చూస్తాడో చూడడో అని శ్రీనివాసానికి చిన్న భయం ఉండేది. అంచేత అప్పుడప్పుడు చెపుతూ ఉండేవాడు—"జాగ్రత్తగా చూడండేం?! మీ పిల్లే అనుకోండి. మీ ఋణం తీర్చుకుంటా నెప్పుడయినా?" అని. "ఫరవాలేద"ని ఆ హెడ్మాస్టరు హామీ!—

కానీ ఆఫీసులో పనిచేస్తూ ఉన్నంతసేపూ దృష్టంతా ఉమమీదే ఉండేది. బళ్ళో పిల్లలెవరయినా అమాయికురాలయిన తన మరదలు పిల్లని కొడతారేమో!... అదొకవేళ పొరపాటున మాట్లాడితే ఆ మేష్టర్లు కసురుతారేమో!—అక్కడ అలా కూర్చోడంవల్ల ఉమ ఎంత బాధపడుతున్నదో!... ఈ రకమయిన ఆలోచనలు పనిచేస్తూ ఉన్నంతసేపూ వచ్చేవి. అంచేత ఖాళీ ఉన్నప్పుడల్లా ఆ స్కూలులోకెళ్ళి ఉమను ఎత్తుకొని అలా కాఫీ హొటలులోకో, మరెక్కడికో తీసుకెళ్లి ఏవో ఓటి కొనిస్తూ ఉండేవాడు.

—అలా అంత గారాబంతో తనదగ్గర పెరుగుతూ ఉన్న ఉమకి, తన సౌఖ్యంకోసం తను పెళ్ళి చేసుకొని దానికి బాధలు కల్గజేయడం సుతరామూ ఇష్టంలేకపోయిం దతనికి!......

...తమాషాకోమారు ఉమతో అన్నాడు—"నిన్ను బొంబాయి పంపించేస్తాను, మీ సుభద్రక్కయ్య దగ్గరికి!" అని.

"ఊహుఁ! వొద్దూ..." అని గునిసింది.

"లాభం లేదు పంపించేస్తా!" అన్నాడు.

"నే వెళ్ళనూ......" అంటూ బావురుమని ఏడుపు లంకించుకుంది.

"అచ్చే!—ఊరికే అన్నాను. ఏడవకమ్మా!—" అంటూ ఉమను గట్టిగా హృదయానికి కద్దుకున్నాడు.

—అప్పట్నించీ మరెప్పుడూ అలా అనలేదు శ్రీనివాసం!

...కానీ అతని తల్లీ తండ్రీ మాత్రం చాలాసార్లు అన్నారు—"దాన్ని దాని రెండో అక్కయ్య దగ్గరకి పంపించేసి, హాయిగా మళ్ళీ పెళ్ళి చేసుకోరా బాబూ?" అని.

"నే బ్రతికుండగా దాన్ని ఎక్కడికీ పంపించడం జరగదు!—దానికి పెళ్లయి అది అత్తారింటికెళ్లిపోయేవరకూ నేను పెళ్లి చేసుకోడం కూడా జరగదు." అని శ్రీనివాసం సమాధానం.

"అయితే అంతేనన్నమాట!?" అని తల్లిదండ్రుల బరువయిన వేడినిట్టూర్పు.

"మరి నన్ను బలవంతంచేసి బాధపెట్టకండి!" అని శ్రీనివాసం ఉవాచ.

చాలామంది మిత్రులుకూడా అతనికి నచ్చచెప్పబోయేరు!—"అయినా ఏమిటీ పంథా?—అర్థంలేని పంథా!...ఇప్పుడు మళ్లీపెళ్లి చేసుకోవే అందుకు నీ వయస్సేం మించిపోయిందా?—మహా ఉంటే ముప్పై ఏళ్లకు హెచ్చు వయస్సుండదు!—ఇకపోతే నీ మరదలు పిల్లకింకా ఓ అక్కయ్య బ్రతికే ఉందికదా!—అక్కడికి పంపించేయకూడదూ? ఒకవేళ పంపించకుండా నీ ఇంట్లోనే ఉంచుకుంటే మాత్రం ఏం కొంప మునిగిపోతుంది గనక?—ఆ కాపరానికొచ్చేది, నీ మరదలి పీక పిసికెయ్యదు!—అయినా పదేసి మంది పిల్లల్ని కన్నాక కూడా రెండో పెళ్ళి చేసుకున్న వాళ్లెంతమంది లేరు?!—అంచేత చక్కా మళ్ళీపెళ్ళి చేసుకో!"

"మీ అందరికీ ఓ నమస్కారం!—నేను మీకు సమాధానం సంతృప్తికరంగా ఇచ్చే పరిస్థితిలో లేను. ఇంతకీ నేను మళ్లీ పెళ్లి చేసుకోకుండా ఉన్నట్టయితే మీకేం బాధలేదనుకుంటా!" అని విసుగు, చిరాకులతో శ్రీనివాసం సమాధానం.

"మరి మాకేం బాధలే?!—కానీ నీతల్లికీ తండ్రికీ కన్న మమకారం అంటూ ఓటి నీమీదుంటుందని ఒప్పుకుంటావా?"

"ఉండొచ్చు!...కానీ నా కిష్టంలేకపోయినా పెళ్ళిచేసి వాళ్లేం సంతోషిస్తారో నా కర్థం కాలేదు."

"అసలు తల్లిదండ్రుల సంతోషాన్ని నువ్వు అర్థం చేసుకోలేదు. "మా రెండో అబ్బాయి, కోడలూ హాయిగా ఉంటున్నార"ని చెప్పుకుంటూ ఆనందించడమే వాళ్ళకి కావలిసినది!"

"వాళ్లకి నేనొక్కడినే కొడుకుని కాదు!—నాలా మరి ఆరుగురు కొడుకులున్నారు. వాళ్లంతా వాళ్ళదగ్గరే ఉన్నారు. ఇంకా ముగ్గురికి పెళ్ళికావలిసుంది. మా నాన్న బాగా ఆర్జించి ఉండడంచేత వేలకొద్దీ కట్నాలిస్తా మనుకుంటూ చాలామంది ఒస్తున్నారు. ఆ మిగిలిన వాళ్ళకు వైభవంగా పెళ్ళిచెయ్యకూడదూ?—మధ్య అక్కర్లేదో అంటున్న నాకెందుకు?—పెళ్ళిచేసుకుంటే మానసికంగా నేను పడేబాధ ఎవ్వరికీ తెలీదు!!—ఇకముందు నా వివాహం గురించి తప్పించి మిగతా విషయాలగురించి మాట్లాడమని ప్రార్థన:" అని శ్రీనివాసం తన ఉద్దేశ్యాన్ని తెలియజేసేడు మిత్రులకి. తమ కెందుకొచ్చిన బాధని ఊరుకున్నారు వాళ్లు.

—అలా తన అభిప్రాయాన్ని తల్లిదండ్రులకి, తన పెళ్లివిషయమై అడిగిన మిగతా వాళ్లకీ చాలాసార్లు

చెప్పేడు!—అయినా అవాళ తండ్రి మళ్ళీ తన అభిప్రాయాన్ని తెలియజేయమంటూ ఎందుకు లేఖ రాసేడో అర్థంకాలేదు. ఆ ఉత్తరానికి ఏమని సమాధానం వ్రాయడమా అని ఆ ఉత్తరం వేపు చూస్తూ ఆలోచిస్తూ ఉండగా ఉష అక్కడికి వచ్చి—"ఏమిటి చదువుతున్నావు బావా?" అనడిగింది.

"ఉత్తర మమ్మా!" అన్నాడు దగ్గరకు తీసుకుంటూ.

"ఏం ఉత్తరం బావా?" అని మరదలి ప్రశ్న.

ఏమని సమాధాన మివ్వడం?—"అది కాదు గానీ, నీకో అక్కయ్య కావాలా?" అనడిగేడు శ్రీనివాసం ఏమని సమాధాన మిస్తుందో చూద్దామని!

"అక్కయ్య మళ్ళీ వస్తుం దేమిటి?!"

"ఆ అక్కయ్య మరి రాదు. మరో క్రొత్త అక్కయ్య!"

"ఊఁ! కావాలి బావా. ఎప్పుడొస్తుం దేమిటి?- రవణక్కయ్యలాంటి దేనా?"

"ఊహుఁ!—అలాంటిది కాదు. క్రొత్తరకం అక్కయ్య!"

"నా కన్నీ ఇస్తుందా?—తీసుకురా బావా!- అక్కయ్యఉంటే ఎంతో బాగుంటుంది." అని గునిసింది ఉష.

—ఉష ముఖంలోకి చూసేడు శ్రీనివాసం!... కుళ్ళూ కపటంలేని ఆ లేతమనస్సు మరో అక్కయ్య కావాలంటున్నది!—కానీ ఆ వచ్చేది మాత్రం "ఈ చెల్లెలు ఈ ఇంట్లో ఉండడానికి వీల్లే"దంటుంది!—అదే వ్యత్యాసం !!...ఆ వ్యత్యాసాన్ని తనెందుకు నిర్వరచుకోవాలనుకున్నాడు.

"చూడు ఉషా!—అల్లా బల్లమీదున్న 'లెటర్ పేడ్' ఇలా తీసుకురా?" అని చెప్పేడు.

"అంటే ఏమిటి?" అని ఉష ప్రశ్న.

"తెల్లకాయితాల పుస్తకం ఉంది కదూ అది!- ఊఁ!—సరే, నేనే తెచ్చుకుంటాలే—" అంటూ తనే వెళ్ళి తెచ్చుకున్నాడు.

"ఏమిటి చేస్తావు బావా?" అని ఉష అడిగింది.

"ఏంలేదు; ఉత్తరం రాస్తా!—నువ్వు పోయి ఓ గడిసేపు ఆడుకో. ఈ ఉత్తరం రాసేయడం అయిపోయినవెంటనే నిన్ను సినీమాకి తీసుకెళతాను." అన్నాడు.

"ఏ సినీమాకి బావా?"

"ఏదో ఓ సినీమాకి!—పోనీ ఈలోగా పెరట్లో కెళ్ళి గోలెంలో నీళ్ళున్నాయి కదూ ముఖం కడిగేసుకోనిరా!" అన్నాడు.

"మరి సబ్బో?!"

"సబ్బులో వొద్దు!—నీఅంతట నువ్వు కడుక్కుంటే బురుగు కళ్ళల్లోకి వెళిపోతుంది."

ఉష పెరట్లో కెళ్ళిపోయింది చిన్న అంగ లేసుకుంటూ.

—ఏమని వ్రాయడం?—మళ్ళీ అదే సమస్య ఎదురయింది శ్రీనివాసానికి! తన నిశ్చయాన్ని అంత నిక్కచ్చిగా తెలియబరుస్తే వాళ్ళెంతగా బాధపడతారో!—కన్న మమకారం మరలాంటిది!—అం తెందుకు?- ఉషను తను కన్నాడా ఏమన్నానా?—కానీ వాత్సల్య ప్రభావంవల్ల దాని సౌఖ్యంకోసం అంతలా బాధపడుతున్నాడు తను!—మరి తనని కన్న తల్లిదండ్రులకు తనమీద అంతకన్నా విశిష్టమయిన వాత్సల్యం ఉండడంలో అసహజత్వం ఉందా?—లేదు!—అసలు తనంత దూరప్రదేశంలో ఉద్యోగం చెయ్యడంకూడా కొంత బాధగానే ఉంది వాళ్ళకి. అసలు తనను ఉద్యోగం చెయ్యొద్దన్నారు. ఆ పల్లెగ్రామంలోనే ఉంటూ భూముల్ని చూడమన్నారు. కానీ ఏదో ఓ పెద్ద పట్టణంలో ఉంటూ ఉద్యోగం చెయ్యాలనే అభిలాష తన కుండడంచేత తల్లిదండ్రులకు చాలా దూరంలో కుదురుకున్నాడు!—అతనికి తెలుసు తనంత దూర ప్రదేశంలో ఉండి ఉద్యోగం చెయ్యడం తల్లిదండ్రులకు సుతరామూ ఇష్టంలేదని!—అందులోకీ భార్య చచ్చిపోయేక తనొక్కడూ మరదలుపిల్లతో సహా హోటలులో తిండితింటూ కాలక్షేపం చెయ్యడం వాళ్ళకి మరి ఇష్టంలేదని తెలుసు!- అందుకే ఉద్యోగం మానేసివచ్చెయ్యమని చాలాసార్లు రాసేరు. నిజానికి తను ఉద్యోగంచేసి వాళ్ళని పోషించవలసిన అవసరం రవ్వంతయినా లేదు. తండ్రి చాలా డబ్బు ఆర్జించేరు. ఆ ధనాన్ని జాగ్రత్తగా చూసుకుంటే చాలు!—కానీ తను బి. ఏ. వరకూ చదివినందుకు కొన్నాళ్ళపాటయినా ఏ పెద్దపట్టణంలోనయినా ఉద్యోగంచేస్తూ జీవితాన్ని గడపాలనే అభిలాష ఉండడంచేత ఉద్యోగంలో ప్రవేశించాడు.

—అందులోకీ అప్పట్లో తను ఉద్యోగం మానేసి ఆ పల్లెటూళ్లో మరదలు పిల్లతో సహా తల్లి దండ్రులదగ్గరుండడం బొత్తిగా తెలివితక్కువ పనను కున్నాడు. ఉషతోపాటు తనక్కడుండడం అంత బాగా మరొకటుండ దనుకున్నాడు!—ఇక వాళ్లెవ రయినా తనదగ్గరకొచ్చి ఆ పరిస్థితిలో మకాం వేసినా బాధే!—"అవసరమయితే మీఅమ్మ నెక్కడికి పంపి స్తాను. అదీ వెళతానంటున్నది!" అని తండ్రో మాటు లేఖలో వ్రాసేడు. వెంటనే జవాబిచ్చేసేడు. "అమ్మకీ వాతావరణం ఏమీ సరిపడదు. దాని ఆచా రానికి ఇక్కడ బొత్తిగా సరిపడదు. అందుచేత పంపిం చొద్దు. ఇక్కడ నేను కులాసాగానే కాలక్షేపం చేస్తున్నాను" అని. అతనికి తెలుసు తన తల్లి గానీవస్తే వచ్చేబాధలు!—ఆమెకి, తను, మరదలిపిల్లని పోషిం చడం బొత్తిగా ఇష్టంలేదు పైగా ఇక రోజూ మళ్ళీ పెళ్ళిచేసుకోమని తనకి చెపుతూ గొడవ చేస్తుందని భయం!—ఒకవేళ కొంపతీసి అక్కడినుంచి తనవా ళ్లెవరేనావచ్చి మకాంవేస్తారేమో అనే భయంచేత, "ఇక్కడ నాకు తిండికి ఏ ఇబ్బందీ లేదు. హాయిగా ఉంది. ప్రస్తుతం ఏ చీకూ చింతా లేదు. నాగురించి చాకిరీకి అక్కణ్ణుంచి ఎవరూ రావలిసే అవసరం లేదు" అని ప్రతీ ఉత్తరంలోనూ చివర రాస్తూ ఉండేవాడు.

—ఆవాళకూడా ఆ వాక్యాలతోనే ఉత్తరం ప్రారంభిస్తూ—"నేను మళ్లీ పెళ్లి చేసుకుంటాను. కానీ ఇప్పట్లో కాదు. చేసుకోనేముందు తెలియ జేస్తాను" అనే విషయాలు చేర్చి ఉత్తరం కవరులో పెట్టి అంటించేసేడు.

—అంతట్లో ఉష వచ్చిందక్కడికి. "చూడు బావా!—గౌను నాఅంతట నేనే తొడుక్కున్నాను. కానీ జేబులోపల కెళిపోయిందిబావా!" అంది.

ఉషవేపు చూసేడు శ్రీనివాసం. పక్కున నవ్వేడు. "తిరగేసి తొడుక్కున్నావమ్మా!—నే సరిగ్గా తొడుగుతానుండు" అంటూ ఆ గౌనువిప్పి, పెట్లోంచి మరోగౌను తీసి తొడిగేడు.

—ఆతరువాత సినీమాకు ప్రయాణమయేరు ఉషతో సహా!

2

"ఇక్కడే ఉండమ్మా! — ఇల్లీదుకాణందగ్గర కిల్లీలుతీసుకొని వస్తాను" అని ఉషతో చెప్పి, దాన్ని ఆ గేటుదగ్గర దింపి ఆ ప్రక్కనే నాలుగు గజాల దూరంలోఉన్న కిల్లీల దుకాణందగ్గరకెళ్లేడు శ్రీని వాసం.

అతను కిల్లీలుతీసుకొని తిరిగొచ్చేసరికి, ఉషను ఓస్త్రీ ఎత్తుకోనుండడం చూసేడు. "మాబావ!—" అని శ్రీనివాసాన్ని వ్రేలితో చూపుతూ పరిచయం చేసిందామెకు ఉష.

"మరి మీఅక్కో?!" అనడిగిందాస్త్రీ ఉషను.

"లేదు" అనంది ఉష.

"ఏమయింది?" మళ్ళీ ఆస్త్రీ ప్రశ్న.

"కళ్ళలమీద పెట్టి ఎక్కడికో తీసుకెళిపోయేరు!" అని ఉష సమాధానం.

"పాపం!"అని సానుభూతి వ్యక్తంచేసిందామె.

అంతలా సానుభూతిని తెలియజేసిన ఆస్త్రీ ఎవరా అని ధైర్యంగా ఆమెముఖంలోకి చూసేడు శ్రీనివాసం. ఆమెకూడా శ్రీనివాసంవేపోమారు చూసి ముఖం మళ్లీ ఉషకేసి త్రిప్పేసి..."నేను నీకే మవుతానో తెలుసా?" అనడిగింది.

"తెలీదు!" అంది ఉష.

"అక్కయ్య నవుతాను!" అనందామె.

"ఆకస్మాత్తుగా అలా బంధువొకర్తె తటస్థ పడుతుందనుకోలేదు శ్రీనివాసం!..."దయుంచిపిల్లను దించేస్తారా? హాలులోకి పోవాలి." అన్నాడు.

పిల్లను దించడం మానేసి—"ఏ క్లాసు కెళు తున్నారేమిటి?" అ నడిగిం దామె.

—అంత అపరిచితురాలు అంత చనువుగా ఎలా తనని అడిగగలిగిందో అర్థంకాలే దతనికి— "ఫస్టుక్లాసులోకి!" అని సమాధానమిచ్చేడు.

"నేనూ ఆ క్లాసుకే టిక్కట్టు కొన్నాను. ఏమిటో ఈ పిల్లని చూస్తూఉంటే చచ్చిపోయిన మా చెల్లెలు జ్ఞాపకానికొస్తున్నది!—సరే పదండి. ఒక దగ్గరే కూర్చుందాం" అంది.

హాలులోపలికి వెళ్లేరు. మధ్య కుర్చీలో ఉష, ఇటూ అటూ ఆ ఇద్దరూ కూర్చున్నారు. ఓ జీడిపప్పు పొట్లాం కొని ఉష కిచ్చిందామె!...

...అప్పటికింకా సినీమా ప్రారంభించలేదు. "సినీమా బాగుంటుందేమిటి?" అని శ్రీనివాసాన్ని అడిగిం దామె.

"బాగుంటుం దన్నాడు ముక్తసరిగా

"మీ రప్పుడే చూసేరేమిటి?" అ నడిగిందామె.

"లేదు. కానీ ఇవాళ బాగుంటుంది. రేపేమో?!" అని సమాధానమిచ్చేడు.

"ఔను!—ఇవాళ తప్పకుండా బాగుంటుంది. కుదిరిందలా!—" ఆమె ఏం తీసిపోలేదు.

"ఏం లాభం?" అని గొణిగేడు.

"ఎందుకుండదు?" అని ఆమె ప్రశ్నార్థకంగా అతని వేపు చూసింది.

ఆ సంభాషణనుబట్టి ఆమె వైఖరిని కొంత వరకూ పోల్చేసేడు!—ఆమె తప్పక ఎవరో వేశ్య అయుంటుందని అనుకున్నాడు. అతనిలో ఏవేవో అవ్యక్తమయిన ఆవేశాలు తలెత్తేయి. కొంతసే పలా మౌనంగా కూర్చున్నాడు. మళ్ళీ ఆమే మాట ల్లోకి దింపింది—

—"పాపం!—మీ ఆవిడ పోయి ఎన్నాళ్లయిం దేమిటి?"

"ఏడాది పైచిలుకయింది."

"మళ్ళీ పెళ్ళి చేసుకోలేదూ?"

"లేదు!"

"ఏం?—"

"ఇష్టం లేక!"

"నిజమే లెండి. ఇష్టం లేకుండా పెళ్ళి చేసుకుంటే చాలా బాధ పడవలసొస్తుంది."

"కానీ మావాళ్లు మళ్ళీ పెళ్ళి చేసుకోమని చాలా బాధ పెడుతున్నారు!"

"అందుకు మీ అభ్యంతరానికి కారణం ఉందా?"

"ఈ మరదలుపిల్లే కారణం!—నేను తప్ప ఈ పిల్లకు ఇంకే దిక్కూ మొక్కూ లేదు. అదీకాక ఓ కూతురుమీద ఉండే ప్రేమకన్నా బలీయమయిన ప్రేమ ఈ పిల్లమీద నాకుంది. ఈ పిల్లే కారణం మళ్లీ పెళ్ళి చేసుకోనేందుకు నాకిష్టం లేకపోడానికి!"

"అయితే ఈ పిల్లకు అంత సంరక్షణా మీరే నన్నమాట!—లేక చాకిరీ చేసేటందుకు మీవాళ్లెవ రయినా ఇంట్లో ఉన్నారా?"

"మే మిద్దరమే ఉన్నాము. 'నా' అనేవాళ్ళు నాకు చాలామందున్నారు. రమ్మంటే 'చాకిరీ' అనే మిషమీద చాలామంది ఊడిపడతారు. కానీ ప్రస్తుతానికి ఎవ్వరి బాధా లేదు!—మేమిద్దరం హోటల్లో భోంచేస్తూ సుఖంగా ఉంటున్నాం!"

"మీ రిక్కడ ఏం పని చేస్తున్నారు?"

"ఏం పని లెద్దురూ?—అంతా కలిపి ఓ రెండు వందల రూపాయలు కూడా రావు!" అన్నాడు.

"ఔను గానీ, మీరు ఈ పిల్లని కూడా మీతో పాటు ఆఫీసుకు తీసుకెళిపోతూ ఉంటారా రోజూను?"

"అదెలా వీలవుతుంది?—అక్కడికి దగ్గరగా నే ఉన్న స్కూలులో ఉంచుతూ ఉంటాను."

"పోనీ ఇకనుంచీ మా ఇంట్లో ఉంచకూడదూ?—నా కెవ్వరూ లేరు. ఓ తల్లి మాత్రం ఉంది!—అంతే!...ఈపిల్లని నా చెల్లెలులా నే భావించి జాగ్రత్తగా చూస్తాను." అందామె ఉషముఖంలోకి చూస్తూ.

—ఆమె ఎవరో అంతవరకూ తెలీ నే తెలీదు తనకి. అప్పటికయినా సరిగ్గా తెలీదు. అంత అపరిచితురాలు అలా ఉషను ఆమె ఇంట్లో ఉంచమని కోరడంలో ఏదో అంతర్యం ఉంటుం దనుకున్నాడు శ్రీనివాసం!—అతనోలా ఊహించేడు!...ఆమె ఓ అపరిచితయుండీకూడా సిగ్గూబిడియం లేకుండా పరాయి మొగవాడయిన తనతో అంత చనువుగా మాట్లాడుతూ ఉండడంవల్ల ఆమె ఓ క్రొత్తరకం వేశ్య అయుంటుందని భావించేడు. తన మరదలుపిల్లను అలా ఇంటిదగ్గర అట్టేపెట్టుకొని తనను మెల్లిగా వశపరచుకోవాలని ఆమె ప్రయత్నం అయుంటుం దనుకున్నాడు.

—"ఏమిటలా ఆలోచిస్తున్నార"ని అడిగిందామె.

అంతట్లో అకస్మాత్తుగా లైట్లు ఆరిపోయేయి!-తెరమీద బొమ్మ పడలేదు. హాలులోని జనంలో కలకలం ఎక్కువయింది.

"ఏమలా ఆరిపోయేయి?" అని ఆమె నడిగేడు శ్రీనివాసం.

ఆమె సమాధానం ఇవ్వకముందే—"ఫ్యూజులు కాలిపోయేయి!" అన్నాడు ఒకడు ఓగొప్పవిషయం "రిసెర్చి" చేసినవాడిలా.

"బావా ఏమిటి కాలిపోయేయి?" అనడిగింది ఉష.

"వేడెక్కువయి తీగలు కాలిపోయేయమ్మా!" అని చెప్పేడు శ్రీనివాసం.

"అయితే మరి దీపాలు వెలగవ్వూ?" అనడిగింది ఉమ.

"వాళ్లు బాగుచేసేక వెలుగుతాయి." అన్నాడు.

ఉమ మరేం మాట్లాడలేదు. కొంతసేపయింది.

"ఏమండీ ఎందుకొచ్చిన బాధ?!—పోదామా?" అనడిగిందామె శ్రీనివాసాన్ని.

"ఇంతకీ మనం సినీమా చూడ్డానికి కదూ వచ్చేం!—అయిపోయేక పోదాం!" అన్నాడు.

"సరే మీ యిష్టం!—" అందామె. కొంతసేపూరుకొని—"మీ ఇల్లెక్కడ?" అనడిగింది.

"చాలా దూరం. ఇక్కడికి సుమారు రెండున్నర మైళ్ళ పైచిలుకుంటుంది."

"ఈరాత్రి తిరిగి అంతదూరం వెళ్లడం ఎందుకు? మాయింటికే కొన్నేయగూడదూ?—ఇక్కడికి దగ్గరే మా ఇల్లు. మంచి సదుపాయంగా ఉంటుంది." అనంది.

'ఔను నిజమే!—సానింట్లో సదుపాయం లేకుండానా?' అని మనస్సులో అనుకున్నాడు. ఎందుకో అతని నరాలుప్పొంగేయి. కొంతకాలముయి అణగియున్న మానసికావేశం పైమెట్టుకెక్కింది!.. మనస్సులో "తప్పేం?" అని ప్రశ్నించుకున్నాడు. ఇక తను మళ్ళీ పెళ్లిచేసుకోడం అన్నది ఎలానూ జరగదు. అలాంటప్పుడు తాత్కాలికంగా పొంగే ఆవేశాన్ని ఆ రకంగా పోనిస్తే తప్పేం?!-తన ప్రయోజనం తీరిపోతుందన్నమాట!—ఇక మిగతా ప్రయోజనాలు తీరకపోయినా నష్టం లేదు తనకి. కేవలం ఆ మిగతా ప్రయోజనాలకోసమనే తను మళ్ళీ పెళ్లిచేసుకున్నట్టయితే తను ఎంతో వాత్సల్యంతో చూస్తూ ఉన్న ఉమనుగురించి తనకు బాధ కలగడం ఖాయమని ఏనాడో నిశ్చయించుకున్నాడు!—అంచేత తను మళ్ళీ పెళ్లిచేసుకోడమనేది జరగనే జరగదు!—

...ఇక ఆవేశాన్ని మరో రకంగా అనుభవించవచ్చు!—ఇలాగ మరోదారిలో సౌఖ్యాలను పొందడంలో దోషం లేదనిపించిందప్పట్లో అతనికి. తెలవని తలంపుగా అలాంటివ్యక్తికూడా తన ప్రక్కని ఆనాడు తటస్థించడం మంచిదే అనిపించింది. ఇంతకీ తన అభిప్రాయం సరిఅయినదేనా, అనే అనుమానం కల్గిందతనికి! ఆలోచనలో పడ్డాడు—

"ఏమిటంత సుదీర్ఘంగా ఆలోచిస్తున్నారు. మా ఇంటికి రావడానికి అనుమానిస్తున్నారా?" అనడిగిందామె.

"అబ్బే!...లేదు. లోకానికి..." అని శ్రీనివాసం అంటూ ఉండగానే—

"...ఆఁ!—లోకం!...నే నెప్పుడూ లోకానికి దడియను!" అందామె.

"నిజమే కావొచ్చు. కానీ నా పరిస్థితి వేరు. ఇంతవరకూ గౌరవంగా బ్రతుకుతున్నాను."

"ఇకముందూ గౌరవంగానే బ్రతుకుదురుగాని! నేనూ గౌరవనీయ కుటుంబానికి చెందినదానినే!—ఇంతకీ ఈ పిల్లనీ మిమ్మల్నీ చూస్తావుంటే పూర్వకథలు జ్ఞప్తికొస్తున్నాయి. అందుకే మిమ్మల్ని ఈ రాత్రికి మా ఇంటికి రావలసిందని కోరుతున్నాను."

బలే 'స్టంటు' కొట్టిందనుకున్నాడు. "సరే వస్తాను." అన్నాడు.

...అంతట్లో మళ్లీ లైట్లు వెలిగేయి. అనుకోకుండా ఆమె ముఖంవేపు చూసేడు శ్రీనివాసం. చిరునవ్వుతో ఆకర్షించింది. అందంగానే అగుపించింది. ఏదో ఆకర్షణశక్తి ఆమె ముఖంలో ఉంది. బలీయమయిన ఆవేశం అతనిలో కలిగింది. మళ్లీ ఆమె ముఖంవేపు చూసేడు. నవ్విందామె మెల్లగా!...

సినీమా ప్రారంభమయింది.

శ్రీనివాసానికి దృష్టి తెరమీద లేదు!—ఏదో చిన్నభయం పట్టుకుంది. జీవితంలో అంతకుముందెప్పుడూ చెయ్యని పని చెయ్యబోతున్నాడు. ఎవరేమనుకుంటారో?!...విద్యార్థిదశలో ఆడపిల్లలని చూసేటప్పుడు అప్పుడప్పుడు వెక్కిరించేవాడు—ప్రేమగీతాలు పాడేవాడు—వాళ్లని తనవేపు ఆకర్షించుకోవాలని రకరకాల ప్రయత్నాలు చేసేవాడు—వాళ్లతో మాట్లాడాలని ఉబలాటపడేవాడు. అదంతా ఓ తమాషా అయిన దశ!—అప్పుడయినా శీలం చెడకొట్టుకోలేదు. కానీ ఆనాడిక తన శీలం చెడిపోతుంది!—ఏం చెయ్యడం మరి?!—ఆ పరిస్థితి అలాంటిది!...భార్య అంటూ ఉంటే తను అలాంటి పని చేసే అందుకు తలపెడతాడా?—ఆహాఁ!...

ఏదో యాంత్రికంగా తెరవేపు చూస్తూ అప్పుడప్పుడు ఆమె ముఖంలోకి చూస్తూ కూర్చున్నాడు. సినీమా ప్రారంభం అయిన ఓ ఐదు నిముషాల్లోనే ఉమ శ్రీనివాసం వొళ్లో నిద్రపోయింది హాయిగా.

కొంతసేపయేక అందామె—"మీ కెందుకా శ్రమ?!—నేనే వొళ్లో పడుకోబెట్టుకుంటాను పిల్లను." అని.

"ఆఁ!—ఫరవాలేదు లెండి!" అన్నాడు శ్రీనివాసం.

"కానీ ఓ ఆడదాని వొళ్లో నిద్రపోయే అంత సుఖంగా పురుషుని వొళ్ళో నిద్రపోలేరు పిల్లలు?"

"వాత్సల్యం అంటూ ఓటున్నప్పటిమాట లెండది!" అన్నాడు.

—తమ సంభాషణ ప్రక్కనున్న వాళ్ళకి కొంచెం చీదరింపుగా ఉన్నట్లు గమనించేడు శ్రీనివాసం!—"మన సంభాషణ ప్రక్కనున్న వాళ్ళకి కొంచెం బాధగా ఉంటుంది." అన్నాడు.

"అది నిజమే లెండి!... కానీ సినీమాగురించి వాళ్ళూ సంభాషిస్తున్నారు. ప్రస్తుతం వాళ్ళ సంభాషణ మనకీ బాధగానే ఉందికదూ?—ఏం చేస్తాం?—కొన్ని పరిస్థితులలో ఒకళ్లు చేసేపని ఇంకొకళ్లకి బాధగా ఉంటుంది!—అది సహజం." అందామె.

ఇకామెతో అట్టే మాట్లాడితే చాలా గొడవని ఊరుకున్నాడు.

'ఇంట్రవెల్' ఇచ్చేరు. ఉష నిద్రలోంచి లేచింది. మూడు కలర్సుకి ఆర్డరు చేసేడు. ఉష గురించి ప్రత్యేకించి జీడిపప్పు పొట్లం కొన్నాడు. కలర్సు త్రాగడం పూర్తయింది. ఉష జీడిపప్పు తింటూ ఆమె వొళ్ళో కూర్చొంది.

మళ్ళీ సినిమా ప్రారంభం అయింది!—

—కొంతసేపు తెరవేపు చూస్తూ మౌనంగా కూర్చున్నారు. అలా ఉండుండి సినీమాగురించి విమర్శ ప్రారంభించిందామె!—"చూసేరా?!—మన తెనుగుసినీమాలలో ఉన్న గొడవే ఇది! ..నాయకుడిపాత్రను మహోత్కృష్టంగా చిత్రిస్తారు. వాడిని మహా ఉత్తముడిగా సృష్టిస్తారు!—అలాంటి నాయకులు సహజంగా ఉంటారా అని?"

"ఏమో ఉంటే ఉండొచ్చు!"

"కవి సృష్టించగలడేమోగానీ, దేవుడుమాత్రం సృష్టించలేడు!" అందామె.

—మరేం మాట్లాడలేదు శ్రీనివాసం. ఉషకి మళ్లీ నిద్ర వచ్చేసింది. ఆమె వొళ్లోనే పడుక్కుంది.

సినీమా అయిపోయింది. రిక్షా మాట్లాడిందామె. ఇద్దరూ రిక్షాలో కెక్కేరు. ఉష ఇంకా ఆమె భుజం మీద ఆనుకొని నిద్రపోతూనే ఉంది. 'మళ్లీ ఎన్నాళ్లకి స్త్రీస్పర్శ' అనుకున్నాడు. సైడు లైట్ల కాంతిలో ఆమె ముఖంలోకి నవ్వుతూ చూసేడు. చిరునవ్వు తొణికిసలాడిందామెముఖంలో!—ఆనవ్వు అతణ్ణి ఉత్తేజితుణ్ణి చేసింది.

"మీ పేరు?" అనడిగిందామె.

"శ్రీనివాసం."

"ఇంతకీ నా పేరేమిటో తెలుసుకున్నారు కాదు మీరు!... నా పేరు రాణి!—ఏం... బాగలేదూ?"

"ఓ!—అమోఘంగా ఉంది!" అన్నాడు.

"వయం!—అఘోరించినట్టుందనలేదు!—సరే గానీ బహుశా మీరింకా భోంచేసుంటారు! అల్లా హోటల్లో భోంచేసేస్తే బాగుంటుంది" అందామె.

"నిజమే!—బాగా జ్ఞాపకానికి తెచ్చేరు. సాయంత్రం సినీమాకు వచ్చేముందు ముస్తుగా టిఫిన్ తిని రావడంచేత ఆకలెయ్యలేదు. పాపం పిల్లకి మర్నాత్రప్పుడు ఆకలేస్తుంది!—కొద్దిగా భోజనం చేసెయ్యాలి." అన్నాడు.

"అయితే మస్తుగా భోంచెయ్యరన్నమాట?!"

"ఏమంతగా ఆకలెయ్యలేదు ఇప్పటిమట్టుకీ."

"అలా అయితే డబ్బులు దండగన్నమాట!—డబ్బులిచ్చుకొనికూడా కొద్దిగా తినొచ్చెయ్యడమేమిటి?—నామాట విని మా ఇంటిదగ్గరే భోంచేసేయండి. మరేం ఫరవాలేదు!"

"అలా కుదరదు."

"కుదురుతుంది. ఇంతకీ మీరు శాకాహారులా మాంసాహారులా?"

"శాకాహారులమే!"

"అయితే మరీ బేషుగ్గా కుదురుతుంది. నిరభ్యంతరంగా భోంచెయ్యొచ్చు!"

"ఔనుగానీ నేనెవడినో మీ కింతవరకూ తెలీదుకదూ?"

—"అంచేత ఇంత బహుమానం దేనికనికదూ మీరడిగేది?—అదేమిటో గానీ ఈ పిల్లనీ మిమ్మల్నీ చూస్తూఉంటే నాకదోలాగుంది. లేకపోతే మిమ్మల్నీ రకంగా కోరవలసే అవసరం నాకేమిటి?—"

శ్రీనివాసం మనస్సులో అనుకున్నాడు; అసలు సిసలయిన వేశ్యేమో అని!—

అంతట్లో "ఆపు రిక్షా" అందామె. రిక్షా ఆగింది. "ఈ మేడ ఇల్లే మాది. దిగండి" అంటూ

ఉషను భుజంమీద ఉంచుకొని దిగిందామె. శ్రీనివాసం రెండో ప్రక్కనుంచి దిగేడు.

తలుపు కొట్టిందామె. ఎవ్వరూ పలకలేదు. మళ్ళీ కొట్టింది. తలుపు తెరిచి అక్కడ నిలబడ్డాడో పన్నెండేళ్ల పల్లెటిఅబ్బాయి. శ్రీనివాసాన్నీ ఉషనూ చూసి, "తావ్...తె......తావ్!" అంటూ ఎవరు వీరని సంజ్ఞలుచేస్తూ అడిగేడు వాడు.

ప్రక్క గదిలో మంచంమీద పరుపు వెయ్యమని సంజ్ఞచేసిందామె. వెళ్ళిపోయేడా మూగాడు.

స్విచ్ ఆన్ చేసింది. "చూసేరా ఆ పైపు!—అక్కడ బిందెలో నీళ్లున్నాయి. ఆ ప్రక్కనే ఉన్న అరుగుమీద సబ్బుంది. ముఖం కాళ్ళూ చేతులూ కడుక్కోండి" అందామె.

శ్రీనివాసం ఇల్లంతా కలయజూసేడు ఓమారు. లోపల గదిలోంచి దగ్గు వినిపించింది. "ఎవరది?" అనడిగేడు.

"మా అమ్మ!—సరేగానీ మీరు కాళ్ళూ అవీ కడుక్కోండి." అని చెప్పి, ఉషను ఆ ప్రక్క గదిలోకి తీసుకెళ్ళి పరుపుమీద పడుక్కోబెట్టింది.

టేబిలు తుడిచి ప్లేట్లు వేసింది.

—ఆవాళ చాలా చక్కని భోజనం దొరికింది శ్రీనివాసానికి. అన్నం లేదుగానీ కమ్మని "స్వీట్సు", కొద్దిగా "హాటూ", మంచి చిక్కని పాలూనూ!—ఆతరువాత ఉషను లేపి కొంచెం స్వీట్సు ఇచ్చింది తినమని. ఆ కొద్దిపాటిసేపులోనూ రాధంటే ఏదో మంచి అభిప్రాయం ఏర్పడింది ఉషకు!—చనువుగా మాట్లాడడానికి ఇంకా ధైర్యం రాలేదు గానీ, ఆమె తననేమీ బాధించేరకంమనిషి కాదనే ధైర్యం మాత్రం ఏర్పడిందా లేత మనస్సులో.

—ఓ గ్లాసుడు పాలిచ్చి ఉషను పడుక్కోబెట్టేసింది గ్రామఫోను రికార్డులు పెడ్తూ. ఓ రెండు మూడు రికార్డులు వినేసరికే ఉషకి బాగా నిద్ర వచ్చేసింది.

రాధవ్యవహారం శ్రీనివాసానికేం అర్థం కాలేదు!—ఆఖరికి...నిద్ర వస్తున్నాది" అన్నాడు.

"అదుగో మీ మరదలుపిల్ల ప్రక్కనే మంచం ఉందికదూ; అందిమీద పడుక్కోండి. నేను మేడమీదికి పోయి పడుక్కుంటాను." అందామె.

ఆమె వేశ్య కాదేమో అనే అనుమానం తట్టిం దతనికి!...ఏమయినా బాగా తెలుసుకోవాలని..."ఇక్కడ గాలి తగలదేమో!—మేమూ మేడమీదే అయితే బాగుంటుంది!" అన్నాడు.

"మీ ఇష్టం!—అక్కడి మంచంమీద పడుక్కోండి మీరు. మీకు సాయంగా మూగాడుంటాడు. నేనూ మీ మరదలూ ఇక్కడ పడుక్కుంటాము!" అనంది.

ఏదో భయం, నిస్పృహాలతో మేడమీది కెక్కేడు శ్రీనివాసం.

—అక్కడ మూగాడున్నాడు. శ్రీనివాసానికి ప్రక్క చూపించేడు వాడు. ప్రక్కమీద నడుం వాల్చేడు. "మంచినీళ్లు కావాలా?" అనే భావంలో సంజ్ఞచేసేడు.

— అక్కర్లేదనే భావంతో తలూచేడు అడ్డంగా. మూగాడు ఆ ముందు వరండాలో పడుక్కున్నాడు.

శ్రీనివాసానికి మరి ఆ రాత్రి నిద్దరపట్టలేదు. ఇంతకీ ఆమె వేశ్యనా అని అతని ఆలోచన. వేశ్య అయితే ఉద్దేశాన్ని తేల్చివెయ్యదూ? ఏమో!—మూగాడి చేతికి డబ్బిచ్చి క్రిందికి పంపించే వరకూ కదలిరాదేమో!—కానీ భయంవేసిం దతనికి. స్త్రీ హృదయం చాలా లోతయినదని అతనికి తెలుసు!—అదీకాక అంతవరకూ అతని జీవితంలో అలాంటి సంఘటన ఏర్పడలేదు ఏదో అవ్యక్తమయిన బాధ పట్టుకుం దతనికి.

—తనో రకంగా ఊహించేడు. కానీ అలా జరగలేదు. అందుకే అతని కంత బాధ పట్టుకుంది!—ఆ బాధతోపాటు ఆమెమీది కోపమూ జుగుప్సా జనించేయి!—తననుకున్నట్టే జరుగుతే చాలా బాగుండిపోయేది!—ఎంత వేగిరం ఆ ఇంట్లోంచి పోతే అంత బాగుంటుందని అనుకున్నాడు.

ఏదో బాధతోనే గడిపే డారాత్రి!—ప్రతీ దినం కన్నా వేగిరమే లేచిపోయి కాలకృత్యాలు తీర్చుకున్నాడు.

—అప్పటికి పూర్తిగా తెల్లారింది. ఉష నెత్తుకొని రాధ మేడమీదికొచ్చి—"అదుగో మీ బావ!—ఎటో వెళిపోయే రనుకున్నావు కదూ?" అని మంచంమీద కూర్చున్న శ్రీనివాసాన్ని ఉషకు చూపెట్టి, "ఎంతసేపయి లేచేరేమిటి?" అని శ్రీనివాసాన్ని అడిగిందామె.

"చాలా సేపయింది. స్థలం మారడంచేత నిద్దర

పట్టలేదు. అప్పుడే కాలకృత్యాలు కూడా తీర్చుకున్నాను. ఇక పోవాలింటికి!" అన్నాడు.

"వెళ్లొచ్చు! ఏం?—ఇంటిదగ్గ రెవరయినా మీకోసం కనిపెట్టుకొ నుంటారా?"

"ఊహూఁ!"

"అయితే మరేం?!—ఇక్కడే భోంచేసి ఆఫీసు కెళుదురుగాని!"

"అలా వీల్లేదు."

"మా దక్కడ వీలవుతుంది!—ఏం ఉషా, నువ్వంటావు కదూ?" అనడిగింది ఉషను.

"మరి బావో?!—ఏం బావా!—ఉందాం బావా?!..." అని గునిసింది ఉష.

అక్కడ ఉండడంవల్ల ప్రయోజనం లేదనిపించింది శ్రీనివాసానికి. అయినా ఉషకు అక్కడుండడం సరదాగా ఉండడంచేత—"సరే!" అన్నాడు.

"అయితే ఇక్కడే ఉండండి. నేనూ ఉషా పెరట్లోకెళ్లొస్తాము." అని చెప్పి ఉషతోపాటు పెరట్లోకెళిపోయింది.

పెరట్లోకెళ్లేసరికి ఉషకి చాలా సరదా అనిపించింది!—గులాబీ, మల్లె, సంపంగి, సన్నజాజి, మందారం, చామంతి, బంతి, రకరకాల పువ్వులు!!

—"బాగుందా ఇల్లు?" అనడిగింది రాధ.

"ఊఁ! చాలా బాగుంది." అంది ఉష.

"అయితే మా ఇంట్లో ఉండిపోతావా?"

"మరి బావో?!—"

"బావ ఉండిపోతే ఉండిపోతావా?"

"ఊఁ!" అంది ఉష.

ఉషకి తనే స్వయంగా ముఖం కడిగి కొన్ని పువ్వుల్ని కోసిఇచ్చింది రాధ.

—'బాత్‌రూమ్'లో వేడినీళ్ళను పెట్టమని మాగాడితో చెప్పి, ఉషతోపాటు తల్లి గదిలోకి వెళ్ళింది.

"ఎవరమ్మా మనింటికొచ్చినది?" అనడిగిందా ముసిలిది.

"ఎవరో నాకూ సరిగ్గా తెలీదు. కానీ ఈ పిల్ల అచ్చు ఆ చచ్చిపోయిన చెల్లెలు లానే ఉందమ్మా" అంది.

"అలాగా!—ఏదమ్మా, రా తల్లీ...దగ్గరికి..." అంటూ మంచంమీద కూర్చొని ముందుకి చేతులు చాచింది. ఉష దగ్గర కెళ్లింది.

ఆ పిల్లవొళ్లు నిమురుతూ.—"నీ పేరేమిటమ్మా?" అ నడిగింది.

"ఉష!" అనంది కీచుగొంతుకతో.

"ఉషా?!...రాధా. అచ్చు మన 'ప్రభ' గొంతుకే నే!...ఇంతకీ కళ్లుపోయేయి నాకు...ఉంటే ఎంత బాగుండును!—అన్నట్లు. ఆ మాట్లాడుతున్న మొగాళ్లెవరమ్మా?—" అ నడిగింది.

"అతను ఈ పిల్లకి బావగారు. ఈ పిల్ల అక్కయ్య చచ్చిపోయింది. అతనూ ఈ పిల్లా ఉంటున్నారు. అతనికి ఈపిల్ల అంటే ఎనలేని ప్రేమ!—నిన్న సినీమాహాలుదగ్గర కలుసుకున్నాను." అంది రాధ.

అంతట్లో అక్కడికి మాగా డొచ్చేడు. పొయ్యి రాజెయ్యమంది.

—కాఫీ త్రాగడం, భోంచెయ్యడం పూర్తియింది. "ఇక పోవాలి. ఆఫీసుకు 'టైం' అయింది." అన్నాడు.

"కానీ ఉషను మాత్రం ఇక్కడ వది లెయ్యండి. సాయంత్రం ఆఫీసునుంచొచ్చి తీసు కెళుదురు గాని!"

"అలా కుదరదు!—రా ఉషా!" అన్నాడు. ఉష బావదగ్గర కెళ్లింది.

"పోనీ సాయంత్రం వేళల్లో విస్తూఉండండి రోజూను." అనంది.

"అలాగే!" అ నన్నాడు శ్రీనివాసం.

ఓ మంచిబొమ్మా, ఓ చిన్న మరమోటరుకారు ఉష కిచ్చింది. వెళిపోతున్నప్పుడు—"ఏం ఉషా!—సాయంత్రం మీ బావగారిని తీసుకురా!" అనంది రాధ.

"అలాగే!" అనంది ఉష.

రిక్షా కుదుర్చుకొని అందులో కూర్చొని వెళిపోయే రిద్దరూ!

3

ఆఫీసు వనయినవెంటనే స్కూలు దగ్గర కొచ్చి ఉషను కలుసుకున్నాడు శ్రీనివాసం.

"బావా!—మళ్ళీ ఆ అక్కయ్య ఇంటి కెళదామా; రమ్మంది కదూ మన్ని?!" అనంది.

"ఇవాళ మరో క్రొత్త అక్కయ్య ఇంటి కెళదాం!" అన్నాడు.

"మంచిదేనా ఆ అక్కయ్య?" అనడిగింది.

"ఊఁ!" అన్నాడు.

తరవాత అలా కాఫీహోటలు కెళ్లేరు. టిఫిన్ తిన్నారిద్దరూ. అనంతరం అలా పార్కు కెళ్ళి కొంత సేపుండి ఇంటికొచ్చేసేరు. ఉషకి వొళ్లు కడిగి బాగా ముస్తాబుచేసేడు. తనూ స్నానం చేసి, మంచిదుస్తులు వేసుకొని టాయిలెట్ అయేడు.

వీధిలోకి బయలుదేరుతూ ఉన్నప్పుడు—"క్రొత్త అక్కయ్య ఇంటికా బావా?" అనడిగింది ఉష.

"ఊఁ—భోంచేసి వెళదాం." అన్నాడు.

హోటలులో భోజనం ముగిసినతరువాత, తిన్నగా సానివీధిలోకి బయలుదేరేడు. గుమ్మంలో కూర్చొని నవ్వుతూ తనవేపు చూస్తూఉన్న ఒకామెను చూసేడు. అంతా క్రొత్త!—మొదట కొంచెం భయపడ్డాడు. ఆఖరికి ధైర్యం తెచ్చుకొని—"రావొచ్చా ఇంట్లోకి?" అనడిగేడామెను.

"మీకోసమే ఎదురుచూస్తున్నాను!" అందామె—ఇంతసేపయి శ్రీనివాసంకోసమే కాచుకొని కూర్చున్నట్లు!—

లోనకెళ్లేడు. అంతా కుదిరిపోయింది!—ఉష నిద్రపోయింది!—ఆ రాత్రి గడిచిపోయింది!!—అది మొదలు శ్రీనివాసం జీవితంలో గొప్పమార్పువచ్చింది. ఆవీథంతా బాగా పరిచయమయిపోయిందతనికి!—

క్రొత్తక్రొత్త అక్కయ్యలపరిచయం ఏర్పడింది ఉషకి. కానీ ఆ తొలినాటి రాధఅక్కయ్యంత మంచిగా ఎవరూ కనిపించలేదామెకు. అందుకే రోజూ అనేది, "అల్లా అక్కయ్యదగ్గరకు వెళదాం" అని.

"అలా ఉందికానీ, అది మంచిది కాదమ్మా!" అని చెప్పేవాడు. కానీ బావమాటల్ని ఉష నమ్మలేక పోయేది.

—భార్య అంటూ లేకపోయినా, తనకోరిక నెరవేర్చుకుంటున్నందుకు తృప్తి కొంతవరకూ ఏర్పడింది శ్రీనివాసానికి!—ఒక్కొక్కప్పుడు తను చేస్తూ ఉన్న పని చాలా నీచమయినదని అనిపించినా; తనపరిస్థితలా ఏర్పడింది; ఏంచెయ్యడం?...అని అనుకొని సమాధానపడేవాడు.

అతని మిత్రులు పసికట్టేరు శ్రీనివాసం వ్యవహారాన్ని!—"ఇలా తయారవుతా వనుకోలేదు!" అన్నారు.

"నేనూ అనుకోలేదు. కానీ ఏం చెయ్యమంటారు?—పెళ్లిచేసుకుంటే, ఈపిల్ల కెంత బాధేర్పడుతుందో తెలుసా?!—ఇలా అయితే ఈపిల్లమీదెవ్వరికీ ఈర్ష్యా జుగుప్సలుండవు!"

"బాగుంది!...జ్ఞానం ఉన్నవాడివి నువ్వు!—నీకు మేంచెప్పే దేముంది?—ఈ సంగతి మీవాళ్లకి తెలుస్తే వాళ్లెంత బాధపడతారో తెలుసా?!"

"నా ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకుంటే వాళ్లు బాధపడరు."

"ఆఁ!—పోన్లెద్దూ?—ఏం ఉద్దేశ్యం"!—ఆఖరికి జీవితంలో ఎందుకూ పనికిరాని వ్యక్తిగా తయారవుతావు. లోకులు నిన్ను చాలా నీచంగా చూస్తారు"

"నిజమే!—లోకుల దృష్టిలో నే చేస్తూఉన్న పని చాలానీచంగా నే కనిపిస్తుంది. కానీ నామట్టుకి నాకు అంత నీచంగా కనిపించలేదు. మంచి శీలం కలవాడివని లోకులచేత అనిపించుకోవాలని నాకు లేదు. నా సుఖంకోసం చేసే పని చేస్తున్నాను!—నా సంజాయిషీ మీకు సమంజసంగా తోచకపోవొచ్చు. అయినా నాకు నష్టం లేదు!"

ఇక అతనికి హితోపదేశం చెయ్యడంవల్ల లాభం శూన్యమని గుర్తించేరతని మిత్రులు. అతనితో మాట్లాడడం కూడా తగ్గించేసేరు. శ్రీనివాసం విషయం ఎప్పుడయినా వొస్తే—"వాడొట్టి వెధవ!" అని అనుకొనేవారు.

—రోజురోజుకీ నీరసించిపోవడం మొదలెట్టేడు శ్రీనివాసం!—భయం బెంగా పట్టుకున్నాయి!—దానికితోడు ఇంటి దగ్గరనుంచి వచ్చే లేఖలు మరీ బాధను కల్గించేవి!—"ఇంకా ఎన్నాళ్లిలా పెళ్లిచేసుకోకుండా ఉంటావు?—ఆ పిల్లకోసం నీ జీవితాన్ని నాశనం చేసుకోకు. దాన్ని దాని రెండో అక్కయ్య దగ్గరకు పంపించేయి. అ దెలాపోతే నీకేం బాధ?—నువ్వు సుఖంగా ఉండు!—" ఆ ధోరణిలో ఉండేవి లేఖలు.

—ఏ సుఖాల నయినా తను త్యజించగలడు గానీ ఉషను త్యజించడం తన కెలా సాధ్యమవుతుంది?—ఉషనే విడిచిపెట్టేస్తే మానసికంగా తన

జీవితంలో సుఖపడగలడా?—ఒట్టి మాట!—ఇక తన జీవితం ఆరకంగా గడపవలసిందే!—ఇంట్లో సహధర్మచారిణిగా ఓ స్త్రీ తన కుండదు. అంతే!—ఇకపోతే మిగతా సౌఖ్యాలను తను అనుభవించ గలడు!—అందుకు కావలసిన డబ్బుంది తనదగ్గరని అనుకున్నాడు.

4

శ్రీనివాసం పూర్తిగా పాడయిపోయేడు. రాత్రిళ్ళు ఉషతోపాటు సానివాళ్ళ ఇళ్ళల్లో నే మకాం!—

ఓనాటి రాత్రి శ్రీనివాసం సానివీధిలోకి ఉషతోపాటు వెళ్తున్నప్పుడు రాధ ఎదురయి ఆపు చేసింది.

—"ఈమధ్య ఒక్కమారయినా మా యింటికి రాలేదేం?—వస్తారని ఎదురుచూసే విన్నాళ్ళూ!—అయినా ఈ వీధిలో కొచ్చే రేమిటి?" అ నడిగింది రాధ.

శ్రీనివాసం ఇంకా సమాధానం చెప్పకముందే- "నువ్వు మంచిదానివి కావుట!—అందుకు రోజూ రాత్రి అక్కయ్య ఇంటికి తీసుకెళుతున్నాడు మా బావ!" అని ఉష సమాధాన మిచ్చింది.

"ఓ!—అలాగా?—నిజమేనాండి?—" అని శ్రీనివాసాన్ని అడిగిం దామె.

"మీ కనవసరం!—" అని శ్రీనివాసం సమాధానం.

"పోనీ ప్రస్తుతం ఎవరింటి కెళుతున్నారు?"

"ఆ విషయం మీ కనవసర మేం?"

"పోనీ ఎందు కెళుతున్నారో చెప్పండి?"

"చెప్పినందువల్ల ప్రయోజనం ఉంటుందా?"

"ఉంటుంది!"

"అయితే చెప్తా!" అని జరుగుతూన్న విషయం చెప్పేడు. నమ్మలేకపోతున్నాను!" అనందామె ఆశ్చర్యంతో.

"నమ్మలేకపోవొచ్చు!—కానీ నా పరిస్థితి ఇలా నన్ను తయారుచేసింది. ఇక పోతా!" అని ముందుకి అడుగు వెయ్యబోయేడు శ్రీనివాసం.

"వీల్లేదు. ఇవాళ మీ మార్గానికి నే నడ్డొస్తున్నాను!" అనంది రాధ ఎదురుగా నిలబడి.

"అడ్డొస్తే పడిపోతారు. నన్ను అనవసరంగా ఆపకండి."

"మీ రెందు కెళుతున్నారో గ్రహించి నేను పిలిచినట్టయితే వస్తారా మా ఇంటికి!"

"వస్తా!"

"అయితే పదండి!" అంది. రిక్షా మాట్లాడింది. ఎక్కారు.

"ఏమిటో మీ వ్యవహారం నాకు వింతగా కనిపిస్తున్నది!" అన్నాడు శ్రీనివాసం.

"మీకే కాదు; నన్నర్థం చేసుకోలేని చాలా మందికి అలానే అగుపిస్తుంది నా వ్యవహారం!" అందామె.

"అర్థం చేసుకోడాని కేముందిలెండి!—కొంచెం అభ్యుదయ పంథాలో ఉంది మీ ధోరణి."

"ఎలా అయితేనేం గ్రహించేరన్న మాట!—ఆఖరికి నన్నో వేశ్య క్రింద జమకట్టేసేరు!—ఇంకా మన్నించడం ఎందుకూ?—ఏకవచన ప్రయోగమే చెయ్యండి!"

"అదీ నిజమే!—ఇకనుంచీ మన్నించను. కానీ అదేమిటో గానీ నీమాటలు వింటూ ఉంటే నా భార్య జ్ఞాపకాని కొస్తున్నది!"

"అలాగా!" అని నవ్వింది రాధ.

రిక్షా పోతున్నది ముందుకు.

"ఏమాత్రంలో ఉంది వ్యవహారం?" అనడిగేడు శ్రీనివాసం.

"తమ దయ!" అని నవ్వుతూ అంది రాధ.

"అయితే మరీ మంచిది!" అన్నాడు శ్రీనివాసం.

నవ్వాగింది కా దామెకు!— ఉషముఖం లోకి మాసింది. "ఇలా ఎండిపోతున్నావేం?" అనడిగింది.

"నిజమేనా?" అని అడుగుతూ ఉష వేపు ఆందోళనతో చూసేడు.

"మీరుకూడా చాలా నీరసించిపోయేరేం?" అనడిగింది.

"నిజమే నంటావా?"

"అబద్ధం చెప్పలేదు. నామాట విని ఆఫీసుకు సెలవు పెట్టి ఓ నెలరోజులపాటు మాఇంట్లో ఉండండి. మళ్లీ ఆరోగ్యం చేకూరుతుంది."

"గొప్ప సలహా!—ఆలోచిస్తాలే!" అన్నాడు.

"మీరు స్వయంగా ఆలోచించలేరనుకుంటా!"

"ఆలోచనలు కూడా ఎరువుతీసుకోవలసే గతి పట్టలేదింకా!"

—"అని మీరనుకోవచ్చు!—కానీ బండి దారి తప్పింది!"

"లేదు!—నామట్టుకి సవ్యమయిన దారిలోనే ఉన్నట్లనిపిస్తున్నది." అన్నాడు శ్రీనివాసం.

రిక్షా మలుపు తిరిగింది. "అవుతల మేడదగ్గర!" అందామె.

ఆపేడు రిక్షా. "డబ్బులు నే నిచ్చేస్తా నన్నా"డు శ్రీనివాసం.

"ఆఁ!—అవసరం లేదు. నేనే ఇచ్చేస్తా" నంటూ డబ్బులు తీసి ఇచ్చేసింది.

ఆమె డబ్బులు తీసిఇచ్చేస్తూ ఉంటే—"ఏమయినా ఇదంతా అభ్యుదయపంథా!—ఒక్కమారు గుంజుకోడానికీ పంథా!" అని గొణిగేడు.

"ఔను!" అనందామె నవ్వుతూ.

ఉష నెత్తుకొని ఇంట్లోకి ప్రవేశించిందామె!—మేడమీద టేబిలు తుడిచి ప్లేటు వేసి—"అన్నం ఇక్కడికే పట్టుకొస్తాను." అనంది.

"మే మప్పుడే భోం చేసేశాము." అ[illegible].

"ఏం ఉషా!—అన్నంతిన్నావా నువ్వు!—" అడిగింది.

"తిన్నాను!" అంది ఉష.

అప్పటికి నమ్మకం కలిగిందామెకు. "అయితే కొంచెం 'స్వీట్సు' తెస్తానుండండి." అని చెప్పి ఉష నెత్తుకొని క్రిందికి దిగింది.

బీరువా తెరిచి అందులో ఉన్న 'స్వీట్సు' బయటకు తీస్తూ—"ఉషా!—రోజూ మీ బావ ఎక్కడికి కెళుతున్నారమ్మా!" అడిగింది.

"అక్కయ్యల ఇంటికి!"

"వాళ్లు నాతో మాట్లాడేవాళ్లేకాదు. ఏమీ ఇచ్చేవాళ్లే కాదు!"

"వాళ్ళు మంచివాళ్లు కాదమ్మా!—అలాంటి వాళ్ళింటి కెప్పుడూ వెళ్లకూడదు. మీ బావతో ఎప్పుడూ వెళ్లకు."

"మరి బావ వెళితే ఎలాగ?"

"ఇక్కడే ఉండిపోతానను!—మీ బావ ఆఫీసుకు వెళ్లే వేళల్లో ఇక్కడే ఉండిపో!—నేను నీకు చక్కా చదువు చెపుతాను." అనంది.

"అలాగే!" అనంది ఉష.

"స్వీట్సు" గిన్నె ఓచెత్తో పట్టుకొని, ఓచెత్తో మెల్లగా ఉషను పట్టుకొని ఎక్కుతూ మేడమీది కెళ్లింది రాధ.

ప్లేట్సు సర్దింది. కిటికీలోంచి వీథిలోకి చూస్తూ ఉన్న శ్రీనివాసాన్ని టేబిలుదగ్గరకు రమ్మని పిలిచింది. టేబిలు దగ్గరున్న ఓ కుర్చీలో కూలబడ్డాడు. "ఏం ఆకలి లేదు!—ఇప్పుడేం తినను!" అన్నాడు.

"కొంచెం తీసుకోండి!" అనంది రాధ.

ఎందుకో నవ్వేడు శ్రీనివాసం!—

"పాటలు పెయ్యవూ?" అని రాధ నడిగింది ఉష.

"ఏముండోయ్!—ఈ ఉషకి పాటలంటే బలే సరదాలాగుంది. సంగీతం చెప్పించాలి. ఏమంటారు?" అనంటూ రేడియో 'స్విచ్ ఆన్' చేసింది. 'సిలోన్' స్టేషను పెట్టింది. ఉష రేడియో వేపు ఆసక్తితో చూస్తూ ఆ ముందునే ఉన్న ఓ కుర్చీలో కూర్చుంది ఓ లడ్డూ తింటూ.

—రాధ శ్రీనివాసానికి ఎదురుగుండా ఉన్న కుర్చీమీద కూర్చొని ప్లేటు ముందుకు లాగుతూ అంది—"ఉష భవిష్యత్తుగురించి ఆలోచించేరా?" అని.

"ఆలోచించబట్టే పెళ్ళి చేసుకోకుండా ఇలా కాలక్షేపం చేస్తున్నాను." అని సమాధానమిచ్చేడు.

"మీకు దూరాలోచన లేదన్న సంగతి తేలిపోయింది!"

"ఏం!"

"చెప్పాలంటారా?"

"చెప్పాలి."

"మీరు రేపు చచ్చిపోతారనుకోండి!"

"ఆఁ!—చచ్చిపోతే!..."

"అప్పుడీ ఉషకు ఎవరు దిక్కు?"

"ఆవిషయంగురించి నేనెప్పుడూ ఆలోచించలేదు!—ఇంతకీ నేను చచ్చిపోను. ఈ ఉషకోసం బ్రతికుంటాను. దీనికి పెళ్లయి అత్తారింటికెళిపోయే అంతవరకూ ఉంటాను!"

"చావు అనేది మీ ఆధీనంలో ఉండదు!"

"ఇంతకీ ఈ వేదాంతంఅంతా నాకెందుకు?—నేనెందు కిక్కడికి వచ్చేనో తెలుసా?"

"తెలుసు!—కానీ నేను సానిదానినిమాత్రం కాదు."

"అయితే మరెందుకు నన్నిక్కడికి తీసుకొచ్చేవు?"

"చెడిపోతున్న మిమ్మల్ని బాగుచేద్దామని!"

"నా బాగోగులు నాకు తెలుసు!"

—"అని అనుకుంటున్నారు మీరు!—నామాట మన్నించి మీరు సానికొంపలకు వెళ్లడం మానేయండి. మీ బాగుకోసమే చెప్తున్నాను."

"నే వెళ్లినా నీకేం నష్టం లేదనుకుంటా!"

—"నష్టం ఉంది!" అందామె.

ఆమె ఎందుకంతలా తన బాగుకోసం ప్రాధేయపడుతున్నదా అని అనుమానం వేసింది శ్రీనివాసానికి—"నీతత్వం, నాకేం అర్థంకావడంలేదు!"అన్నాడు.

"ముమ్ముందు అర్థమవుతుంది లెండి!—అయినా మీరిప్పుడెలాగ ఉన్నారో తెలుసా!—ఏదో జబ్బుపడిన వ్యక్తిలాగున్నారు!" అందామె.

నిజమే అనిపించింది శ్రీనివాసానికి!—అంతకితొలిరోజునే గుండెల్లో విపరీతంగా నొప్పి వచ్చింది. నిజానికి శారీరకంగా కొంతబాధ ఉంది. కొంపతీసి, తను అకస్మాత్తుగా గుండెనొప్పివల్ల చచ్చిపోతానేమో అనే భయం అప్పుడు కలిగిందతనికి!—తను చచ్చిపోతే ఉష ఏమయిపోతుంది?—ఇంతకీ తను ఎవరికోసం పెళ్లిచేసుకోడం మానేసి అలా తయారయేడు?—ఉషకోసమేకదా?!—మరలాంటప్పుడు తను తన శరీరారోగ్యాన్ని లెక్క చెయ్యకుండా తిరగడం సమంజసమయిన పనేనా?—ఆలోచించడం మొదలెట్టేడు.

"ఏమిటలా ఆలోచిస్తున్నారు?" అనడిగింది రాధ.

"ఏం లేదూ!—గుండెల్లో కొంచెం భారంగా ఉంది!" అన్నాడు ప్లేటులో చెయ్యి కడుక్కుంటూ.

"మానేరా మరి?!—నాకు తెలుసు. నామాట విని ఈ తిరుగుళ్లు మానండి. మానలేకపోతే నన్ను పెళ్ళి చేసుకోండి!" అనంది రాధ.

ఆశ్చర్యపోయేడు శ్రీనివాసం!—

"నిన్నా?!" అనడిగేడు శ్రీనివాసం ఆశ్చర్యంతో.

"ఏం?—తగనా?!—వితంతువునని అనుమానిస్తున్నారా?" అనడిగింది.

మరింత ఆశ్చర్యపోయేడు శ్రీనివాసం!......"నువ్వు వితంతువివా?"

"అవును!—ఇప్పటికప్పుడే నాలుగేళ్లయింది నా భర్త పోయి!—ఆయన మిగిల్చినదే ఈ ఆస్తంతాను. ఆయనవాళ్లెవరూ సజీవంగా లేకపోడంచేత నా ఈ స్వేచ్ఛకు ఆటంకం లేకుండా ఉంది!—ఆయన చచ్చిపోయేక, మళ్ళీ పెళ్ళి చేసుకుందామనే ఉద్దేశ్యం నాకిప్పటివరకూ లేదు!—కానీ మిమ్మల్ని మీ మరదల్ని చూసిన తరవాత నాకీ అభిప్రాయం ఏర్పడింది!—ఇంతకీ ఏమంటారు?"

"బాగు బాగు!—వితంతువుని పెళ్లాడితే లోకులేమంటారు?" అన్నాడు.

"సానివాళ్లింటికి వెళితే ఏమీ అనరా?"

"అదేమంత తప్పుపని కాదు!—కానీ వితంతువుని పెళ్లాడితే సంఘంలోంచి వెలివేస్తారు లోకులు!—మా అమ్మ నాన్న మరిక తలెత్తుకోలేరు సంఘంలో!—పెళ్లి నే చేసుకోకుండా ఉండడం వల్ల కొంత బాధపడుతున్నారు. ఇక తీరా ఓ వితంతువుని పెళ్ళి చేసుకుంటే వాళ్ళ బాధ మరో క్రొత్త రకం బాధగా మారుతుంది!"

"సరే గానీ, మీరు సానికొంపలకు వెళుతున్నట్లు మీవాళ్లకి తెలిస్తే సంతోషిస్తారా?"

"సంతోషించరు!—చాలా బాధపడతారు!"

"నన్ను పెళ్ళి చేసుకుంటే ఉండే బాధకన్నా తక్కువా ఆ బాధ?"

"ఆలోచించవలసినవిషయమే అది! - అయినా నిన్ను పెళ్ళి చేసుకోడంమాత్రం జరగదు!"

"సరే గానీ, మీరు మాత్రం కొన్నిరోజులపాటు నా యింట్లో ఉండాలి!"

"అనవసరం!"

"మీశరీరపరిస్థితి మీకు తెలియకుండా ఉంది!—ఈవిధంగా ఉంటే ఎప్పుడో ఒకప్పుడు మీరెలాంటి బాధలకు గురవుతారో ఆలోచించేరా ఎప్పుడయినా?—నా మాట విని నన్ను పెళ్లాడి సుఖపడండి. మీకే లోటూ రానివ్వను. ఉషను నా స్వంత చెల్లెలు

లానే చూస్తాను. అసలు ఇప్పుడు నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటూ వనడానికి ముఖ్య కారణం ఉమ; రెండో కారణం మీరు!—ఏదో అనూహ్యమయిన శక్తి మిమ్మల్ని చూసినదగ్గరనుంచీ మీమీద ప్రేమ కలుగజేసింది; ఉమమీద వాత్సల్యాన్ని కలుగజేసింది!—అంచేతే మీ ధోరణి తెలిసినా, మిమ్మల్ని పెళ్లి చేసుకుంటావని అంటున్నాను. మిమ్మల్ని నేను పెళ్లి చేసుకుంటే ఇక ముందిలా ఉండరనే అభిప్రాయం కూడా ఓటుంది."—

—వింటూ శ్రీనివాసం కుర్చీలో చేరబడి చేత్తో తల పట్టుకొని—"అబ్బ!—తల నొప్పి దంచేస్తూంది. ఇప్పుడు మరేమీ చెప్పకు!" అన్నాడు చిరాగ్గా—

"నిజమేనా?" అని అడుగుతూ శరీరాన్ని తాకి చూసింది రాధ. కొంచెం వెచ్చగా తగిలింది శరీరం. "బహుశా వేడి చేసుంటుంది. ఆ ప్రక్క మీద ఏ విషయాలూ ఆలోచించకుండా పడుకోండి. నేనూ ఉమా క్రిందగదిలో పడుక్కుంటాం! మాగా డిక్క డుంటాడులెండి!" అని చెప్పి ఉమ కూర్చున్న కుర్చీదగ్గర కెళ్ళింది.

—ఉమ అలా కుర్చీలో కూర్చునే నిద్ర పోతూ ఉండడం చూసి—"పాపం, ఎలా నిద్రపోయిందో!" అని తనలో తానే అనుకొని, ఆ పిల్లను జాగ్రత్తగా భుజంమీద పడుకో బెట్టుకొని, రేడియో స్విచ్ ఆఫ్ చేసి క్రిందికి దిగిపోయింది.

—ఆరాత్రి శ్రీనివాసానికి సరిగ్గా నిద్రపట్ట లేదు!—రాధని పెళ్లాడితేనో?—అని అతని ఆలోచన!—చాలా మంచిదానిలాగే ఉంది. అదీకాక తను గమనిస్తూనే ఉన్నాడు ఆ కొద్దిపాటి కాలంలోనూ ఉమకి రాధదగ్గిరేర్పడిన చనువు! ఆ ఇద్దరి మధ్యా ఏదో గొప్ప వాత్సల్యం ఏర్పడింది!—అలాంటప్పుడు రాధని పెళ్ళి చేసుకుంటే తనకి బాధేం?—

—కానీ తన తల్లిదండ్రులు ఒప్పుకుంటారా?—వాళ్లొప్పుకోరసలు!—పెళ్లి చేసుకోడమయినా మానేయమంటారు గానీ ఆ వితంతువుని వివాహం చేసుకోనేందు కొప్పుకోరు. అది నియమవిరుద్ధం అంటారు!—ఎలా?—వాళ్లని కాదని తను ఆమెను పెళ్ళి చేసుకోడం సబబయినపనేనా?—

—అదీకాక హృదయాన్ని విప్పిచెప్పి, తన శ్రేయస్సుకోసమే ఆమెను వివాహం చేసుకోమని అంటూవున్న రాధ కోరిక త్రోసిపుచ్చడం మంచి పనేనా?—అనుకోకుండా దైవవశాత్తూ తామిద్దరి మధ్యా అనుగుణంగా కొద్దికాలంలోనే ఏర్పడ్డ అనురాగ బంధాన్ని త్రెంపేయడమేనా?—ఏం చెయ్యడం?—ఏమీ తోచలేదతనికి. ఎడతెగని సమస్యల గురించి తీవ్రంగా ఆలోచిస్తూ ఆరాత్రి గడిపేసేడు.

ఎంచేతోగానీ ఓ నాలుగైదు రోజులపాటక్కడ ఉండాలనిపించింది. శ్రీనివాసానికి!—

లోన కొంచెం జ్వరం ఉన్నట్టువున్నా, అవాళ బాగా భోంచేసి, ఆఫీసు కెళ్లేడు. రాధదగ్గరే ఉమ ఉండిపోయింది.

ఆ సాయంత్రం ఇంటికి తిరిగొచ్చేడు శ్రీనివాసం!—వస్తూనే—"జ్వరం బాగా వచ్చేసినట్టుంది రాధా!—గుండెలో నొప్పిగా కూడా ఉంది!" అన్నాడు సావిట్లో ఉన్న ఈజీఛైరులో కూలబడుతూ.

"శరీరాన్ని పూర్తిగా పాడుచేసుకున్నారు!" అని అంటూ దగ్గర కెళ్ళి చెయ్యిపట్టుకుంది. "అరె!- మరిగిపోతూంది శరీరం!—గదిలోకొచ్చి పడుక్కోండి. ప్రక్క దులుపుతా!" అనంటూ గబగబ ఆ ప్రక్క గదిలోకి వెళ్లి ప్రక్క దులిపింది. శ్రీనివాసం మెల్లగా గదిలోకొచ్చి మంచం ఎక్కేడు!—పడుకున్నాడు.

"డాక్టర్ని తీసుకొస్తా!" అంది రాధ ఆందోళనతో.

"ఊఁ!—గుండెల్లో నొప్పిగా ఉంది. తల నొప్పి భరించలేనంతగా ఉంది. చచ్చిపోతా నేమిటి చె...ప్మా?" అన్నాడు ఆయాసంతో మూలుగుతూ.

ఆ మాటలు వినేసరికి దెబ్బతిన్న లేడిలా త్రుళ్లి పడింది రాధ. ఆమె హృదయంలో ఏదో కంపం బయలుదేరింది! — "భయంలేదు, పడుకోండి. బాగా వేడిచేయడంవల్ల వచ్చుంటుందీ జబ్బు!—నే నిప్పుడే డాక్టర్ని తీసుకొస్తాను." అంటూ రెండడుగులు వేసింది.

"ఉమేదీ?" అనడిగేడు శ్రీనివాసం.

"మేడమీద రేడియో వింటోన్నది. తీసుకొస్తా!" అనంటూ మేడమీదికి పరుగెట్టి ఉమని ఎత్తుకొని తీసుకొచ్చింది. శ్రీనివాసం ప్రక్కని కూర్చొపెడుతూ—"చూడమ్మా!—బాబుకి జ్వరం వచ్చింది.

ఇక్కడే కూర్చో. నే నిప్పుడే వస్తాను." అని చెప్పి డాక్టర్ని తీసుకు రాడానికని వెళ్ళిపోయింది.

"బా...వా...జ్వరం వచ్చిందా?—" అ నడిగింది ఉష, బావముఖంలోకి చూస్తూ.

"ఔనమ్మా!" అనంటూ ఉషని హృదయానికి హత్తుకున్నాడు. ఎందుకో గానీ, కన్నీళ్లు కారేయతనికి!—

"ఏం బావా ఏడుస్తున్నావు?" అ నడిగింది ఉష అమాయకంగా.

"ఏడవ లేదమ్మా!...కళ్లు మండుతున్నాయి. అం...దు...కు!—ఔనుగానీ ఈ ఊరక్కయ్య మంచిదేనా?" అ నడిగేడు.

"మంచిదే బావా!—అల్లా, ఆ అక్కయ్యల్లాంటిది కాదు. చాలా మంచిది!" అని ఉష సమాధానం.

మళ్ళీ కన్నీళ్ళు కారేయతనికి. మరి మాట్లాడ లేకపోయాడు. మళ్ళీ గుండెల్లో నొప్పి వచ్చింది!...

"బావా!...మనం ఇక్కడే ఉందాం. చక్కటి రేడియో—పువ్వులూ—బొమ్మలూ — గౌనులూ— మంచి అక్కయ్య—అన్నీ ఉన్నాయి. ఇక్కడ బాగుంది బావా!—మరిక్కణ్ణుంచి వెళిపోంకదూ?" అ నడిగింది ఉష.

ఉషకు సమాధానం ఇచ్చే పరిస్థితిలో అప్పుడు లేడు శ్రీనివాసం!—చిన్న మగత క్రమ్మింది. ఎక్కడికో గాలిలోకి తేలిపోతున్నట్లు ఫీలయేడు! అంతట్లో డాక్టరితో పాటు రాధ వచ్చింది.

డాక్టరు శ్రీనివాసం శరీరాన్ని పరీక్ష చేసేడు. "హృదయం కొంచెం పాడయింది!—పైగా శరీరంలో ఉష్ణప్రకోపం జాస్తీగా ఉంది. కొంచెం కఫం కూడా చేరింది. దరిదాపు ఓ ఇరవై ఇంజెక్షన్లు తీసుకోవాలి. జబ్బుపోయిన తిరువాతకూడా కొన్నాళ్ళు మందు తీసుకోవలిసుంటుంది!—బిల్లు రెండువందల రూపాయలవరకూ ఉంటుంది." అన్నాడు డాక్టరు.

"ఎంతయినా ఇచ్చుకుంటాను!—ఫరవాలేదు కదా?" అ నడిగిందామె బెంగతో.

"భయంలేదు!" అనంటూ ఇంజెక్షన్ బాక్సు తెరిచేడు. ఓ ఇంజెక్షన్ చేసేడు. "బాగా నిద్దర పట్టేస్తుంది. లేపడానికి ప్రయత్నించకండి. రేపు ఉదయాన్నే నేనొచ్చి చూస్తాను." అని చెప్పి వెళిపోయేడు డాక్టరు.

5

శ్రీనివాసానికి జ్వరం కొంచెం తగ్గిందవాళ. హృదయంలో భారంకూడా తగ్గింది.—అవాళన్నాడు రాధతో వారింజపండు తింటూ—"ఇంతలా నా సేవ చేస్తున్న నీ రుణం ఎలా తీర్చుకోగలనో?!" అని.

"నన్ను మీరు వివాహం చేసుకుంటే రుణం తీర్చుకో గలిగినవారవుతారు!" అనంది రాధ.

"రాధా!—స్త్రీజాతిమీద నాకో నమ్మకం ఉండే దింతవరకూ?!—సాధారణంగా సవతులకి సంబంధించినవాళ్ళమీద స్త్రీ జాతికి ఈర్ష్య అసూయ లుంటాయని నమ్మేను. కానీ నువ్వు నా నమ్మకాన్ని కొంతవరకూ మార్చేసేవు. లోకంలో అందరాడవాళ్లూ నే నూహించినట్టుండరని తెలుసుకున్నాను!—ఇప్పుడు నిన్ను అర్థం చేసుకున్నాను. మావాళ్ళని వ్యతిరేకిస్తాను! — తప్పక నిన్ను వివాహం చేసుకుంటాను!" అన్నాడు శ్రీనివాసం.

సంతోషాన్ని పట్టలేకపోయింది రాధ!— ఒక్కగంతేసింది!—"మీ వాళ్ళకి ఉత్తరం రాస్తాను. కాదు వైరు చేస్తాను!—ఇంకేముంది జబ్బు తగ్గిపోయినట్టే!" అంది.

"వద్దు! — మావాళ్లకి మాత్రం తెలియచెయ్యొద్దు!—వాళ్లొస్తే ఈపెళ్లి సవ్యంగా జరగదు!" అన్నాడు శ్రీనివాసం.

"మరేం ఫరవాలేదు. వాళ్లకి నే నచ్చచెబుతాను!" అంది రాధ.

"సరే నీ ఇష్టం!" అన్నాడు శ్రీనివాసం.

ఆరోజే వాళ్ళకి వైరు చేసింది రాధ. "శ్రీనివాసానికి జబ్బుగా ఉన్నట్లు"

6

ఆవాళ శ్రీనివాసానికి ఎంచేతో మళ్ళీ జబ్బు హెచ్చయిపోయింది. కఫం గొంతుకకి అడ్డుపడుతున్నది. శరీరంమీద అంతగా తెలివిలేదు!— రాధా, ఉష అప్రక్కనే కూర్చున్నారు ఆందోళనతో. రాధ కళ్ళంట నీరు కారుతూంది!—"బావ మాట్లాడడేం?" అని బెంగతో ఉష అడిగింది రాధని!—

ఉషని గుండెల కద్దుకొని బాగా కన్నీరు కార్చింది రాధ.

—డాక్టరొచ్చి ఇంజెక్షన్ చేసేడు. "ఫరవా లేదు. తెలివి వచ్చేస్తుం దోగంటలో!" అని చెప్పి వెళ్లిపోయేడు.

శ్రీనివాసానికి తెలివి రావడం, అతని తల్లి దండ్రులు లోనికి ప్రవేశించడం ఒక్కమారే జరిగింది!—

"అమ్మోయ్!—నీవాళ్లం ఇంతేమందిమీ ఉంటూ ఉండగా ఆఖరి కిలా దిక్కూ మొక్కూ లేకుండా జబ్బుతో బాధపడుతున్నావా బాబూ!" అని ఏడుస్తూ కొడుకుముఖంలోకి చూస్తూ, చేతులతో నిమురుతూ మంచందగ్గర కూలబడిం దాతల్లి.

మంచంమీద జబ్బుతో పడుక్కొనిఉన్న కొడుకువేపూ, రాధవేపూ, ఉషవేపూ చూస్తూ అందోళనతో నిలబడ్డా డతని తండ్రి.

"డాక్టరూ!..." అని శ్రీనివాసంతండ్రి అంటూ ఉండగానే...

—"ఇప్పుడే ఇంజెక్షనిచ్చి వెళ్ళేరు!" అనంది రాధ.

"నువ్వెవరవమ్మా?!" అనడిగింది శ్రీనివాసంతల్లి.

ఇంకా రాధ సమాధానంఇవ్వకముందే—"దేవ...త!" అన్నాడు శ్రీనివాసం.

"అంటే?" అనడిగే డతనితండ్రి.

"మురికికూపంలోకి నే పడిపోతూ ఉంటే, తీసి రక్షించిం దీమె!—నే వివాహం చేసుకోబోయేది ఈమె...నే!..." అన్నాడు శ్రీనివాసం ఆయాసంతో.

వాళ్లు చాలా ఆశ్చర్యపోయేరు!—"ఎన్నాళ్లకి మాట అన్నావురా నాయినా! ఈ జబ్బు తగ్గిపోయిన వెంటనే వివాహం!" అం దాతని తల్లి.

అతని తండ్రి మాత్రం ఏమీ అనలేదు!—అతనికి అనుమానం లోలోన ఉంది!—ఆమె ఏ కులమో ఏమిటో అని!...కానీ అప్పట్లో అడగడం మంచిపని కాదని ఊరుకున్నాడు.

అంతట్లో రాధ తల్లి అక్కడికి తడుముకుంటూ వచ్చింది. "ఏదో దానదృష్టం బాగుంది. మళ్ళీ పెళ్లవుతున్నాది దానికి!—లోకంలో కొందరికయినా విశాల మనస్తత్వం ఉంటుంది!" అందా ముసలిది.

"ఏమిటిలా బాబూ...మళ్ళీ పెళ్ళంటున్నా దావిడ!" అనడిగిం దతని తల్లి. శ్రీనివాసంవేపు ప్రశ్నార్థకంగా చూసే డతని తండ్రి!—

ఆమూలనుంచి "బావా!" అని అరుస్తూ శ్రీనివాసం మంచంమీద కెక్కింది ఉష. "మాట్లాడవేం బావా?" అంది ఏడుస్తూ ఉష.

అంతా ఉషవేపూ శ్రీనివాసంవేపూ చూసేరు!

అక్కడి వాతావరణం అంతా అదోలా తయారయింది!—



నక్షత్ర పరిణామము

★

శ్రీ వసంతరావు వేంకటరావు

"అణువులో బ్రహ్మాండ మమరించి బ్రహ్మాండ
మణువని చూపు మాయావినోద!
దశలక్షలుగ నున్న తారకా గోళమున్
చెడకుండ గారడీ చేయువాడ!
అవ్యక్తమగు శక్తి నవ్యక్తముగ గూర్చి
గురు పదార్థముల కన్పరచువాడ!
పరమాణు గర్భస్థ బహుసూక్ష్మ కణములన్
మించుగా ద్రిప్పి క్రీడించువాడ!
ద్రవ్యమున శక్తి, శక్తిలో ద్రవ్యఘనత,
ఆకసము కాలమున కాలమాకసమున!
ద్వైతి మద్వైతమందు, అద్వైతమందు
ద్వైతమును చూపు మాయలవాడ వార!"


అని మహత్తర విశ్వసత్యాల నొకపరి మనస్సులో భావించినప్పుడు శరీరం జలదరించని మానవుడుండడు. భూమితో పరిపోల్చి చూచినప్పుడే మానవుని పరిమాణం, అన్నివిధాలా అత్యంతాల్పంగా స్ఫురిస్తుంది. ఏమంటే, భూగోళం నిడివి సుమారు 8000 మైళ్ళు, మానవుని పొడవు 2 గజాలు; భూమి వయస్సు కొన్ని కోట్ల ఏండ్లు, మానవుని వయస్సు సరాసరి 70 ఏండ్లు. ఎంత వ్యత్యాసం! ఇక భూమిని విడిచి నక్షత్రలోకాలలో విహరించినప్పుడు ఈ వ్యత్యాసం అంతులేకుండా పెరిగిపోతుంది.

ఏరాత్రి సమయమందైనా 'నక్షత్రంబులు కన్పడున్ వెలుగు తున్కల్ బోలె వ్యోమంబునన్.' నక్షత్రాల సంఖ్య అపరిమితమని, నక్షత్రాల వయస్సు అనంతమని చాలకాలంవరకు అనుకొనేవారు. కాని, మూఢుడు బోర్లించినట్లున్న అర్ధాకాశంలో మానవ నేత్రానికి గోచరించు నక్షత్రాలు 3000 కంటె ఎక్కువ లేవని విజ్ఞానులు నిర్ణయించగలిగేరు. దూరదర్శినితో చూస్తే ఆ సంఖ్య పెరుగుతుంది; కాని, కథలలో చెప్పినట్లు అసహాయ నేత్రానికి గోచరించే నక్షత్రాలు మాత్రం గణనాతీతంగా లేవు. వయః పరిమాణాలలో కూడ నక్షత్రానికి నక్షత్రానికి చాల వ్యత్యాసముందని నమ్మడానికి ఇటీవలి పరిశోధనలు సహాయపడుతున్నాయని విజ్ఞానులు భావిస్తున్నారు. కొన్ని నక్షత్రాలు చిరకాలీనములే; వేలకొలది యేండ్ల అనుశీలనలు కూడ వాటిలో మార్పును చూపెట్టలేవు. కాని, సాపేక్షంగా, కొన్ని క్షణభంగురములైన నక్షత్రాలు కూడ లేకపోలేదు. అట్టివి, గెలాక్సీ వయస్సులో శతసహస్ర లక్షాంశ కాలంపాటు దేదీప్యమానంగా నభోవీధిని ప్రజ్వలించి, మనం గుర్తించలేని ద్రవ్యరూపంలోనికి మారిపోతాయి.

గత శతాబ్దాలలో లిఖితమైన అవలోకనలను బట్టి నక్షత్రకూటాలు ఎట్టిమార్పు చెందకుండా వాటి స్థానాలలో యథాతథంగా నున్నాయని భావించేవారు. కాని, అసహాయనేత్రానికి కనిపిస్తున్నంత స్థిరంగా లేవని ఈమధ్యనే తెలియవస్తూంది. కొన్ని నక్షత్రాల ఔజ్జ్వల్యం మారుతుంది; కొన్ని ప్రమాదకరమైన విస్ఫోటానికి లోనై నోవా (*Nova*) గా పరిణామమొందుతాయి.

అపరిమితమైన శక్తిని నక్షత్రాలెవిధంగా ఉత్పత్తిచేస్తున్నాయో తెలిసికోడానికై ప్రయత్నాలు చేసిన సందర్భంలో వాటి వయఃపరిమాణాలవిషయమై కొంతజ్ఞానం లభించింది. సూర్యునివంటి నక్షత్రాలలో ఉదజని కేంద్రకాలు హీలియం కేంద్రకాలుగా రూపాంతరం పొందుతున్నాయి. ఆ ప్రక్రియలో విశేషశక్తి జనిస్తూంది. ఆ ప్రక్రియకు కర్బన కేంద్రకాలును, నత్రజని కేంద్రకాలును దోహదమిచ్చి ప్రక్రియానంతరం అపట్టిమార్పు చెందకుండా, నాలుగు ఉదజని కేంద్రకాలను ఒక హీలియంకేంద్రకంగా సంశ్లేషింపజేసి విడిచిపెట్టుతాయి. ఆ సంవిధానం చిత్రం 1 లో చూపబడింది.

కర్బనకేంద్రకమైన C^{12} తో ఒక ఉదజని కేంద్రకమైన ప్రోటాను H^1 కేంద్రకసంయోగ



చిత్రం 1. కర్బన-నత్రజని చక్రీయప్రక్రియ, ప్రోటానులు హీలియంగా మారు విధానాన్ని వివరిస్తుంది.

మొందుతుంది. అప్పుడు గామా కిరణరూపంలో కొంత శక్తి బహిర్గమించి, నత్రజని కేంద్రకంయొక్క ఐసొటోపు* N^{13} ఏర్పడుతుంది. అది స్థిరమైన కేంద్రకం గాదు. అకొక పాసిట్రాను (ధనావేశం గల ఎలక్ట్రాను) ను విసర్జించి కర్బనంయొక్క ఐసొటోపు C^{13} గా మారుతుంది. C^{13} తో ఒక ప్రోటాను సంయోగించి, గామా కిరణాలుగా కొంత శక్తిని ప్రసరించి, నత్రజని కేంద్రకం N^{14} అవుతుంది.

N^{14} తో మరొక ప్రోటాను సంయోగించి, గామా కిరణాలను ప్రసరించి, ఆమ్లజనియొక్క ఐసొటోపు O^{15} ఏర్పడుతుంది. అస్థిరమైన O^{15} కేంద్రకం ఒక పాసిట్రానును విసర్జించి N^{15} గా మారుతుంది. ఈ నత్రజని కేంద్రకంతో నాల్గవ ప్రోటాను సంయోగిస్తుంది. అప్పుడా కేంద్రకం ఒక ఆల్ఫాకణం (హీలియం కేంద్రకం) గాను కర్బన కేంద్రకంగాను భగ్నమౌతుంది. మొదటి కర్బనకేంద్రకంతో దఫదఫాలను సంయోగించిన నాలుగు ప్రోటానులలో రెండు పాసిట్రానులు పోగా, మిగిలిన రెండు ప్రోటానులు రెండు న్యూట్రానులు సంయోగించి హీలియం కేంద్రకమైనట్లు భావించాలి.

* ఒకే రసాయనిక గుణాలు కలిగి పరమాణు భారంలో వ్యత్యాసం గల పరమాణువులను ఐసొటోపు లంటారు.

నక్షత్రాలన్నిటిలో సుమారిట్టి ప్రక్రియయే జరుగుతుంది. కాని, ప్రక్రియయొక్క వేగం నక్షత్రం నుండి నక్షత్రానికి మారుతుంది. దీనివిషయం తెలిసికోడానికై మనకు మిక్కిలి సన్నిహితమును, అతి పరిచితమును నైన సూర్యగోళంతో ప్రారంభించుట లాభదాయకము.

భూతలాన్ని చేరుకొను సౌరశక్తిని సులభంగా కొలవగలము. ఒక ఘనపు సెంటిమీటరు ఆయతనం గల నీటిని సూర్యకిరణాలకు నిలువుగా క్రిందనుంచి, దాని తాపక్రమం 1 డిగ్రీ సెంటిగ్రేడు పెరగడానికి పట్టే కాలాన్ని కనుగొంటారు. భూతలాన్ని చేరుకోడానికై భూవాతావరణంలోనుండి ప్రయాణం చేసినప్పుడే మాత్రం సౌరశక్తిని వాతావరణం గ్రసించిందో గమనించి, ఆ దోషాన్ని సవరిస్తారు. ఈవిధంగా లెక్కకట్టగా ప్రతి చదరపు సెంటిమీటరు నేలమీద నిమిషానికి రెండు కాలరీల సౌరశక్తి పడుతూన్నట్లు తెలియవచ్చింది. అంటే, ఒక చదరపు సెంటిమీటరుమీద పడే ఎండవేడిమితో ఒక ఘనపు సెంటిమీటరు నీటిని గంటంపావులో మరుగు తాపక్రమంవరకు వేడి చేయవచ్చును.

శక్తిని కొలవడానికి 'ఎర్గు' అనే యూనిటు నుపయోగిస్తారు. ఒక కాలరీ సుమారు 4 కోట్ల ఎర్గులకు సమానం. ఒక రూపాయిని ఒక గజంమీదనుండి నిలువునా క్రిందకు పడేస్తే, అది భూమిని తాకినప్పుడు భూమికిచ్చే శక్తి 10 లక్షల ఎర్గులు.

సెకండుకి రమారమి 10 లక్షల ఎర్గుల చొప్పున సౌరశక్తి ప్రతి చదరపు సెంటిమీటరు భూతలంమీద పడుతూంది. దీనినిబట్టి సూర్యునినుండి బహిర్గమిస్తున్న మొత్తపు శక్తిని లెక్కకట్టగలము. సూర్యుని కేంద్రంగాను, సూర్యునికి మనకిగల దూరాన్ని వ్యాసార్థంగాను ఒక గోళాన్ని చుట్టినట్లూహిస్తే, సూర్యునినుండి వెలువడు శక్తి యావత్తు ఈ గోళతలంపై పడుతుందని గ్రహించాలి. సెకండుకి చదరపు సెంటిమీటరుకి 10 లక్షల ఎర్గుల వంతున, ఈ గోళమంతటిపై సెకండులో పతనమగు శక్తిని గణించగా, దాని పరిమాణము 4×10^{33} ఎర్గులని తెలిసికోగలము. సూర్యుని ద్రవ్యరాశి (*mass*) 2×10^{33} గ్రాములు. అందుచేత, సూర్యునిలోనున్న ప్రతిగ్రాము ద్రవ్యము సగటున సెకండుకి 2 ఎర్గుల శక్తిని ప్రసరిస్తూంది. ఈవిధమైన ప్రసరణం సంవత్సరాల తరబడే కాదు, శతాబ్దాల తరబడే కాదు యుగాల తరబడి జరుగుతూంది. సౌరమండల వయస్సు 300 కోట్ల యేండ్లని విజ్ఞానులు లెక్కకట్టేరు. ఈ మహాకాలంలో సౌరద్రవ్యంలో ప్రతి గ్రాము 2×10^{17} ఎర్గుల శక్తిని ఇంతవరకు ఉత్పత్తిచేసింది. రసాయనిక ప్రక్రియలలో జనించు శక్తికంటె సూర్యునిలో జనించు శక్తి అధమం 50 లక్షల రెట్లు.

సూర్యగోళంనుండి వికిరణమగు మొత్తపు శక్తిని గణించేరు. పరిశోధనాగారాలలో ఒక మూలతత్వం వేరొక మూలతత్వంగా ద్రవ్యాంతరకరణ మొందు సందర్భంలో విడివడు అమితమైన శక్తివిషయం తెలిసిన తరువాత సౌరశక్తి జననానికాధారభూతమైనది కేంద్రక ప్రక్రియ కావచ్చునన్న అనుమానం ఖగోళశాస్త్రజ్ఞులకు కలిగింది. నాలుగు ఉదజని కేంద్రకాలు ఒక హీలియం కేంద్రకంగా సమ్మేళనం చెందినప్పుడు, ఉదజని కేంద్రకాల మొత్తపు ద్రవ్యరాశిలో నూరవ వంతు మాత్రమే శక్తిగా పరివర్తన మొందుతుంది. సూర్యుని ద్రవ్యరాశిలో సగంవరకు ఉదజనే. అంటే, సూర్యునిలోనున్న ఉదజని 10^{33} గ్రాములు. ఇదంతా హీలియంగా మారుతుందనుకొని, ఇప్పటివలెనే సూర్యుడు శక్తిని ప్రసరిస్తాడనుకొంటే 10000 కోట్ల యేండ్లవరకు సూర్యగోళ మీవిధంగానే మహోజ్జ్వలంగా దీపించే అవకాశముంది.

సూర్యునిలో జరుగుతున్న కేంద్రక ప్రక్రియ కొంత మందంగానే సాగుతూందని చెప్పాలి. రిగల్ —మృగవ్యాధ కూటంలోని తార—, సిగ్నస్ కూటంలోని డెనెబ్ నక్షత్రం: ఇట్టి మహోజ్జ్వల తారకలలో సూర్యగోళమందు కంటె ఎక్కువ వేగంతో శక్తి జనిస్తూంది. సూర్యునిలో ఒక్క గ్రాము ద్రవ్యరాశినుండి సెకండుకి 2 ఎర్గుల శక్తి మాత్రమే జనిస్తూంటే, ఈ మహోజ్జ్వల తారలలో ప్రతిగ్రాము ద్రవ్యంనుండి సెకండుకి 10,000 ఎర్గులశక్తి జనిస్తూంది. వీటిలో సగం ద్రవ్యరాశి ఉదజని అనుకొని, సూర్యునిలోవలె వీటిలోకూడ కేంద్రక ప్రక్రియ జరుగుతూందనుకొంటే, ఈ మహోజ్జ్వల తారల భావి జీవితాలు 2 కోట్ల యేండ్లకంటె అధికముండక పోవచ్చు.

రెండుకోట్ల యేండ్లవరకైన ఈ తారలు జీవింపక పోవచ్చు. నక్షత్రంలో నున్న ఉదజని యావత్తు హీలియంగా రూపాంతరం పొందుతుందని పైగతంలో భావించేము. ఈ ప్రక్రియ కొనసాగడానికి అధమం 2 కోట్ల డిగ్రీల తాపక్రమముండాలి. అట్టి తాపక్రమాలు నక్షత్ర కేంద్రభాగమందు మాత్రమే ఉండగలవు. ఉపరితలానికి వస్తున్న కొద్దీ తాప

క్రమం తగ్గిపోతుంది. సూర్యుని కేంద్రతాపక్రమం సుమారు 2 కోట్ల డిగ్రీలు కాగా, సూర్యోపరితల తాపక్రమం 6000 డిగ్రీలు మాత్రమే. అందుచేత, ఉదజని యావత్తు రూపాంతరం పొందాలంటే పై పొరలలోనున్న ఉదజని కేంద్రభాగాన్ని చేరుకొనేటట్లు నక్షత్రంలోని పదార్థం గోళమంతటా కలయబారాలి. తన అక్షంపై అతివేగంగా భ్రమించు నక్షత్రాలలో పదార్థం కలయబారడానికి అవకాశముంది. కాని, మందంగా భ్రమించు తారలలో పై పొరలందుండు ద్రవ్యం కేంద్రాభిముఖంగా గమించగల అవకాశం తక్కువ. సూర్యునిలో ముమ్మరంగా నున్న లిథియమే దీనికి తార్కాణము. సూర్యుడు మందంగా భ్రమించుగోళం. పై పొరలలోనున్న లిథియం కేంద్రభాగానికి వెళ్లే అవకాశముంటే, ఆ తాపక్రమానికి లిథియమంతా భారతరమైన మూలతత్త్వాలలోనికి ఇదివరకే రూపాంతరమొంది ఉండేది.

నక్షత్రాలు స్థిరంగాలేవు; అవి ఆకాశయానం చేస్తున్నాయి. అయినప్పటికి విశ్వప్రమాణాలతో చూచినప్పుడు కొన్ని లక్షలయేండ్లలో కూడ నక్షత్రాలు గమించినట్లు చెప్పలేము. కాబట్టి, మన పరిసరాలలోనున్న పాలపల్లి (*milky way*) యందలి కొన్ని మహోజ్జ్వల తారలు వాటి ప్రస్తుతస్థానాల దాపునే జన్మించే యనుకొనడం తప్పకాదు. మన కళ్ళముందు కొన్ని క్రొత్తనక్షత్రాలు జనిస్తూండ వచ్చును. కాని, నక్షత్ర జననం నిరంతరం సాగవచ్చునన్న భావాన్ని కొందరు ఖగోళజ్ఞు లంగీకరించరు. ప్రాథమికమైన ధూళివాయుపదార్థాలనుండి మన గెలాక్సీలోని నక్షత్రాలన్నీ సుమారొకేసారి జన్మించే యనిన్నీ, ఇప్పుడు మహోజ్జ్వలంగా నున్న తారల జాజ్వల్యానికి ముఖ్యకారణం వాటి ఆకాశయానంలో నక్షత్రాంతరాళమందు మేఘరూపంలో నున్న ద్రవ్యాన్ని ప్రోగుచేసికొనడమేననిన్నీ జర్మన్ విజ్ఞాని వైజ్ సేకర్ భావిస్తున్నాడు దీనికి 'కాయకల్ప' (*Rejuvenation*) ప్రక్రియ అంటారు.

రిగల్ డెనెబ్‌లవంటి నక్షత్రాలు బహు ప్రాచీనమైన సూర్యుని తరగతికి మాత్రం చెందవన్నది నిశ్చయము. అత్యుష్ణ యువతారల జనన పరిణామాల రహస్యాలు, కొంతవరకు, నక్షత్ర పుంజాలలో దొరకవచ్చును. పుంజంలోనున్న నక్షత్రాలన్నీ ఒకే వయః పరిమాణం గలవని భావించడానికి ఆధారాలున్నాయి. పెర్సియస్ కూటంలో అట్టి నక్షత్రపుంజ మొకటుంది. ఆ పుంజమందలి ఒక నక్షత్రగణాన్ని పరిశీలించగా లభించిన ఫలితాలు యువనక్షత్ర సిద్ధాంతాన్ని అమోఘంగా బలపరిచేయి.

వదులు వదులుగానున్న నక్షత్ర గణాలను సోవియెట్ ఖగోళజ్ఞుడైన అంబర్ జూమియన్ ఈ మధ్యనే పరిశీలించేడు. వాటిని నక్షత్ర 'సంఘాలు' అన్నాడు. ఈ సంఘాలలో సాపేక్షంగా కొద్ది మాత్రమే నక్షత్రాలున్నాయి; అవైనా దూరదూరంగా నున్నాయి. అందుచేత, ఆ నక్షత్రాల మధ్యనున్న గురుత్వాకర్షణబలం వాటినొక సంఘంగా నుంచగలిగినంత ఎక్కువగా నుండదు. మొదటిలో ఆ నక్షత్రాలు గమిస్తుంటే, పరిసర నక్షత్రాల ఆకర్షణబలం వాటిమీద ప్రవర్తించక పోవుటచేత, దేనికదే సమవేగంతో ప్రయాణిస్తుందనుకొనవచ్చును. పెర్సియస్ కూటమందలి ఒక నక్షత్ర సంఘాన్ని పరిశీలించిన డచ్ ఖగోళజ్ఞుడు బ్లావు, సెకండుకి 7½ మైళ్ళ వేగంతో ఆ నక్షత్రాలు చెదిరిపోతున్నట్లు కనుగొన్నాడు. ఇప్పుడా గుంపు యొక్క నిడివి 500 కాంతి సంవత్సరాలు. ఆదిలో ఒకేగుంపులో దగ్గరగానున్న నక్షత్రాలు ఈప్రకారం చెదిరిపోతూండినట్లయితే, ఇప్పటి 500 కాంతి సంవత్సరాలమేర వ్యాపించడానికి 10 లక్షల యేండ్లకంటె ఎక్కువకాలం పట్టియుండదు. అంటే, ఆ నక్షత్ర సంఘంయొక్క వయస్సు రమారమి 10 లక్షల సంవత్సరాలనుకోవచ్చు.

వ్యాకోచన లక్షణం గల ఇట్టి సంఘాలు మరికొన్నిటిని ఇతరనక్షత్ర కూటాలలో బ్లావు కనుగొన్నాడు. నక్షత్రవేగాలనుబట్టి సంఘాల వయస్సు నిర్ణయించగా లసెర్టాకూటమందలి నక్షత్రసంఘంయొక్క వయస్సు 4 లక్షల యేండ్లని, సప్తర్షిమండలంలోనున్న సంఘంయొక్క వయస్సు 4½ కోట్ల యేండ్లని తెలియవచ్చింది.

మౌంట్ విల్సన్ వేధశాలలో అనుశీలనలు గావిస్తున్న విజ్ఞాని వాల్టర్ బాడే యువనక్షత్రాలకు వృద్ధనక్షత్రాలకు గల వ్యత్యాసానికి సంబంధించిన భోగట్టా ఎక్కువగా సేకరించేడు. వాయుధూళి సమ్మిళితపదార్థం బాహువులుగా గల ఆండ్రోమెడా గెలాక్సీలో, ఆపదార్థాని కతిసమీపంలోనే యువనక్షత్రాలుంటాయి. బీజభూతమైన వాయుధూళిపదార్థంతోనే ఆబాహువు లేర్పడ్డాయి. గెలాక్సీ కేంద్రకంలో వృద్ధతార లపరిమితంగా నున్నాయి; కేంద్రకానికి బాహువులకి మధ్య కొన్ని వృద్ధతార లున్నాయి. కేంద్రకప్రాంతంలో వాయువుగాని ధూళిగాని లేదు.


నక్షత్రోద్భవ సందర్భంలో అవంతా పూర్తిగా వినియోగమై యుండవచ్చు.

లక్షలకొలది నక్షత్రాలు దగ్గరదగ్గరగా చేరి దట్టంగా ఏర్పడిన కూటాలను గోళీయపుంజా (*Globular clusters*) లంటారు. వాటిలో విశుద్ధమైన వృద్ధతారలున్నాయి. విరళమైన నక్షత్రాంతర ద్రవ్యం ఈ పుంజాలలో కూడ కనిపించదు. దట్టమైన ఈ గోళీయ పుంజాలలో నున్న నక్షత్రాలు మిక్కుటమైన గురుత్వాకర్షణ బలానికి లోనైయుండుటచేత, అవి చెదరిపోజాలవు. లక్షలకొలది సంవత్సరాలా విధంగానే ఉండగలవు. గోళీయ పుంజాలలో వాయు ధూళి పదార్థం లేకపోవుటచేత వాటిలోని నక్షత్రాలు కాయకల్పాన్ని పొందలేవు.


నక్షత్ర పరిణామాన్ని అర్థం చేసికోడానికి ఎక్కువగా సహకరించేది నక్షత్రాల వర్ణౌజ్జ్వల్య పటం. నక్షత్రాల ఉపరితల తాపక్రమాన్నిబట్టి వాటిని కొన్ని శాఖలుగా ఖగోళజ్ఞులు విభజించేరు. అవి *O, B, A, F, G, K, M, R, N, S.* ఈ క్రమాన్ని ప్రధానశ్రేణి అన్నారు. ఒకే ఔజ్జ్వల్యం గల రెండు నక్షత్రాలు వేర్వేరు దూరాలలో నున్నప్పుడు, దూరంగా నున్న నక్షత్రంకంటె దగ్గరగా నున్నది ఎక్కువ ఉజ్జ్వలంగా కనిపించుట సహజమే. సాపేక్షంగా వాటి ఔజ్జ్వల్యాలను చెప్పవలసి వచ్చినప్పుడు, ప్రతి నక్షత్రము మనకు 32½ కాంతి సంవత్సరాల దూరంలోనున్నప్పు డెంత ఉజ్జ్వలంగా కనిపిస్తుందో అదే దాని సహజౌజ్జ్వల్యం (*intrinsic brightness*) అని నిర్వచించేరు. ఒక నక్షత్రంయొక్క దూరం, దాని అభివ్యక్తమైన ఔజ్జ్వల్యం తెలిసినప్పుడు, పై నిర్వచన ప్రకారం, దాని సహజౌజ్జ్వల్యం సులభంగా నిర్ణయించవచ్చు.

O శాఖ నక్షత్రాల ఉపరితల తాపక్రమం మిక్కిలి ఎక్కువ; *S* శాఖ తాపక్రమం అత్యల్పము. *O* నుండి *S* వరకు తాపక్రమం క్రమంగా తగ్గుతుంది. నక్షత్రాలతాపక్రమాన్ని ఔజ్జ్వల్యాన్ని గ్రాఫు కాగితంపై గుర్తిస్తే, పటంలో ఎడంప్రక్క మీదిభాగంనుండి కుడిప్రక్క క్రింది భాగానికి అడ్డంగా ఒక సన్నటి పట్టీ ఏర్పడుతుంది. దానిని రస్సెల్ చిత్ర మంటారు. తొలిసారిగా విజ్ఞాని రస్సెల్ దానిని గీసేడు. ఉష్ణతమమైన యౌవనీల తారలతో ఎడమను ప్రారంభమైన ఆ పట్టీ చల్లటి వృద్ధశోణ తారలతో కుడివైపు అంతమొందుతుంది.

నిత్యపరిణామం చెందుతూన్న నక్షత్రం ఏ అవస్థలో ఏవిధంగా ప్రధానశ్రేణి తారలలో ఒకటిగా మారుతుందో తెలియదు. కాని, ఒక నక్షత్ర కూటం ప్రధానశ్రేణిలో చేరేటట్లు ఏదోవిధంగా పరి




చిత్రం 2. పెర్‌స్యూస్‌లోని తారా పుంజం యొక్క తాపక్రమం-ఉజ్జ్వలతా పటం. అందులో నక్షత్రాలు ప్రధానశ్రేణికి చెందుతాయి.



చిత్రం 3. కృత్తికానక్షత్ర పుంజంయొక్క పటం. ప్రధానశ్రేణియొక్క మీదిభాగం కుడివైపునకు జరిగింది. ఎడమవైపు పైని బృహన్నీలతారలు, కుడివైపుక్రిందని శోణవామనతారలు సూచితములు.


ణామం పొందినవని భావిస్తే, దాని తదనంతర చరిత్ర వర్ణోజ్జ్వలతా పటంనుండి తెలిసికోడాని కవకాశం కలుగుతుంది. ఉదాహరణగా మూడు నక్షత్రకూటాల పటాలుపరిశీలిద్దాము. యౌవనంలోనున్న పెర్ స్యూస్ కూటమందలి తారాపుంజ పట మొకటి—చిత్రం 2; నడివయస్సులోనున్న కృత్తికా పుంజ పటము—చిత్రం 3; హయడీస్‌లోని వృద్ధకూట పటం—చిత్రం 4



చిత్రం 4. హయడీస్ పుంజచిత్రంలో కొన్ని తారలు ప్రధానశ్రేణిమీది భాగంనుండి విడిపోయేయి. ఇట్లు విడిపోయిన కూటంలోని తారలు బృహత్ శోణతారలు.

శోణవామన తారల బాహుళ్యం చూపించే పట్టీలో క్రిందిభాగం ఈ మూడు పటాలలోను సుమా రొకేవిధంగా నుంది. కాని, పట్టీయొక్క పైభాగం మూడు పటాలలోను మూడు విధాలు నుంది. తారల వయస్సు ఎక్కువౌతున్న కొద్దీ భాగం కుడివైపు వంగుతుంది. దీనినిబట్టి తా పరిణామంలో యువతారల స్థానం తిన్నగా కుడివైపునకు జరుగుతుందని ఊహించుకోవచ్చు. నగా, తార యొక్క సహజ ప్రకాశం మారదు కాని, దాని తాపక్రమం తగ్గుతుంది.

పాలపుంతలో సూర్యునికి సమీపంగా రకరకాల వయస్సులలోనున్న తారలున్నాయి. వాటివర్ణో జ్జ్వల్య పటంనుండి (చిత్రం 5) స్పష్టమయ్యే విషయ మేమంటే పైని చర్చించబడిన మూడు తారా



చిత్రం 5. సూర్యునికి సమీపప్రాంతంలో నున్న నక్షత్రాలపటం. ఇందులో బృహత్ శోణ తారలు అధికంగా నున్నాయి. ఈపటంలో మధ్యగా నుండే సూర్యునిస్థానం.

పుంజాలలో కంటె వీటిలో శోణవామన తార లధికంగా నున్నాయని. దీనినిబట్టి సూర్యునికంటె పై మూడు తారా పుంజాలు వయస్సులో చిన్నవని నిర్ణయమౌతుంది. ఆ తారాపుంజాల వయస్సు ముదిరే లోపున వాటిలోని తారలు చెదరిపోతాయి. అయినప్పటికి ఆ నక్షత్రాలు పరిణామం చెందుతూ, కొన్ని శోణ బృహత్తారలు కావచ్చు; మరికొన్ని విస్ఫోటనం చెంది, కొంత ద్రవ్యాన్ని కోల్పోయి శ్వేతవామన తారలుగా మారవచ్చు.

మెస్సైర్ 3 అను సంకేతం గల గోళీయ పుంజం యొక్క వర్ణోజ్జ్వల్యపటాన్ని పరిశీలిస్తే ప్రధానశ్రేణి యొక్క పైభాగం కుడివైపునకు జరిగినట్లు కనిపిస్తుంది. ఎందుకలా జరిగిందో బోధపడదు. కాని, ఆ పటానికి సంబంధించిన ప్రధాన లక్షణాలను వివరించడానికి కనువైన పరిణామ సిద్ధాంతాన్ని మౌంటు విల్సన్ వేధశాలకు చెందిన ఖగోళజ్ఞులు ప్రతిపాదించేరు. సుమారు 500 కోట్ల ఏండ్లక్రిందట ఈగోళీయ పుంజంలోని నక్షత్రాలన్నీ బాల్యావస్థలో ప్రధాన శ్రేణి తారలుగా నుండేవని వారి అభిప్రాయము. ఈ పుంజంయొక్క అప్పటి వర్ణోజ్జ్వల్యపటం నేటి పెర్‌స్యూస్ పటాన్ని పోలి ఉండేది. ఈ తారా పుంజంలో విడిగా విరళద్రవ్యం లేకపోవుటచేత

అందలి నక్షత్రాలు కాయకల్పప్రక్రియ పొందే అవకాశం లేకపోయింది. అందుచేత, వాటి ఉదజనిని హీలియంగా మార్చుకొంటూ అవి పరిణామం చెందజొచ్చేయి. అతివేడిగానున్న తారలలో ఈ మార్పు త్వరగా జరిగింది, చల్లటి తారలలో మెల్లగా జరిగింది. కాని, నక్షత్రంలోనున్న పదార్థం బాగా కలయబారి ఉదజని యావత్తు కేంద్రకంపైపు వెళ్ళకపోవడం చేత, ఒకేలువ హీలియం ఉత్పత్తి కాలేకపోయింది. ఉష్ణతారలలో కేంద్రకంవద్దనున్న ఉదజని హీలియంగా మారినతరువాత కేంద్రకాన్ని ఆవరించియున్న కొద్ది భాగంలో మాత్రమే ఈ ద్రవ్యాంతరకరణం *(Transmutation)* జరుగుతుండేది. ఆ సమయంలో నక్షత్రం వ్యాకోచించి బాగా పెరగజొచ్చింది. దీని ఫలితంగా తాపక్రమంలోను ఔజ్జ్వల్యంలోను మార్పులు కలిగేయి.

మన సూర్యుని చుట్టుప్రక్క నున్న బృహత్తారలను *M 3* పటంలో సరిస్తే, *M 3* శ్రేణియొక్క మీది కుడిభాగానికి క్రిందస్థానాల వ్యాక్రమిస్తాయి. మన నక్షత్రాలకు గోళీయ పుంజంలోని నక్షత్రాలకు వాటి రచనావిధానంలోనే భేదమున్నదని ఇది సూచించవచ్చును. ఆరంభంలో వాటి రాసాయనిక సంఘటనే వేరుగా నుండేదేమో!

నక్షత్రాల ఉపరితల లక్షణాలనుబట్టి వాటి గర్భరహస్యాలను పూర్తిగా తెలిసికోగలమని నిశ్చయంగా చెప్పలేము. నక్షత్రాల ఉపరితలాలు బహువిధాలుగానున్నాయి. కర్బన—నత్రజని చక్రానుగుణంగా (చిత్రం 1) ఉదజని హీలియంగా మారు ప్రక్రియలో జనించు C-13 అను కర్బన ఐసొటోపు కొన్నిటిలో సాపేక్షంగా అత్యధిక పరిమాణంలో నుంది. నక్షత్రాలలో పదార్థం బాగా కలయబారుతుందను వాదానికిది విసర్జనం కావచ్చును.

టెక్నీషియం అను లేపమో ధాత్వికపదార్థం కొన్ని చల్లటి నక్షత్రాలలో ఎక్కువగా నున్నట్లు మౌంటు విల్సన్ వేధశాలలో కనుగొన్నారు. మన భూమిలో సుమారు నిరవశేషంగా టెక్నీషియం విచ్ఛిన్నమైపోయింది. కాని, సుస్థిరమూలకాల త్వైమైన కాలద్వీనం ఎంత జాస్తిగా నుంటో అనకముందైనా టెక్నీషియం ఆ నక్షత్రాలలో నున్నట్లు తెలియవచ్చింది. అందుచేత, ఆ నక్షత్రాల వయస్సు 100,000 ఏండ్లకు మించి ఉండదు. అంటే, లక్ష సంవత్సరాల క్రితం జన్మించిన నక్షత్రాలు సైత మున్నాయని అంగీకరించవలసివస్తుంది.

నక్షత్రాలన్నీ జగత్తులో ఒకేసారి పుట్టలేదు. నక్షత్ర పరిణామం ఆకాశ గహ్వరాలలో అవిచ్ఛిన్నంగా జరుగుతూంది. శిశుతార లుద్భవిస్తున్నాయి; వృద్ధతారలు వ్యాకోచించి చల్లారుతున్నాయి. ఈ మహావిశ్వంలో అసంఖ్యాక తారాకుటుంబాల జనన పరిణామ చరిత్ర మహాద్భుతము! *

"అలరెడి కందుకంబు లటు
లంబరమున గుయి సేయు గోళముల్,
విలయము నందు దక్కు నిజ
దీప్తుల దప్పు, నపాయ మెద్దియున్
గలుగదు నీకు, మానవుల
కన్నుల కెద్ది భరంబు కాన, నీ
కలవడు గాక దివ్య మహి
మాన్విత చక్షువు లిష్ట వత్కృతీ!"

(స్వప్నానుభూతి)

* అలోస్టుర్ది వె వ్రాసిన "ది ఇవోల్యూషన్ అఫ్ స్టార్స్" దీనికి ముఖ్యాధారం. దీనిలో చిత్రాలును ఆ వ్యాసంలోనివే.

గ్రంథవిమర్శనము

ఎంకిపాటలు

గ్రంథకర్త: నండూరి వెంకటసుబ్బారావు, బి. ఏ., బి. ఎల్. ప్రతులకు: గ్రంథకర్త లేక, సుండి మెడాన్. పబ్లిషర్స్: పవర్ పేట, ఏలూరు. వెల: మూడు రూపాయలు.

ఇంచుమించుగా 28 ఏళ్ళకిందట ఎంకిపాటల ప్రథమ ముద్రణం జరిగింది. ఆ కాలంలో ఈ పాటలనేకమైన 'గాలి దుమారా'లకు లోనయ్యాయి. దిగ్దంతులవంటి పండితులనేకులీ గాలి దుమారాల్లో పాల్గొన్నారు. క్రమంగా ఇవి ప్రజా పండితాదరణా లందుకొని నవ్యాంధ్ర సాహిత్యంలో స్థిరమైన గౌరవం సంపాదించుకున్నాయి.

ఈ ద్వితీయ ముద్రణంలో శ్రీ సుబ్బారావుగారు ప్రథమ ముద్రణ జరిగిన తరవాత ఇంచుమించుగా ఈనాటివరకు రచించిన కొత్త పాటలన్నీ చేర్చారు. ఇవి సుమారు నలభై పాటలదాకా ఉన్నాయి.

పాత పాటలకు, ఈ ముద్రణంలో చేర్చిన కొత్త పాటలకు కొన్ని ముఖ్య విభేదాలు కనిపిస్తున్నాయి. పాత పాటలన్నీ స్వచ్ఛమయిన వ్యావహారిక భాషలో సరళమయిన జానపద ధోరణిలో సాగిపోతూంటాయి.

కొత్తపాటలలో భాష క్రమక్రమంగా గ్రాంథికంగా మారిపోయింది.

ఈ కొత్తపాటలలో మరి ఒక ముఖ్యమైన విభేదంకూడా కనబడుతున్నది. మొట్టమొదటి సంపుటంలో ప్రచురించిన పాటలలో ఎంకి - నాయుడు బావలవలపు సహజమయిన పల్లీపరిసరాల్లో సాగిపోతుంది.

ఈ క్రిందిపాట పాతపాటల్లో ప్రతిఫలించిన సహజతకు, సరళతకు ఒక చక్కని ఉదాహరణగా ఇవ్వవచ్చును.

ఎంకితో తిరపతి.

ఎంకీ నాతోటి రావే మన
యెంకటేశులుణ్ణి యెల్లీ సూసొద్దాము!

అవుల్ని దూడల్ని
అత్తోరికాగించి
మూట ముల్లీ గట్టి
ముసిలోళ్లతో సెప్పి,
ఎంకీ నాతోటి రావె...

ఆపాటి మీజేటో
పూమాలాకు కొంటూ
కొంగ మెట్లన్నీ నీ
కొంగట్టు ఎక్కాలి
ఎంకీ నాతోటి రావె...

ఇలాగ పల్లీ సాధారణమైన ఎంకి నాయుడు బావల వలపు కొత్తపాటలలో చాలా చోట్ల తాత్త్విక ధోరణిలోకి మారిపోతుంది. అది కొత్త గీతికలలోని వెలుగునీడలు అనే మొదటిపాటలోనే విస్పష్టంగా భాసిస్తున్నది:—

'కోటి గొంతులు కలిపి
పాటపాడే తీరు
వెలుగునీడల వరుస
నిలిచి ఆలింతు.
ఏటి మిలమిలలోన
తోట పవనములోన
వెలుగు నీడలపొత్తు
తెలిసి పాలింతు
'ఎంకెవ్వ'రని లోక
మెప్పుడైన కదిపితే
వెలుగు నీడలవైపు
వేలు చూపింతు!'

ఈ భావమే 'ఏకాంతాలు' అనే ఈ క్రింది పాటలో పార్వతీ పరమేశ్వరులమూర్తి రూపంలో భాసిస్తున్నది.

'ఈ పంచ కీయంద మెవ్వరిడిరోయీ!'
'ఆకాశమున విల్లు అంకాన ఎంకి!'
'చేయిముచ్చటల చెలరేగి రెవరోయీ'
'నెలవంక దరిచుక్క, చిలిపి నాపక్క!'
పగలు కీలెడబా టెరుగ రెవ్వరోయీ!
'శంకరుడుపతి యీవట, యింకెవ్వ రితట!'

అయితే ఈ కొత్తపాటలన్నీ ఇలాంటి తత్త్వపరమైన పాటలే అనుకోకూడదు. సుబ్బారావుగారి పరిణత కవితాశక్తి స్ఫురింపజేసే పాటలుకూడా ఈ విభాగాలలో అక్కడక్కడ కనిపిస్తూనే ఉన్నాయి. 'రాగతీనం' అనే ఈక్రిందిపాట ఈ జాతిపాటలలో పేర్కొనదగినది.

'కొమ్మలో కోయిలా కోయంటదే—
రాగతీనమో యేమొ బాగు వోగెరుగదే!
ఎంకి యూరానుండే,
ఏటిదరి సేమంతి—
'పావాస మింకెవరో
పందదెవరో' నంటి!—కొమ్మలో
పూలెరుగునా కోత
నీరెరుగునా మోత—
మునుగడల కెవరితో
మనసు కలిపేదంటి!—కొమ్మలో
ఏటి కడుపునదాగి
తోట నిదరోయింది.
అలవాటా సొదకు
పాలవాయను కొంటి!—కొమ్మలో
తిరిమి తిరి మేళాను
తిరిగి కోకోయింది
ఆడించె ఆటగా
పాడింది పాటగా!—కొమ్మలో

మొత్తంమీద ఈ రెండు విభాగాలలోను మొదటి దానిలోనే సూటిగా గుండెల్లోకి దూసుకుపోయే ఉత్తమగీతిక లెక్కువగా కనిపిస్తున్నాయి.

కొత్తపాటలలో అక్కడక్కడ కొన్ని చరణాలు పేలవంగా వినిపిస్తున్నాయి.

శ్రీ సుబ్బారావుగారి కవితలో 'మాయదారి తమ్ముడు' వంటి రెండు మూడు గీతికల్లో తప్ప ఎన్నదగిన విషయ వైవిధ్యం లేదు. ప్రేమ ఒకటే ఈ పాటలలో ప్రధాన వస్తువు. కాని జానపద సహజమైన ఆ ప్రేమ భావంలోని అతి సున్నితమైన అంతరువులు, వివిధదశలు ఈ కవి వర్ణించినంత ప్రత్యేక నైపుణితో ఇంత సరళంగా మరి ఏ అధునాతన కవీ సృజించలేదు. ఈ విధంగా ఈ పాటలు మన సారస్వతంలో అనితర సాధారణమైన గౌరవం పొందాయి.

ప్రకాశకులీ పుస్తకంలో మొదటి ముద్రణానికి కీర్తిశేషులు పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి గారు రచించిన 'ఒకటి రెండు మాటలు' అనే పీఠిక, ఆనాడు గ్రంథకర్త రచించిన పీఠిక, తిరిగీ ఈ ముద్రణకు రచించిన పీఠిక కూడా ప్రచురించారు.

ఈ పాటల పూర్వరంగం తెలుసుకోడానికి పీఠికలు బాగా ఉపకరిస్తున్నాయి.

పుస్తకాకారము, ముద్రణ చక్కగా ఉన్నాయి. ఈ ప్రచురణ ఆధునిక కవితాభిమానులందరు తప్పకుండా పరిశీలించదగినది.

Printed & published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No 7, Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad.